RNI No.TELTEL/2005/16755

# ప్రజాబలం

PRAJABALAM Telugu Daily తెలుగు దినపత్రిక

Website: prajabalam.in

Cell: 9292104449 / 9848384973
SRAVANTHI Enterprises
OFFSET PRINTERS

We undertake
Printing of
Daily News Papers

10 జూలై 2025 గురువారం | హైదరాబాద్ | పేజీలు:12 | వెల రూ.2.00 | సంపుటి:21 | సంచిక:36

# తెలంగాణ ప్రజల్లో శాశ్వతంగా, గొప్పగా నిలిచిపోయే విధంగా మా విధానం ఉంటుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

**కృష్ణా జలాశయాలను అప్పనంగా ఆంద్రప్రదేశ్ కు అప్పగించారు**

**తిరిగి మన వాటా రాబట్టేందుకు పోరాటం**

**ఎన్.డి.ఎస్.ఏ మార్గదర్శకాలకు అనుగుణంగా కాళేశ్వరం బ్యారేజిల పునరుద్ధరణ**

**తుమ్మడి హట్టి నుండి మెడిగడ్డ కు మార్చడం**

**ముమ్మాటికి ఇంజనీరింగ్ వైఫల్యంతో పాటు ఆర్థిక విపత్తుకు దారి తీసింది**

**-మంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి**











**హైదరాబాద్ ప్రజాబలం ప్రతినిధి**"కృష్ణా, గోదావరి నదీ జలాల్లో తెలంగాణ హక్కులను ఎవ్వరికీ తాకట్టు పెట్టం. ఎంతటి వారొచ్చినా నిటారుగా నిలబడి కొట్లాడుతం. దేవుడే ఎదురుగా వచ్చి నిలబడినా ఎదురించి ప్రజలకు అండగా నిలబడుతాం. తెలంగాణ ప్రజల్లో శాశ్వతంగా, గొప్పగా నిలిచిపోయే విధంగా మా విధానం ఉంటుంది. ప్రజల హక్కులను తాకట్టు పెట్టం.." అని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు.

ప్రజలు ఒక విశ్వాసం, నమ్మకంతో మాకు అవకాశం ఇచ్చారు. తెలంగాణ ప్రజల హక్కుల విషయంలో దేవుడే వచ్చి ఎదురుగా నిలబడినా దేవుడినైనా ఎదురించి తెలంగాణ ప్రజల తరఫున నిలబడుతం. కృష్ణా, గోదావరి జిలాల్లో తెలంగాణ హక్కుల విషయంలో ఎవ్వరూ అధైర్య పడొద్దు అని భరోసానిచ్చారు.

కృష్ణా, గోదావరి నదీ జలాలు : వినియోగం : వివాదాలు అన్న అంశంపై జరిగిన, జరుగుతున్న పరిణామాలపై జ్యోతీరావు పూలె ప్రజా భవన్‌లో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రి , ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తో పాటు మంత్రులు, ప్రభుత్వ సలహాదారులు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, అధికారులు పాల్గొన్నారు.

కృష్ణా జలాలపై గత ప్రభుత్వంలో జరిగిన పరిణామాలతో పాటు ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టు ప్రాధాన్యత, దాన్ని తర్వాత క్రమంలో తుమ్మడిహెట్టి నుంచి మేడిగడ్డకు స్థల మార్పు, తదనంతర పరిణామాలపై మంత్రి మరో ప్రజెంటేషన్ రూపంలో సమగ్రంగా వివరించారు. మేడిగడ్డలో నీటిని నిలువ చేస్తే ప్రమాదకర పరిస్థితులు ఎదురవుతాయని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ నివేదికలోని అంశాలను విడమరిచి చెప్పారు.

అనంతరం ముఖ్యమంత్రి మాట్లాడుతూ, కృష్ణా, గోదావరి నదీ జలాల విషయంలో జరిగిన, జరుగుతున్న పరిణామాలపై శాసనసభలో అర్థవంతమైన చర్చ జరగాల్సిన అవసరం ఉందన్నారు. నదీ జలాల కేటాయింపుల్లో తెలంగాణ హక్కుల కోసం ప్రభుత్వం తీసుకోబోయే చర్యలపై పాలసీ డాక్యుమెంట్‌ను సభ ముందు అందజేస్తామని చెప్పారు.

స్పీకర్ అనుమతితో నీటి పారుదల రంగ నిపుణులు, న్యాయ శాఖ నిపుణులు, స్టేక్ హోల్డర్స్ అందరినీ ఆహ్వానించి ఒక మంచి సానుకూల వాతావరణంలో చర్చ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. తెలంగాణ శాశ్వత హక్కులను కాపాడుకోవడం కోసం స్పష్టమైన విధానంతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజలకు వాస్తవాలు చేరవేయడమే ప్రభుత్వ ఉద్దేశమని స్పష్టం చేశారు.

వరద జలాలను వినియోగించుకుంటామని ఆంధ్రప్రదేశ్ వాదనను ముఖ్యమంత్రి తోసిపుచ్చారు. ముందు నికర జలాల్లో వాటా తేలాలన్నారు. నికర జలాల్లో వాటా తేలిన తర్వాత మిగులు, వరద జలాల్లో ప్రొరేటా ప్రకారం ఇరు రాష్ట్రాలకు కేటాయింపులు జరగాలన్నారు.

"నీటి వాటాలో తెలంగాణ హక్కుల కోసం సంబంధిత సంస్థలు, కేంద్ర ప్రభుత్వం ముందు వాదనలు వినిపించడమే కాకుండా న్యాయస్థానాల్లో పోరాడుతున్నాం. ఈ విషయంలో నీటి పారుదల శాఖ మంత్రి స్వయంగా సమన్వయం చేస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేసి ఉంటే నీటి వాటాలో రాష్ట్ర హక్కులు దక్కేవి. హైదరాబాద్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజలు కూడా నివశిస్తున్న నేపథ్యంలో హైదరాబాద్ నగరానికి ఉమ్మడి కోటా కింద నీటి వాటా కోరి ఉంటే ఈరోజు పరిస్థితి కొంత భిన్నంగా ఉండేది.

తెలంగాణ నీటిని రాయలసీమకు తరలించడం వల్ల శ్రీశైలం, నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల పరిధిలో విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు పనికిరాకుండా పోయే ప్రమాదం ఏర్పడింది. ఈ రకంగా తక్కువ ధరకు లభించే విద్యుత్ విషయంలోనూ అన్యాయం జరిగింది.

ఉమ్మడి రాష్ట్రంలో చేపట్టిన కల్వకుర్తికి నీటి కేటాయింపులను పూర్తి చేయలేదు. బీమా, నెట్టెంపాడు, నల్గొండకు గ్రావిటీతో తీసుకెళ్లే ఎస్‌–ఎల్ బీసీ పూర్తి చేయలేదు. ఏ ఒక్క ప్రాజెక్టూ పూర్తి చేయని కారణంగా తెలంగాణకు అన్యాయం జరిగింది.

ఉమ్మడి రాష్ట్రంలో గోదావరి నదిపై 2007–08 లో ప్రాణిహిత చేవెళ్ల (డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సుజల స్రవంతి) ప్రాజెక్టు తుమ్మడిహెట్టి నుంచి ప్రాంతాన్ని, అంచనాలను, పేరును మార్చడమే కాకుండా బేసిన్ల సాకుతో రంగారెడ్డి, నల్గొండ జిల్లాల్లోని ఆయకట్టును తొలగించడం వల్ల నష్టం జరిగింది.

ఉమ్మడి రాష్ట్రంలో ఆనాటి ప్రభుత్వం 54 లక్షల ఎకరాలకు నీరిస్తే, ఎకరాకు 93 వేల రూపాయలు ఖర్చయింది. తెలంగాణ ఏర్పడిన తర్వాత ప్రభుత్వం 15 లక్షల ఎకరాలకు నీరు ఇస్తే, ఎకరాకు 11.47 లక్షల రూపాయలు ఖర్చు చేసింది. ఇలా ప్రతి విషయంలోనూ ప్రజలకు వాస్తవాలు తెలియజేయాల్సిన అవసరం ఉంది.

నీటి వాటాలకు సంబంధించిన అంశాలపై జరిగిన, జరుగుతున్న పరిణామాలపై సమగ్రమైన చర్చ జరగాల్సిన అవసరం ఉంది" అని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. వాస్తవాల ప్రాతిపదికన ఒక నివేదికను అందించారని ఈ సందర్భంగా ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ముఖ్యమంత్రి అభినందనలు తెలియజేశారు.

ఆంద్రప్రదేశ్ కు కృష్ణా జలాశయాలను అప్పనంగా అప్పగించిన ఘనత ముమ్మాటికి బి.ఆర్.ఎస్ పాలకులదేనని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి కెప్టెన్ ఎన్.ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆరోపించారు. ఆంద్రప్రదేశ్ తో కుమ్మక్కై నీటి మళ్లింపులకు పాల్పడ్డారని ఆయన దుయ్యబట్టారు.

డాక్టర్ జ్యోతిరావు పూలే ప్రజాభవన్ లో కృష్ణా జలాశయాలను ఆంద్రప్రదేశ్ కు అక్రమంగా తరలించిన అంశంతో పాటు తుమ్మడిహట్టి నుండి మెడిగడ్డ కు ప్రాజెక్టును మార్చిన అంశంపై మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ నిర్వహించారు.

ముఖ్య అతిధులుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గౌరవ అతిధులుగా ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క,పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ లతో పాటు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,జూపల్లి కృష్ణారావు,వాకిటి శ్రీహరి,పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి,వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ 2014 నుండి 2023 వరకు సాగిన బి.ఆర్.ఎస్ పాలనలో కృష్ణా జలాశయాలలో తెలంగాణాకు రావలసిన నీటి వాటాను రాబట్టుకోవడంలో ఘోరంగా విఫలమైందని ఆయన ఆరోపించారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 2004 నుండి 2014 వరకు ఆంద్రప్రదేశ్ 245.3 టి యం సి ల నీటిని తరలించుకు పోగా 2014 నుండి 2024 వరకు 1,192.44 టి.యం.సి లకు పెరిగిందని ఆయన తన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో సోదాహరణంగా వివరించారు

తద్వారా రాయలసీమ ఎత్తిపోతల పథకం, ముచ్చుమర్రి ప్రాజెక్టుల విస్తరణకు మార్గం సుగమం అయిందని ఆయన పేర్కొన్నారు

అయితే ఈ పనులన్నీ కేంద్ర జల సంఘం అనుమతులు లేకుండా ఆంద్రప్రదేశ్ పునర్విభజన చట్టాన్ని ఉల్లంఘించి చేపట్టారని ఆయన తెలిపారు.బి ఆర్ ఎస్ ప్రభుత్వం కే. ఆర్.యం.బి కి గానీ, కేంద్ర జల సంఘం వద్ద ఎటువంటి అభ్యంతరం చెప్పక పోవడం శోచనీయమన్నారు

బి.ఆర్.ఎస్ ప్రభుత్వ హయాంలో 2015 లో ఆంద్రప్రదేశ్ కు 512 టి.యం.సి లు,తెలంగాణకు 299 టి.యం.సి లు వినియోగించేలా 2017 లో తెలంగాణాకు 34 శాతం ఆంద్రప్రదేశ్ కు 66 శాతం చేసుకున్న ఒప్పందం 2020 వరకు కొనసాగిందని ఆయన తెలిపారు

అయితే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 2025 మార్చి 3 న కేంద్ర జలశక్తి మంత్రికి రాసిన లేఖలో మొత్తం 811 టి.యం.సి లలో తెలంగాణాకు 61 శాతం అంటే 575 టి.యం.సి లను కేటాయించాలని అధికారికంగా చేసిన డిమాండ్ ను ఆయన గుర్తు చేశారు.

ఆంద్రప్రదేశ్ ప్రభుత్వం అక్రమంగా తరలించుకుని పోయిన నీటిలో మచ్చుమర్రి ఎత్తిపోతల పథకానికి 0.85 టి.యం.సిల సామర్థ్యం నుండి 3 టి.యం.సి లకు,రాయలసీమ ఎత్తిపోతల పథకం 3 టి.యం.సి ల నుండి 8 టి.యం.సి ల సామర్థ్యంకు పెంచుకున్నారని ఆయన తెలిపారు. అంటే అప్పుడు అధికారంలో ఉన్న బి.ఆర్.ఎస్ ప్రభుత్వం అవలంబించిన ఉదాసీనతతో ఆంద్రప్రదేశ్ ప్రభుత్వం 11 టి.యం.సి ల నీటి సామర్థ్యం పెంచుకుందని ఆయన దుయ్యబట్టారు

అదే విదంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం పై ఆయన ప్రస్తావిస్తూ కేంద్ర జలసంఘం అనుమతితో 165 టి.యం.సి లతో రూపొందించిన చేవెళ్ల-ప్రాణహిత ప్రాజెక్టును బి.ఆర్.ఎస్ ప్రభుత్వం మెడిగడ్డ కు మార్చడంతో రాష్ట్రంలో ఆర్థిక విపత్తు సంభవించిందని ఆయన మండిపడ్డారు.అప్పటికే 11,679 కోట్లు ఖర్చు పెట్టడంతో పాటు కేంద్ర ప్రభుత్వం నుండి 80 శాతం సహాయం పొందే అవకాశం ఉన్నప్పటికీ రాజకీయ ప్రయోజనం కోసమే ఉద్దేశపూర్వకంగా మార్చారని ఆయన విమర్శించారు

అవసరమైన బోర్ హెల్స్ తవ్వక పోవడం,డిజైన్ మార్చడం వంటి అనేక కారణాలతో మెడిగడ్డ బ్యారేజ్ కుప్పకూలిందని ఎన్.డి.ఎస్.ఏ ఇచ్చిన నివేదికలో స్పష్టం అయ్యిందన్నారు.155 టి.యం.సి లలో 63 టి.యం.సి ల నీటిని నిరుపయోగంగా వదిలేశారన్నారు.కేవలం 27 టి.యం.సి ల నీరు మాత్రమే రిజర్వాయర్లకు చేరిందని ఆ నీటితో కేవలము 98,570 ఎకరాలలే సాగులోకి వచ్చిందన్నారు.37 లక్షల ఎకరాలు సెద్యం లోకి వచ్చిందని చేస్తున్న ప్రచారంలో నిజం లేదని ఆయన తేల్చిచెప్పారు.

అటువంటి ప్రాజెక్ట నిరుపయోగంగా మారినా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వచ్చిందన్నారు

ఎన్.డి.ఎస్.ఏ మార్గదర్శకాలకు లోబడి ప్రాజెక్టును పునరుద్దరిస్తామని,అయితే ప్రమాదకరంగా మారిన నిర్మాణాల్లో నీటిని నిల్వ చేయబోమన్నారు.

ఎటువంటి కారణాలు లేకుండానే తుమ్మడిహట్టి నుండి మెడిగడ్డకు మార్చిన బి.ఆర్.ఎస్ నేతలు తమ తప్పును కప్పిపుచ్చుకునేందుకే చేస్తున్న విమర్శలు ప్రజాక్షేత్రంలో నిలబడవన్నారు

తెలంగాణ రైతాంగం కోసం రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందని ఇందులో ఎటువంటి రాజీ ప్రసక్తే లేదని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

## తెలంగాణలో పారిశ్రామిక ప్రగతి, ఉపాధి కల్పన రంగాలను బలోపేతం చేసేందుకు పటిష్ట చర్యలు చేపడుతున్నామన్న మంత్రి శ్రీధర్ బాబు

**రాష్ట్రంలోని సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ), స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) పునరుద్ధరణకై కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్ డి కుమారస్వామి నిర్వహించిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న మంత్రి శ్రీధర్ బాబు**

రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ పునరుద్ధరణకు నోచుకున్నట్లుగానే సిసిఐ, ఎస్ఐఐఎల్ ల పునరుద్ధరణకు ప్రణాళికాబద్ధంగా చర్యలు చేపడుతున్నామన్న మంత్రి

ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబుగారు బుధవారం న్యూఢిల్లీలో కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్ డి కుమారస్వామితో వారి నివాసంలో సమావేశమయ్యారు . గత పర్యటనలో కేంద్రమంత్రి కుమారస్వామిని కలిసిన సమయంలో సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ), భద్రాద్రి కొత్తగూడెంలోని స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) పునరుద్ధరణ పై చర్చించేందుకు త్వరలోనే సమావేశమవుదామని కేంద్రమంత్రి కుమారస్వామి హామీ ఇచ్చిన నేడు ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కుమారస్వామి ఆధ్వర్యంలో సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా సిఎండి సంజయ్ బంగా, ఇతర సంబంధిత కేంద్ర ప్రభుత్వ శాఖల అధికారులతో జరిగిన సమీక్ష సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు.

ఈ సమావేశంలో భాగంగా సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సిసిఐ), స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) పునరుద్ధరణ అవసరాన్ని, ప్రాధాన్యతను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి వివరించారు. గతంలో పెద్దపల్లి జిల్లాలోని రామగుండం ఫెర్టిలైజర్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ పునరుద్ధరణను రూ. 5000 కోట్లతో చేపట్టిన విషయాన్ని మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు.

ఆదిలాబాద్ లోని సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ), స్పాంజ్ ఐరన్ ఇండియా లిమిటెడ్ (ఎస్ఐఐఎల్) మూతపడడానికి దారితీసిన పరిస్థితులను, ఈ పరిశ్రమల పునరుద్ధరణతో యువతకు ఉపాధి అవకాశాల మెరుగుదల, ఆర్థికాభివృద్ధి తదితర అంశాలను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి వివరించారు. వెనుకబడిన, నక్సల్స్ ప్రభావిత ప్రాంతాలైన ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో ఈ పరిశ్రమల పునరుద్ధరణతో ప్రాంతీయాభివృద్ధిలో సమతుల్యత సాధ్యమై రాష్ట్రం, దేశం ప్రగతి బాటలో పయనిస్తాయని మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి వివరించారు. ఆర్థిక, సామాజిక పురోగతికి దన్నుగా నిలిచే ఈ పరిశ్రమలను పునరుద్ధరించాల్సిందిగా కోరారు. సమగ్ర వివరాలతో కూడిన లేఖను మంత్రి శ్రీధర్ బాబు కేంద్రమంత్రికి అందించారు.

ఈ పరిస్థితుల నేపథ్యంలో ఈ నెలాఖరులో తెలంగాణ రాష్ట్రానికి వచ్చి, తెలంగాణలో నెలకొని వున్న కేంద్ర ప్రభుత్వరంగ సంస్థల పనితీరుతో పాటు, సంబంధిత పరిశ్రమల పునరుద్దరణకు చర్యలు చేపట్టే దిశగా సమీక్షను నిర్వహిస్తానని కేంద్రమంత్రి మంత్రి శ్రీధర్ బాబుకు స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాల మేరకు తమవంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు.ఈ సమీక్షా సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబుతో పాటు రాష్ట్ర పరిశ్రమల శాఖ డైరెక్టర్ నిఖిల్ చక్రవర్తి పాల్గొన్నారు.నా



# ప్రజాబలం

## 10 జూలై 2025 గురువారం

## ఏం ఒరగబెట్టారని శాంతి బహుమతి?

ఇటీవలే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ జనరల్ ఆసిమ్ మునీర్‌కు శ్వేతసౌధంలో విందు ఇవ్వడం, అనంతరం పాకిస్తాన్ ప్రభుత్వం నుండి అధికారికంగా ట్రంప్‌కి నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని సిఫార్సు చేయడం. ఇది జరిగి ఇరవై నాలుగు గంటలు గడవకముందే చంచల మనస్తత్వం, దూకుడు స్వభావం కలిగిన ట్రంప్ ఇరాన్ లోని మూడు అణ్వస్త్ర స్థావరాలపై (నతాంజ్, ఫోర్డో, ఇస్ఫహాన్) గత నెల (22-జూన్, -2025) మొదటిసారిగా తయారుచేసి పెట్టుకున్న బంకర్ బ్లస్టర్ బాంబులను ప్రయోగించి ఇరాన్ ఇజ్రాయెల్ మధ్య జరుగుతున్న యుద్ధంలోకి తన ప్రమేయం లేకున్నా సినిమాలలో తళుక్కున మెరిసే అతిథి పాత్రవలే వచ్చి ఇరాన్‌లో విధ్వంస రచన చేసి ప్రపంచ రాజకీయాలలో ఓ చెడు ముద్రను వేసుకున్నాడు. దీని ఫలితం బహుశా ఇజ్రాయెల్ పాలకులు గాని, దానికి వంతపాడే అమెరికా అధికార గణం కూడా ఇరాన్‌ను తక్కువ అంచనా వేయడమే. గత ఇరవై ఒక్క నెలలుగా ఇజ్రాయెల్ గాజాలో ఎంతటి నరమేధం సృష్టిస్తుందో ప్రపంచం మొత్తం రెండు కళ్ళు వెడల్పు చేసుకోని చూస్తూనే ఉంది. పాలస్తీనలో ఇప్పటి వరకు (18 జూన్, %-% 2025 నాటికి) 57,800 మంది చనిపోయారని నివేదికలు తెలియజేస్తున్నాయి. వీరిలో అత్యధికంగా చిన్న పిల్లలు, మహిళలు, వృద్ధులు వీరెవరు ఇజ్రాయెల్ పైకి యుద్ధానికి నేరుగా వెళ్ళినవారు కాదు. అలా అని ఈ ఇరవై ఒక్క నెలల యుద్ధకాలంలో హమాస్ పూర్తిగా తుడిచిపెట్టుకనిపోయిందా అంటే సమాధానం లేని ప్రశ్న. అంటే ఇజ్రాయెల్ హమాస్‌పై యుద్ధం ప్రకటించి ఏం సాధించింది? గాజా ప్రాంతం మొత్తాన్ని నేలమట్టం చేసింది. అక్కడి ప్రజల జీవితాల్ని ఛిన్నాభిన్నం చేసింది. ఇది చాలదన్నట్లుగా ఇరాన్‌పైకి ఆలోచన వచ్చిందే తడవుగా (13 జూన్, 2025 న) దాడికి ఆదేశాలివ్వడం నేతన్యాహు చేసిన రెండో అవివేకపు ఆలోచన. ఇరాన్‌తో యుద్ధం ప్రారంభిస్తే త్వరగా లొంగిపోతుంది. అక్కడి పాలకులతో కాళ్ళబేరానికి రప్పించి అణ్వస్త వ్యాస్తి నిరోధక చట్టం (ఎన్‌పిటి) మీద సంతకం చేయించుకోవాలని చూశారు. కానీ వారు అనుకున్నట్లుగా జరుగలేదు. ఫలితంగా రెండు వైపుల పది రోజుల పాటు (23 -జూన్, -2025 వరకు) జరిగిన యుద్ధంలో ఇరాన్ వైపు సుమారు ఎనిమిది వందల మంది, ఇజ్రాయెల్ వైపు వందమంది పౌరులు మరణించినట్లు సమాచారం. ఇక భౌతికంగా జరిగిన నష్టాన్ని అంచనా వేయడం చాలా కష్టమైన అంశం. గతంలో ఇజ్రాయెల్ అరబ్ దేశాలతో జరిగిన యుద్ధంలో (1967) కేవలం వారం రోజుల్లోనే గెలిచింది. మళ్ళీ ఇరాన్‌పై అలాగే గెలుస్తామని అనుకోవడం ఇజ్రాయెల్ చేసిన అతి పెద్ద పొరపాటు. ఈ పది రోజుల యుద్ధంలో ఇజ్రాయెల్ రక్షణ కవచం (ఐరన్ డోమ్) ఇరాన్ ప్రయోగించిన బాలిస్టిక్ మిసైళ్ళ ముందు తలొంచాల్సి వచ్చింది.

ఫలితంగా ఈ 77 సంవత్సరాల కాలంలో ఇజ్రాయెల్‌కు జరిగిన నష్టం ఇరాన్‌తో ఈ పది రోజుల యుద్ధంలో జరిగింది. ఇజ్రాయిల్ ప్రధాని నేతన్యాహు అమెరికాను ముగ్గులోకి దించి ఇరాన్‌లోని అణ్వస్త్ర స్థావరాలను ధ్వంసంచేసి సంతృప్తి పడొచ్చు. కానీ దాడికి ముందే (22- జూన్, 2025) ఆయా అణ్వస్త్ర స్థావరాలనునుండి శుద్ధి చేసిన యురేనియంను ఇరాన్ తరలించిందన్నది ఓ వార్త కథనం. వెరసి అదే జరిగినా ఇరాన్ అంతర్జాతీయంగా ఈ యుద్ధం ద్వారా ప్రపంచానికి ఓ గట్టి హెచ్చరికను ఇవ్వగల్గింది. ఇరాన్ జోలికి ఎవరు వచ్చినా అంత తేలిగ్గా వదిలి పెట్టం అనేది ఆ హెచ్చరిక సారాంశం. ఈ అంశంలో ట్రంప్ మళ్ళీ ఇజ్రాయెల్ ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కురుర్చింది తానేనని చెప్పి అంతర్జాతీయ మీడియాకు ఓ వార్త సాధనంగా మారగలరు కూడా. ఆపరేషన్ సిందూర్ విషయంలో కూడా అనవసరంగా తలదూర్చి తానే రెండు అణ్వస్త్ర దేశాల మధ్య కాల్పుల విరమణ కుదిర్చానని పదేపదే లీకులు ఇచ్చి మన నాయకత్వాన్ని ఇరకాటంలోకి నెట్టేసే ప్రయత్నం చేయడం గమనార్హం. మరి ఇప్పుడు పాకిస్తాన్ అధికార గణం మళ్ళీ ట్రంప్‌ను నెత్తిన పెట్టుకొని నోబెల్ శాంతి బహుమతి ఇవ్వాలని మళ్ళీ సిఫార్సు చేస్తుందేమో చూడాలి. ఇది చాలదన్నట్లుగా డోనాల్డ్ ట్రంప్ పేరును తన మిత్ర బృందంతో పాటుగా అమెరికా ప్రతినిధుల సభ సభ్యుడు బడ్డి కార్టర్ నార్వేలోని నోబెల్ కమిటీకి లేఖ పంపించడం గమనార్హం. డోనాల్డ్ ట్రంప్ అమెరికా అధ్యక్ష ఎన్నికల సమయంలో తన హయాం లో ఎలాంటి యుద్ధాలు, యుద్ధ వాతావరణం ఉండదని చెప్పి వ్యూహాత్మకంగానే ఇజ్రాయెల్‌తో పాలస్తీనాలోని హమాస్ తిరుగుబాటుదారుల మధ్య తాత్కాలిక కాల్పుల విరమణ ప్రకటింపచేసి, ఎన్నికలు పూర్తి అయిన మరుక్షణం నుండే తిరిగి గాజాలో ఇజ్రాయెల్ సైన్యం మారణహోమం సృష్టించడం ప్రారంభించింది. అక్కడ 24 గంటల్లో చిన్న పిల్లలకు ఆహారం దొరకకపోతే సుమారు పద్నాలుగు వేలకు పైగా చిన్న పిల్లలు చనిపోతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ, గాజాలో సహాయ చర్యల్లో పాల్గొంటున్న స్వచ్ఛంద సంఘాలు చెప్పినా వినకుండా నేటికి కూడా ప్రతిరోజు సుమరుగా 60 మందికి పైగా సైన్యం జరుపుతున్న దాడిలో చనిపోతూనే ఉన్నారు.

మరి ఇవన్నీ అమెరికా అధ్యక్షుడికి తెలియకుండా జరుగుతున్నట్లేనా? దీనికి తక్షణం పెద్దన్నగా ఇజ్రాయెల్‌ను ఒప్పించి శాశ్వత కాల్పుల విరమణ ప్రకటించి గాజా/ పాలస్తీనా పునర్నిర్మాణం దిశగా అడుగులు వేయాలి. అలాగే ఐక్యరాజ్య సమితి (యుఎన్‌ఒ) 1948లో చేసిన ఇజ్రాయెల్ ఏర్పాటుతో పాలస్తీనాకు కేటాయించిన భూభాగాన్ని అగ్రరాజ్యం (అమెరికా) ఇజ్రాయెల్, యురోపియన్ యూనియన్ దేశాలు పాలస్తీనా ప్రాంతాన్ని స్వతంత్ర దేశంగా ప్రకటించి ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం చొరవ తీసుకొని ముందడుగు వేయాలి. తద్వారా పశ్చిమాసియాలో నిత్యం రగిలే రాచపుండు మాదిరిగా ఉన్న పాలస్తీనా సమస్యకు శాశ్వతంగా తెరపడుతుంది. ఇక రెండవది ఒక వైపు నాటోసభ్య దేశాలు, అలాగే యురోపియన్ యూనియన్ దేశాలతో ఉక్రెయిన్‌కు ఆయుధాలు సరఫరా చేస్తూ అగ్రరాజ్యం పరోక్షంగా ఉక్రెయిన్ %-% రష్యా మధ్య యుద్ధాన్ని ప్రోత్సహిస్తూ వుంది. గత రెండున్నర సంవత్సరాలుగా రెండు దేశాల మధ్య యుద్ధం జరగడానికి పరోక్ష కారణం అగ్రరాజ్యమే. దీనినంతటినీ ప్రపంచం గమనిస్తూనే ఉంది. ఈ యుద్ధాన్ని కూడా వెంటనే విరమించేలా డొనాల్డ్ ట్రంప్ క్రియాశీలక పాత్ర పోషించాలి. అలాగే తక్షణమే ఉక్రెయిన్ దేశానికి నాటో సభ్యదేశాలతోపాటు అమెరికా కూడా ఆయుధాల సరఫరా నిలిపివేస్తే యుద్ధం నిలిచిపోతుంది. ఈ విషయంలో కూడా అగ్రరాజ్య అధ్యక్షుడిగా ట్రంప్ చొరవ తీసుకొని ఆయుధాల సరఫరా నిలిపివేయాలి. మూడవ అంశం అగ్రరాజ్యానికి (అమెరికా) ఉగ్రవాద నిర్మూలనే పెద్ద ఎజెండా అయినప్పుడు మన దేశంతో స్నేహం, పొరుగుదేశం (పాకిస్తాన్)తో ఒప్పందాలు ఇలాంటి ద్వంద్వ నీతిని అగ్రరాజ్యం అవలంబించడం మొదటి నుండి వస్తున్నదే. ఇది యావత్ ప్రపంచంలోని మేధావులను తొలుస్తున్న ప్రశ్న. అలాగే ఇజ్రాయెల్ యెమెన్ దేశంతోనూ, సిరియాలోను చేస్తున్న దాడులు వెంటనే ఆపేలా చర్యలు తీసుకోవాలి. ఇవన్నీ అగ్రరాజ్య అధ్యక్షుడిగా ప్రపంచ పెద్దన్నగా పిలువబడే డొనాల్డ్ ట్రంప్ చేయగలడా అన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న! ఏదీఏమైనా ట్రంప్‌ను ఏరికోరి తెచ్చుకున్న అమెరికా ప్రజలకు మిగిలిన మూడున్నర సంవత్సరాలు అమెరిక సమాజానికి, ప్రపంచానికి ఎలాంటి సందేశం ఇస్తాడో చూడాలి. మొత్తానికి డొనాల్డ్ ట్రంప్‌కు నోబెల్ శాంతి బహుమతి ఇవ్వడం అనేది ఈ శతాబ్దాపు జోక్ మాత్రమే!

## ప్రజా భవన్ సాక్షిగా సీఎం రేవంత్ రెడ్డి చేసిన తప్పుడు ప్రచారం పట్ల మాజీ మంత్రి హరీశ్ రావు ఆగ్రహం

**తెలంగాణ నీటి హక్కులను తాకట్టు పెడుతున్న నిన్ను, నీ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కొరడా దెబ్బలు కొట్టాలి**

**కుక్క తోక వంకర అన్నట్లు ఎన్నిసార్లు వాస్తవాలు చెప్పినా అదే తప్పుడు బుద్ధి**

**చర్చకు పిలిచే దమ్ములేకనే ప్రజా భవన్ లో కాంగ్రెస్ ప్రజా ప్రతినిధులతో సమావేశం అయ్యావు**

**ఎమ్మెల్యేల, ఎమ్మెల్సీల ప్రీవిలేజ్ కల్పించినందుకు శాసనసభ, శాసనమండలిలో ప్రివిలేజ్ మోషన్ ఇస్తాం**



పంపులు ఆన్ చేసి రైతాంగానికి నీళ్లు సరఫరా చేయాలని బిఆర్ఎస్ పార్టీ డిమాండ్ చేస్తే.. అది పక్కన బెట్టి అబద్దాలతో నిండిన పీపీటీల కంపు పెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని చూసి తెలంగాణ ప్రజలు నవ్వుకుంటున్నరు.

సీఎం రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి, ఆర్థిక మంత్రి భట్టి పనికి రాని పీపీటీలతో మరోసారి అజ్ఞానాన్ని బయట పెట్టుకున్నారు.

నిజాలు చెప్పే దమ్ములేక తప్పుడు లెక్కలతో, తప్పుడు మాటలతో మభ్య పెట్టే ప్రయత్నం చేయడం తప్ప మీరు చేసిందేం లేదు.

ప్రతిపక్షాల మీద నిందారోపణలు చేయడానికి ఇంత నీచమైన స్థాయికి దిగజారుతారా? మీ అబద్దాలను చూసి యావత్ తెలంగాణ సమాజం అసహ్యించుకుంటున్నది.

మీరు చెప్పిన ప్రతి మాట పచ్చి అబద్దమే అని అసెంబ్లీ లోపల, బయట అనేక సార్లు సాక్ష్యాధారాలతో సహా వివరించాను.

అయినా కుక్క తోక వంకర అన్నట్లు పదే పదే చెప్పిన అబద్దాలు చెబుతూ నిజాలుగా భ్రమింపచేసే కుట్రలకు పాల్పడుతుండటం సిగ్గుచేటు.

తెలంగాణ వాదులు బయట ఉంటే, తెలంగాణ ద్రోహులంతా ప్రజా భవన్ లో చేరి అబద్దాలు, అసత్యాలు ప్రచారం చేసారు.

50 ఏండ్ల పాలనలో తెలంగాణ నీటి పారుదల రంగాన్ని, సాగు రంగాన్ని నిర్వీర్యం చేసింది కాంగ్రెస్ పార్టీ.

పదవుల కోసం పెదవులు మూసుకొని ఆంధ్రాకు దాసోహం అన్నది నాటి మంత్రులుగా ఉన్న నేటి మంత్రులు.

ఇప్పుడు మళ్లీ అదే రీతిలో ఆంధ్రాకు నీళ్ల తరలింపులో తోడ్పాటు అందిస్తున్నది కాంగ్రెస్ పార్టీ.

అప్పుడు, ఇప్పుడూ ఎప్పుడూ మీది ద్రోహ చరిత్రనే రేవంత్ రెడ్డి.

దయ్యాలు వేదాలు వల్లించినట్లు నేడు సుద్దపూస మాటలు మాట్లాడుతున్నవు.

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పక్కనబెట్టి రంగారెడ్డి, నల్గొండ ప్రాంతాలను విస్మరించామని విభజన చట్టం చూపుతూ తప్పుదోవ పట్టించిన రేవంత్ రెడ్డి..?

పాలమూరు రంగారెడ్డి ప్రాజెక్టు ద్వారా నాగర్ కర్నూల్, మహబూబ్ నగర్, నారాయణ పేట్, నల్గొండ, రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లోని 70 మండలాలు, 1226 గ్రామాల్లోని 12.30 లక్షల ఆయకట్టుకు నీళ్లు ఇచ్చే విషయం గురించి దాచి పెట్టే కుట్ర ఎందుకు చేస్తున్నావు.

ఉమ్మడి రాష్ట్రంలో 50లక్షల ఎకరాలకు కాంగ్రెస్ ప్రభుత్వం నీళ్లు ఇచ్చిందని పచ్చి అబద్దాలు చెబుతున్న రేవంత్ రెడ్డి దమ్ముంటే ఆధారాలు బయటపెట్టు.

బిఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్లలో 48.74 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చింది వాస్తవం కాదా. ఇరిగేషన్ శాఖ ఇంజినీర్లు నీకు ఇచ్చిన నివేదికలోనే ఇది ఉంది.

మీ కాంగ్రెస్ ప్రభుత్వం చేతగానితనం వల్లనే ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు మూలన పడింది.

తమ్మిడి హట్టి దగ్గర 152 మీటర్ల ఎత్తులో ప్రాజెక్టు చేపట్టేందుకు మహారాష్ట్ర ఒప్పుకోకున్నా అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం కాలువలు తవ్వి, మొబిలైజేషన్ అడ్వాన్సులను కాంట్రాక్టర్లకు కట్టబెట్టింది నిజం కాదా?

ప్రాణహిత డిజైన్ తో 3 వేల ఎకరాలకు పైగా ముంపు ఉంటుందని మహారాష్ట్ర ప్రభుత్వం తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది నిజం కాదా?

ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ అప్పటి మహారాష్ట్ర సీఎం పృథ్వి రాజ్ చవాన్ నాటి ఆంధ్రప్రదేశ్ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి కి లేఖ రాయడం నిజం కాదా?

ప్రతిపాదించిన రీతిలో ప్రాజెక్టుకు ఒప్పుకోబోమని, అయినా ప్రాజెక్టు కడితే ఖర్చు వృథా కాక తప్పదని చవాన్ గారు హెచ్చరించిన మాట వాస్తవం కాదా?

చాప్రాల్ వన్యప్రాణి అభయారణ్యంతో తమ్మడిహట్టి ప్రాజెక్టుకు సమస్య ఉండటం వాస్తవం కాదా?

కేంద్ర జలసంఘం నీటి లభ్యత లేదని చెప్పడం వాస్తవం కాదా?

ఏ సమస్య లేకున్నా బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రాణహిత ప్రాజెక్టును పక్కనబెట్టిందని చెప్పడం పచ్చి అబద్ధం.

2007లో మొదలు పెట్టిన ప్రాజెక్టును 2014 వరకు ఎందుకు పూర్తి చేయలేదు. కనీసం అనుమతులు కూడా ఎందుకు సాధించలేదు?

కేంద్రంలో, మహారాష్ట్ర, ఏపీలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండి కూడా ఎందుకు చేతులు ముడుచుకొని కూర్చొన్నారు?

ప్రాణహిత చేవెళ్ల నిర్మాణ వ్యయాన్ని రూ. 17,875 కోట్లతో నిర్మించేందుకు 2007 మే నెలలో జివో నెంబర్ 124 విడుదల చేసారు.

కేవలం 19 నెలల్లోనే 38, 580 కోట్లకు అంచనాలు పెంచుతూ జీవో ఇచ్చారు.

కేంద్ర జలసంఘానికి ప్రతిపాదనలు పంపినప్పుడు 40 వేల 300 కోట్లకు పెంచారు.

కమీషన్ల కోసం అంచనాలు పెంచామంటున్న ఉత్తం గారు, ఏ కమీషన్లు దండుకునేందుకు 17వేల కోట్ల నుంచి 40వేల కోట్లకు అంచనాలు పెంచారు? ఎవరి జేబుల్లోకి అవి వెళ్లాయి?

ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు తెలంగాణ ప్రాంతానిది కనుకే అప్పటి కాంగ్రెస్ పార్టీ అంతర్రాష్ట్ర కిరికిరి లో పెట్టి, పనులు ముందుకు పోనివ్వనిది నిజం కాదా?

మసి పూసి మారేడు కాయ చేస్తే నిజాలు దాగవు.

మేడిగడ్డ ను పడావు పెట్టి నీళ్లను కిందకు వదిలి చోద్యం చూస్తున్న రేవంత్ రెడ్డి.. అధికారంలోకి వచ్చి 20 నెలలు అయ్యింది.

మేడిగడ్డను రిపేర్ చేయాలని ఎన్డీఎస్ఏ చెప్పినా, ఎల్ అండ్ టీ రిపేర్ చేయడానికి సిద్దపడినా ఎందుకు మరమ్మతులు చేయడం లేదు.

అప్పుడు ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టును పడావు పెట్లారు, ఇప్పుడు మేడిగడ్డను పండబెడుతున్నరు.

రైతు ప్రయోజనాల కంటే మీకు రాజకీయ ప్రయోజనాలే ఎక్కువా? తెలంగాణ ప్రయోజనాల కంటే ఆంధ్రాకు నీళ్లు తరలించడం పైనే దృష్టి.

మేడిగడ్డ బ్యారేజీ మీది నుంచి వాహనాలు అనుమతించాలని ఎన్డీఎస్ఏ నీకు చెప్పిందా? కూలిందని చెప్పుకుంటూనే ఎందుకు రాకపోకలు అనుమతిస్తున్నారు.

ఏ నిపుణుల కమిటీ చెప్పింది రేవంత్ రెడ్డి?

అసెంబ్లీకి నిపుణులను పిలవడం కాదు, నీ జూబ్లీ హిల్స్ ప్యాలెస్ కు నిపుణులను పిలుచుకొని ముందు మాట్లాడు. తర్వాత సుద్దులు చెబుదువు గాని.

జూరాల జలాశయం నికర నిల్వ సామర్థ్యం 7 టిఎంసిలు మాత్రమే. దీని మీద ఇప్పటికే బీమా, నెట్టెంపాడు, కోయిల్ సాగర్, ఉమ్మడి మహబూబ్ నగర్ లోని తదితర పట్టణాల తాగు నీటి అవసరాలు ఉన్నాయి.

దీనికి అదనంగా రోజుకు 2 టీఎంసీలు ఎత్తిపోసే పాలమూరు ప్రాజెక్టు భారం మోపడం సాధ్యమవుతుందా? పాలమూరు బిడ్డను అని చెప్పుకునే నీకు ఆ మాత్రం తెల్వదా రేవంత్ రెడ్డి.

కృష్ణా జలాల్లో 299:512 వాటాకు రాష్ట్రం ఏర్పడక ముందే ఒప్పుకొని మరణ శాసనం రాసిందే కాంగ్రెస్ పార్టీ.

ఆనాటి కాంగ్రెస్ చేసిన తప్పుకు తెలంగాణ ఇప్పటికీ శిక్ష అనుభవిస్తున్నది.

సెక్షన్ 3 సాధించింది కేసీఆర్ గారు, ట్రిబ్యునల్ ముందు 573 టీఎంసీలకు అఫిడవిట్ ఇచ్చింది కేసీఆర్ ప్రభుత్వం.

అబద్దాలను అందంగా చెప్పే రేవంత్ రెడ్డి. ఎవర్ని కొరడా దెబ్బలు కొట్టాలె?

ద్రోహం చేసింది ఎవరు..కొరడా దెబ్బలు తినాల్సింది ఎవరు?

50 ఏండ్లు తెలంగాణ నీటి హక్కులను కాలరాసిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కొరడా దెబ్బలు కొట్టాలె.

గోదావరి, కృష్ణా నదుల్లో తెలంగాణ వాటాను ఆంధ్రాకు అప్పజెప్పిన కాంగ్రెస్ నాయకులను కొరడా దెబ్బలు కొట్టాలె.

కృష్ణా నీళ్లను పోతిరెడ్డి ద్వారా రాయలసీమకు తరలిస్తుంటే హారతులు పట్టిన ఆనాటి కాంగ్రెస్ మంత్రులను కొట్టాలె.

బనకచర్ల ద్వారా ఏపీకి గోదావరి, కృష్ణా నీళ్లను దారాదత్తం చేసేందుకు కుట్రలు చేస్తున్న నిన్ను కొరడా దెబ్బలు కొట్టాలె రేవంత్ రెడ్డి.

రాష్ట్ర ప్రభుత్వం అధికార భవన్ లో అధికారికంగా నిర్వహించిన నేటి సమావేశానికి మీ పార్టీ ప్రజాప్రతినిధులను, పార్టీ ఫిరాయించిన ప్రజా ప్రతినిధులను మాత్రమే ఆహ్వానించడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే.

ఇరిగేషన్ పై చర్చకు రా అంటూ రంకెలు వేసే రేవంత్ రెడ్డి.. ప్రధాన ప్రతిపక్షమైన బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ఎందుకు పిలవలేదు.

నీ సవాల్ లో నిజాయితీ ఉంటే ఎందుకు ప్రజా భవన్ కు ఆహ్వానించలేదు.

ఇది ఎమ్మెల్యేల ప్రివిలేజ్ కు భంగం కల్పించడమే. దీనిపై బిఆర్ఎస్ పార్టీ శాసనసభ స్పీకర్ కి, శాసన మండలి చైర్మన్ కి ప్రివిలేజ్ మోషన్ ఇస్తుంది.

## ఎంపీ వద్దిరాజు, బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావుకు పరామర్శ



మాతృమూర్తిని కోల్పోయిన మాజీ ఎమ్మెల్యే, ప్రభుత్వ మాజీ విప్ రేగా కాంతారావును తెలంగాణ తొలి ముఖ్యమంత్రి,బీఆర్ఎస్ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రలు పరామర్శించారు.కాంతారావు తల్లి లక్ష్మీనర్సమ్మ బుధవారం తెల్లవారుజామున మృతి చెందారు.సమాచారం తెలిసిన వెంటనే ఎంపీ రవిచంద్ర హైదరాబాద్ నుంచి హుటాహుటిన బయలుదేరి కాంతారావు స్వగ్రామం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం చేరుకుని ఆయన్ను పరామర్శించారు.అలాగే, ఎంపీ రవిచంద్ర బీఆర్ఎస్ అధ్యక్షులు కేసీఆర్ కు ఫోన్ చేసి కాంతారావుతో మాట్లాడించారు,లక్ష్మీనర్సమ్మ మృతి పట్ల కేసీఆర్ తీవ్ర విచారం వ్యక్తంచేశారు, సంతాపం వెలిబుచ్చారు.మనోస్థైర్యంతో ఉండాలని కాంతారావును కేసీఆర్ ఓదార్చారు,ఆయనతో పాటు కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆమె పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని కేసీఆర్, రవిచంద్రలు ఆకాంక్షించారు.

## కల్తీ కల్లు మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలి

**బాధితులకు మెరుగైన చికిత్స అందించాలి**

**తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**

కల్తీ కల్లు తాగి నలుగురు మృతి చెందడం అత్యంత బాధాకరమని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. హైదరాబాద్ లోని హెచ్ఎంటీ కాలనీలో జరిగిన కల్తీ కల్లు ఘటనపై ఆవేదన వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. కల్తీ కల్లు బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని కోరారు.

కల్తీ కల్లు ఘటనలు పునరావృతం ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎక్సైజ్ శాఖ మంత్రి ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. కల్తీ కల్లు పై చర్యల పేరుతో వృత్తినే నమ్ముకుని జీవిస్తున్న గీత కార్మికులను వేధింపులకు గురి చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

# సంచలనాల “బాహుబలి”కి పదేళ్లు

తెలుగు సినిమాకు ప్రపంచ స్థాయి గుర్తింపు తెచ్చిన చిత్రం బాహుబలి. రాజమౌళి ఊహల్లోంచి పుట్టిన బాహుబలి సినిమా ప్రపంచ వ్యాప్తంగా తెలుగు సినిమా సత్తా చాటింది. ఈ సినిమా జూలై 10వ తేదీన 2015 వ సంవత్సరంలో విడుదలై అద్భుతమైన విజయాన్ని సాధించి రికార్డు సృష్టించి, పెట్టిన పెట్టుబడికి నాలుగింతలు కలెక్షన్లు సాధించింది. సుమారు 180 కోట్ల రూపాయల భారీ బడ్జెట్ తో రూపొందిన ఈ సినిమా 650 కోట్ల రూపాయల కలెక్షన్లు సాధించి తెలుగు సినీ జగత్తులో బద్దలు కొట్టలేని విధంగా అనేక రికార్డులు సృష్టించింది. భారీ అంచనాలతో పదేళ్ళ క్రితం జూలై 10న విడుదల అయిన బాహుబలి... భారతీయ సినిమా బాక్సాఫీస్ దగ్గర ఒక బ్లాక్ బస్టర్ గా నిలిచి పోయింది. ఒక ట్రెండ్ సెట్టర్ గా నిలిచి, పలు చిత్రాలకు మార్గ దర్శియై, ఎనిమిది ఏళ్లు పూర్తి చేసుకుంది. ప్రభాస్ హీరోగా, రాణా విలన్ పాత్రలో నటించిన ఈ సినిమాకు రాజమౌళి దర్శకత్వం వహించగా ఆయన తండ్రి విజయేంద్ర ప్రసాద్ కథ అందించారు. ఆర్కా మీడియా వర్క్స్ బ్యానర్ మీద శోభు యార్లగడ్డ, ప్రసాద్ దేవినేని ఈ సినిమాను నిర్మించారు. అనుష్క, రమ్యకృష్ణ, సత్యరాజ్, నాజర్, తమన్నా వంటి వారు ఇద్దరు కీలక పాత్రలలో నటించారు. హీరో ప్రభాస్ తన కెరీర్ లో ఈ చిత్రం కోసం ఐదేళ్లు వెచ్చించారు. 2012 సంవత్సరం నుంచి 2017వ సంవత్సరం వరకు మరో ప్రాజెక్ట్ ఒప్పుకోకుండా ప్రభాస్ ఈ సినిమా పూర్తి చేశారు. సినిమా క్లైమాక్స్ ఒక్కదానికే సుమారు 30 కోట్ల రూపాయల ఖర్చయ్యాయి. ప్రపంచ వ్యాప్తంగా 36 స్టూడియోలలో ఈ సినిమా కోసం విఎఫ్ఎక్స్ ఆర్టిస్టులు పని చేశారు. సుమారు 1300 మంది విఎఫ్ఎక్స్ ఆర్టిస్టులు రాత్రి పగలు తేడా లేకుండా పని చేశారు. సినిమా చిత్రీకరణ జూలై 6, 2013న కర్నూలు జిల్లాలోని ఓర్వకల్లు రాతి ఉద్యా నవనంలో మొదలైంది. సినిమాలో భాగమైన మాహిష్మతి రాజ్యానికి సంబంధించిన భారీ సెట్టుని రామోజీ ఫిలిం సిటీలో కళా దర్శకుడు సాబు సిరిల్ నేతృత్వంలో నిర్మించారు. సినిమాలోని తమ పాత్రలకు అనుగుణంగా ప్రభాస్, అనుష్క, రాణా కత్తిసాము నేర్చుకోగా, ప్రభాస్, రాణాలు అదనంగా గుర్రపు స్వారీలు నేర్చుకోవడం జరిగింది. ప్రపంచ వ్యాప్తంగా 9000 థియేటర్లలో విడుదలైన సినిమా ఒక్క భారత దేశంలోనే 6500 స్క్రీన్ లలో విడుదల చేయ బడింది. ఈ సినిమాలో నటీనటులు ధరించడం కోసం 1500 వెరైటీలకు ఆభరణాలు తయారు చేయించారు. ఒక్కొక్క క్యారెక్టర్ కి ఒక్కొక్క విధంగా ఈ ఆభరణాలు తయారు చేయించారు. రాజమౌళి సినిమా కోసం తమిళ రచయిత మదన్ కార్కి “కిలికిలి” లేదా “కిలికి” అనే పేరుతో ఓ కొత్త భాషను రూపొందించారు. భాషను 750 పదాలతో, 40 వ్యాకరణ సూత్రాలతో రూపొందించారు. సినిమాలో కనిపించే కాలకేయులు అనే తెగ ఈ భాష మాట్లాడుతుంది. ఒక సినిమా కోసం ఓ భాషను రూపొందించడం భారత దేశంలో ఇదే ప్రథమం. భారత దేశంలో అత్యంత వసూళ్ళు సాధించిన సినిమాలలో ఒకటిగా ఈ సినిమా పేరొందింది. 2015లో.. ఉత్తమ చిత్రం, ఉత్తమ దర్శకుడు, ఉత్తమ సహాయ నటి, ఉత్తమ విలన్, ఉత్తమ ఛాయా గ్రహణం, ఉత్తమ సంగీత దర్శకుడు, ఉత్తమ నేపథ్య గాయకుడు, ఉత్తమ కళా దర్శకుడు, ఉత్తమ నృత్య దర్శకుడు, ఉత్తమ శబ్ద గ్రాహకుడు, ఉత్తమ కాస్ట్యూమ్ డిజైనర్, ఉత్తమ స్టంట్ మాస్టర్, ఉత్తమ స్పెషల్ ఎఫెక్ట్స్ విభాగాల్లో నంది పురస్కారాలు పొందడం విశేషం. 2015 లో వచ్చిన మొదటి భాగము బాహుబలి “ది బిగినింగ్”కి కొనసాగింపుగా బాహుబలి 2 “ది కన్ క్లూజన్” చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా 2017 ఏప్రిల్ 28వ తేదీన విడుదల చేసారు. ఈ చిత్రం విడుదలై తొలి రోజే ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల వసూళ్లతో చరిత్ర సృష్టించి, విడుదలైన ఆరు రోజుల్లోనే ప్రపంచ వ్యాప్తంగా దాదాపు 800 కోట్లు వసూలు చేసి, ఆల్ టైమ్ అత్యధిక వసూళ్లు చేసిన భారతీయ చిత్రంగా నిలిచింది. కేవలం పది రోజుల లోనే 1000 కోట్లు పైగా వసూలు చేసిన మొట్టమొదటి భారతీయ చిత్రంగా నిలిచింది. భారత దేశంలో, ఇది అనేక చలన చిత్రాల రికార్డులను నెల కొల్పింది. హిందీలో, తెలుగు మరియు తమిళ భాషలలో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా చరిత్ర పుటల కెక్కింది.

# కృష్ణ పాత్ర ధారణలో పీసపాటికి రారెవరూ సాటి

పీసపాటి నరసింహమూర్తి (1920 జూలై 10 - 2007 సెప్టెంబర్ 28) పేరుపొందిన రంగస్థల నటులు. తెలుగు నాటక రంగంలో శ్రీకృష్ణ పాత్రదారిగా తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని కల్పించుకున్న గొప్ప నటుడు. పద్యగానంలో తనకంటూ ఒక ఒరవడిని సృష్టించుకున్న నటులు. పీసపాటి నరసింహమూర్తి, విజయనగరం జిల్లా బలిజిపేట మండలం, వంతరాం గ్రామంలో 1920, జూలై 10న జన్మించారు. ప్రారంభంలో ఆకాశవాణిలో పనిచేశారు. 1938లో రంగూన్‌రౌడీ నాటకంలో కృష్ణమూర్తి పాత్ర ద్వారా పీసపాటి నాటకరంగం లోకి అడుగు పెట్టారు. 1946లో పాండవోద్యోగ విజయాలు నాటకంలో మొదటి సారిగా శ్రీకృష్ణుడి పాత్ర ధరించారు. ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం ఆయనకు రెండు పర్యాయాలు సంగీత నాటక అకాడమీలో సభ్యత్వం ఇచ్చి గౌరవించింది. ఆంధ్ర విశ్వ విద్యాలయం 1993లో ఆయనను కళాప్రపూర్ణ ఇచ్చి సత్కరించింది. దాదాపు ఏడు దశాబ్దాల పాటు వేలాది ప్రదర్శనలు ఇచ్చిన పీసపాటి జాతీయ స్థాయిలో గుర్తింపు పొందారు. తిరుపతి వేంకట కవులు, కవిసామ్రాట్ విశ్వనాథ సత్య నారాయణ వంటివారు ఎంతగానో అభినందించారు. ఎన్.టి.రామారావు పీసపాటి శ్రీకృష్ణ పాత్ర నటనను చూసి మెచ్చుకున్నారు. పాండవోద్యోగ విజయాలతో పాటు గౌతమ బుద్ధ, లవకుశ, తారా శశాంకం, చింతామణి లాంటి నాటకాలు అనేకం వేసినా, పీసపాటికి ఎనలేని కీర్తి కృష్ణుని పాత్ర వల్లే వచ్చింది. అత్యుత్తమ కృష్ణునిగా ఉద్యోగ విజయాల నాటక రచయితల్లో ఒకరైన చెళ్ళపిళ్ళ వెంకటశాస్త్రి నుంచి అవార్డు అందుకోవడం, టంగుటూరి ప్రకాశం నటరాజు విగ్రహాన్ని బహుమతిగా ఇవ్వటం, బిలాస్‌పూర్లో తెలుగురాని ఒక బెంగాలీ జంట నాటకం చూసి, గ్రీన్ రూమ్‌లో ఇతనిని తనివితీరా ముద్దాడడం తన జీవితంలో మరపురాని సంఘటనలుగా పీసపాటి పేర్కొన్నారు. పద్య గానంలో పీసపాటి అనేక మార్పులు తీసుకు వచ్చారు. తెలుగు పౌరాణికాల్లో పద్యాలను సుదీర్ఘమైన రాగాలతో పాడడం అలవాటుగా ఉండేది. ఒక నిముషం పద్యానికి ఐదేసి నిముషాల రాగం తియ్యడం ఆనవాయితీగా ఉండేది. పీసపాటి ఆ పద్ధతిని విడనాడి, అనవసరమైన సాగతీతలను విసర్జించి, సాహిత్యానికి ఎక్కువ విలువ కల్పిస్తూ పద్యం పాడి ప్రజలను అలరించారు. పీసపాటి కృష్ణుడి వేష ధారణలో కూడా మార్పులు తీసుకు వచ్చారు. దేహానికి అంటిపెట్టుకుని ఉండే నీలపు రంగు చొక్కా ధరించి నిజంగా నీలపు కృష్ణుడేననే భ్రమ కల్పించారు. పీసపాటి 1987-1993 కాలంలో బొబ్బిలి మండలం, రాముడువలస గ్రామానికి సర్పంచిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 1995లో తెలుగు విశ్వ విద్యాలయం నుండి ఆయనకు నాటక రంగంలో విశిష్ట పురస్కారం లభించింది. పీసపాటి నరసింహ మూర్తి 2007, సెప్టెంబర్ 28న మరణించారు.

# అభివృద్ధి కాముకులు అక్కిరాజు వాసుదేవరావు

హుజూర్‌నగర్ నియోజకవర్గ పరిధిలో ఉన్న మేళ్లచెర్వు శివారు వెంకట్రాపపురం నివాసి అక్కిరాజు వాసుదేవరావు. ఆయన కుటుంబం భూస్వామ్య కుటుంబం కావడంతో విద్యకు ప్రాధాన్యతనిస్తూ ఆయనను ఆయన తల్లిదండ్రులు కృష్ణా జిల్లాలో చదివించారు. అక్కడ ఆయన ఎస్ఎస్ఎల్‌సీ వరకు చదవి అంగ్లంలో మంచి పట్టు సాధించారు. 1962ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి అక్కిరాజు వాసుదేవరావు సీపీఐ అభ్యర్థి డి.నరసయ్యపై 2,833 ఓట్లతో గెలుపొందారు. 1967ఎన్నికల్లో తిరిగి కాంగ్రెస్ అభ్యర్థిగా రెండోసారి అక్కిరాజు వాసుదేవరావు సీపీఎం అభ్యర్థిగా పోటీ చేసిన డి.నరసయ్యపై 2,888ఓట్లతో గెలుపొందారు. 1978లో ఏర్పడిన కోదాడ నియోజకవర్గం నుండి జనతాపార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన అక్కిరాజు వాసుదేవరావు కాంగ్రెస్‌ఐ అభ్యర్థి కె.లక్ష్మణ్‌రాజుపై గెలుపొందారు. ఎంతో చైతన్యం కల్గిన హుజూర్ నగర్, కోదాడ నియోజక వర్గాలకు ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించిన అక్కిరాజు వాసుదేవరావు నాటి రాజకీయాలకే వన్నె తెచ్చారు. ప్రజలకిచ్చిన వాగ్దానాలను నెరవెర్చడంలో ఆయన సఫలీకృతులయ్యారు. 1962 నుండి 72 వరకు వరకు రెండు సార్లు కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యే ఎన్నికై బ్రహ్మానందరెడ్డి, పీవీ నర్సింహా రావుల కేబినెట్ లలో మంత్రిగా పనిచేశారు. అనంతరం 1977 కోదాడ నియోజకవర్గం ఏర్పడిన అనంతరం ఆయన 1978లో జరిగిన ఎన్నికల్లో జనతా పార్టీ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి వచ్చిన నేపథ్యంలో కొంతకాలం తర్వాత ఆయన కాంగ్రెస్ పార్టీలోకి వెళ్లారు. 1983 వరకు కోదాడ ఎమ్మెల్యేగా పనిచేసిన ఆయన స్వచ్ఛందంగా రాజకీయాల నుంచి తప్పుకున్నారు. తరవాత ఎన్నికల్లో కాంగ్రెస్‌పార్టీ ఆయనకు టికెట్ ఇచ్చినప్పటికీ స్థానిక పరిస్థితలను అవగతం చేసుకుని, తన శిష్యుడైన చింతా చంద్రారెడ్డికి కాంగ్రెస్ పార్టీ నుంచి టికెట్ ఇప్పించిన త్యాగశీలి ఆయన. నేటి రాజకీయ నాయకులు పార్టీ టికెట్ల కోసం తన్నుకుంటున్న స్థితిలో ఆయనకు వచ్చిన టికెట్‌ను స్వచ్ఛందంగా వదులుకుని సమకాలిన రాజకీయాలకే వన్నె తెచ్చారు. ఆ నిర్ణయాన్ని కోదాడ ఎన్నికల బహిరంగ సభకు వచ్చిన మాజీ ప్రధాని, కాంగ్రెస్ జాతీయ అధ్యక్షురాలు ఇందిరాగాంధీ స్వయంగా బహిరంగ వేదిక పైనుంచే అభినందించారు. హుజూర్ నగర్ ప్రజలకిచ్చిన వాగ్దానం మేరకు కోదాడలో డిగ్రీ కళాశాలను ఆర్ట్స్అండ్ సైన్స్ విభాగంతో ఏర్పాటు చేయించారు. తొలుత కోదాడ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ కళాశాలను ప్రారంభించారు. అనంతరం తన బంధువులైన కొండపల్లి రాఘవమ్మరంగారవు నుంచి 60ఎకరాల భూమిని విరాళంగా సేకరించి 1970లో కళాశాలను ఏర్పాటు చేశారు. కళాశాలకు ఫౌండర్ చైర్మన్‌గా ఆయన కొనసాగారు. అదే విధంగా ఆయన కళాశాల అభివృద్ధికి అన్ని వర్గాలను భాగస్వామ్యం చేశారు. ఆ కళాశాల ద్వారా ఎందరో విద్యార్థులు ఉన్నత చదువులు చదివి, ఐఎఎస్, ఐపీఎస్, ఇతర ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడ్డారు. ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలో ఈ కళాశాలకు, కళాశాల విద్యార్థులకు ఒక ప్రత్యేక స్థానం ఉండేది. నియోజకవర్గ పరిధిలో వంద గ్రామాలకు ఒకే సారి విద్యుత్ సౌకర్యం కల్పించిన ఘనత కూడా ఆయనకు ఉన్నదని చెపుతారు. నియోజకవర్గంలో రహదారులను ఏర్పాటు చేయడంలో ఆయన కృషిచేశారు. కనీస రహదారి లేని గ్రామాలకు మార్కెట్ కమిటీ ద్వారా రైతులకు రహదారి సౌకర్యాలు కల్పించారు. పంచాయతీరాజ్, రోడ్లు భవనాల శాఖ ద్వారా హుజూర్‌నగర్, కోదాడ రెండు నియోజక వర్గాలకు సంబంధించిన అనేక గ్రామాలను కలుపుతూ రోడ్లు వేయించారు. కోదాడ, హుజూర్ నగర్ నియోజకవర్గాలలో వైద్య సదుపాయాలు కల్పించేందుకు కృషిచేశారు. నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఆయన హుజూర్‌నగర్, కోదాడ ప్రాంతాలకు సాగర్‌నీటిని తీసుకొచ్చేందుకు చేసిన కృషి ఇప్పటికీ ఆయా ప్రాంతాల ప్రజలు కొనియాడుతారు. పీవీ నర్సింహారావు మంత్రి వ ర్గంలో చిన్న నీటిపారుదల శాఖ మంత్రిగా పనిచేసిన ఆయన అప్పటి కాలువల ఏర్పాటులో ఎంతో కృషిచేశారు. రాజకీయంగా ఆయన రాష్టంలో మంచి గుర్తింపు తెచ్చుకుని జాతీయ నాయకులతో మంచి సత్సంబంధాలను కొనసాగించారు. అప్పటి ప్రధాని ఇందిరా గాంధీ కోదాడకు వచ్చిన సందర్భముగా ఆయనను అభినందించి కేంద్రంలో ఆయన సేవలు వినియోగించు కుంటామని చెప్పారు. అనంతరం ఆమె హత్యకు గురికావడంతో రాజకీయ జీవితానికి అవరోధం ఏర్పడింది. పీవి నర్సింహారావుకు బంధువు, అత్యంత ఆత్మీయుడు అయన వాసుదేవరావుకు మారుతున్న రాజకీయ పరిణామాలతో రాజకీయ జీవితానికి విఘాతం కల్గింది. ఆప్కాబ్ చైర్మన్, ఖాధీ భాగ్యనగర సమితి చైర్మన్ ఆయన కొనసాగారు. జాతీయ స్థాయిలో ఆయనకు మణిశంకర్ అయ్యర్ తదితర ఆనాటి నాయకులతో సత్సంబంధాలు ఉండేవి. రాష్ట్రంలో నాటి నాయకులు, సినిమా పరంగా ఎన్టీరామారావు, అక్కినేని నాగేశ్వరరావు, సి నారాయణరెడ్డి, దాశరథిలతో సంబంధాలను కొనసాగించారు. రాష్ట్రానికి జాతీయ నాయకులు ఎవరు వచ్చినా వారి ప్రసంగాలను ఆయనే అనువదించే వారు. ఆయన ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన కాలంలో అసెంబ్లీలో పలు సమస్యలపై ఆంగ్లంలో మాట్లాడుతుంటే సభ ఆసాంతం ఆలకించేదని నాటి తరం నాయకులు అనుకుంటూ ఉండేవారు.

# దేశంలో తొలి మహిళా న్యాయమూర్తి అమరేశ్వరి

సమాజంలో స్త్రీలకు సరైన గౌరవం, మర్యాద లభించని రోజుల్లో కొందరు మహిళలు, ముందుకు వచ్చి, పరిస్థితులను తమకు అనుకూలంగా మార్చుకుని, స్వయం కృషితో వివిధ రంగాల్లో తమ సత్తా చాటుకుని గుర్తింపు పొంది, సాటి మహిళలకు ఆదర్శంగా నిలిచారు. పురుషులకు తాము ఏమాత్రం తీసిపోమని ఆరోజుల్లోనే నిరూపించారు. తాము తలుచుకుంటే ఏమైనా సాధించ గలమని మహిళలు ముందుకు సాగారు. అలాంటి వారిలో జస్టిస్ అమరేశ్వరి ఒకరు. ఒక సాధారణ వ్యవసాయం కుటుంబంలో జన్మించిన ఆమె.. దేశంలో న్యాయమూర్తిగా పనిచేసిన తొలి మహిళగా రికార్డు సృష్టించారు. పట్టుదల ఉంటే లక్ష్యాన్ని చేరుకోవడంలో పేదరికం, వివాహం, ఇతర అంశాలు ఏమాత్రం అడ్డురాదని నిరూపించిన ఆమె.. సాటి మహిళల్లో ఏమైనా సాధించగలమన్న చైతన్యాన్ని నింపారు. జస్టిస్ కె. అమరేశ్వరి (కోనమనేని అమరేశ్వరి) భారత దేశంలో తొలి మహిళా న్యాయమూర్తిగా చరిత్ర పుటల కెక్కారు. గుంటూరు జిల్లా అప్పికట్ల గ్రామములో ఒక వ్యవసాయ కుటుంబములో 1928, జులై 10 వ తేదీన జన్మించారు. 14వ ఏటనే పెళ్ళి జరిగినా భర్త ప్రోత్సాహముతో చదువు సాగించారు.ఆమె 1949 లో ఆంధ్ర విశ్వ విద్యాలయం నుండి పొలిటిక్స్ అండ్ హిస్టరీలో ఎంఏ డిగ్రీని పొంది, అదే విశ్వ విద్యాలయం నుండి బిఎల్, డిగ్రీని కూడా తీసుకున్నారు. డి.మునికన్నయ్య ఛాంబర్స్‌లో ఆమె అప్రెంటిస్‌షిప్ చేశారు. 1952 సంవత్సరంలో మద్రాస్ హైకోర్టు న్యాయవాదిగా చేరారు. గుంటూరుకు, తరువాత హైదరాబాద్‌కు ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మారగా ఆమె అదే వృత్తిలో కొనసాగారు. 1960-61 మధ్య కాలంలో బార్ కౌన్సిల్ సభ్యులుగా ఉన్నారు.అక్టోబర్, 1974 లో అదనపు ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులయ్యారు. అప్పటి నుండి 14-2-1977 వరకు రెండేళ్లపాటు అదనపు న్యాయమూర్తిగా పని చేశారు. భారత మహిళా న్యాయవాదుల సంఘమునకు ఉపాధ్యక్షులుగా, 1975-76 మధ్యకాలంలో హైకోర్టు న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షులుగా విధులు నిర్వర్తించారు. 1956లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ఏర్పాటు కాగా, ఉమ్మడి హైకోర్టు తొలి మహిళా న్యాయ మూర్తిగా జస్టిస్ అమరేశ్వరి 29-4-1978 న శాశ్వత న్యాయ మూర్తిగా నియమితులయ్యారు.దేశములోనే తొలి మహిళా న్యాయమూర్తిగా పేరొందారు. పదమూడున్నర సంవత్సరాలు న్యాయమూర్తిగా పనిచేసి 1990 సంలో సీనియర్ గా పదోన్నతి పొంది పదవీ విరమణ చేశారు. పదవీ విరమణ నుంచి గత 13 సంవత్సరాలుగా సుప్రీంకోర్టు న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. న్యాయ వ్యవస్థలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానం సాధించిన మహిళ జస్టిస్ కొనమనేని అమరేశ్వరి, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను అమరేశ్వరి సమర్ధించారు. ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు చట్ట పరమైన పరిణామాలు’ అన్న అంశంపై నిర్వహించిన ఒక సెమినార్లో ఆమె తన అభిప్రాయాన్ని ముక్కు సూటిగా వెల్లడించారు. ప్రభుత్వం నుంచి రాయితీలు అందుకుంటున్న ప్రైవేటు సంస్థలు సిబ్బంది నియామకంలో రిజర్వేషన్లను అమలు చేయాలని గట్టిగా వాదించారు. మహిళలకు మార్గదర్శకురాలై, న్యాయ వ్యవస్థలో ప్రత్యేక గుర్తింపు పొందిన జస్టిస్ అమరేశ్వరి 2009, జులై 25 న కొత్త ఢిల్లీలో మరణించారు.

# వల్లభనేని వంశీకి ఏమైంది...



విజయవాడ, జూలై 9, గన్నవరం మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ మోహన్ తీవ్ర అనారోగ్యానికి గురయ్యారు. తీవ్ర అస్వస్థతతో విజయవాడలోని ఓ ఆసుపత్రిలో చేరారు. కొద్ది రోజుల కిందటే ఆయన బెయిల్ పై విడుదలయ్యారు. శ్వాస తీసుకునేందుకు ఇబ్బంది పడుతుండడంతో కుటుంబ సభ్యులు వెంటనే ఓ ఆసుపత్రిలో చేర్పించారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు తెలుస్తోంది. దాదాపు 135 రోజులపాటు ఆయన జైల్లో గడపాల్సి వచ్చింది. ఆ సమయంలోనే పలుమార్లు అనారోగ్యానికి గురయ్యారు. జైలు నుంచి ఆసుపత్రులకు తీసుకొచ్చి చికిత్స అందించేవారు. ఇప్పుడు బెయిల్ పై వచ్చిన ఆయన మరోసారి అస్వస్థతకు గురికావడంతో హుటాహుటిన కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించారు.ఈ ఏడాది ఫిబ్రవరి 17న ఏపీ పోలీసులు హైదరాబాదుల ఉన్న వల్లభనేని వంశీ మోహన్ ను అదుపులోకి తీసుకున్నారు. ఆయనపై 11 కేసులు నమోదు చేశారు. అనేకసార్లు ఆయన బెయిల్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఎప్పటికప్పుడు బెయిల్ పిటిషన్లు తిరస్కరణకు గురయ్యేవి. ఎట్టకేలకు ఈనెల 2న ఆయనకు బెయిల్ లభించింది. దీంతో ఆయన బయటకు వచ్చారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. ఆ మరుసటి రోజున భార్యతో కలిసి మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. అటు తరువాత మాజీ మంత్రులు కొడాలి నాని, పేర్ని నాని వల్లభనేని వంశీని పరామర్శించారు. ఇంతలోనే ఆయన అస్వస్థతకు గురికావడం ఆందోళన కలిగిస్తోంది. శ్వాస తీసుకోవడానికి ఇబ్బంది పడుతుండడంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన ఆసుపత్రిలో చేర్పించారు.

నట రత్నాలు, నట శేఖర లు ఎక్కడో వుండరు,మన చుట్టూ గన్నవరం గాండు, గుడివాడ గుట్కా రూపాల్లో తిరుగుతూ వుంటారు..

వాడు ఆరోగ్యం బాగోపోతే హాస్పిటల్ లో ట్రీట్మెంట్ తీసుకోవాలి కానీ,

వీడియోలు తీసి సోషల్ మీడియా లో పెట్టి డ్రామా లు ఎందుకు?వల్లభనేని వంశీ మోహన్ దూకుడుగా వ్యవహరించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ హయాంలో చంద్రబాబుతో పాటు లోకేష్ పై నిత్యం అనుచిత వ్యాఖ్యలు చేసేవారు. ఈ ఎన్నికల్లో గన్నవరం నుంచి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. అప్పటినుంచి నియోజకవర్గానికి దూరంగా ఉంటూ వస్తున్నారు. ఆయన విదేశాలకు వెళ్లిపోతారని ప్రచారం జరిగింది. ఇంతలోనే పాత కేసులను తిరగదోడుతూ ఏపీ పోలీసులు కేసు నమోదు చేశారు. అరెస్టు కూడా చేశారు. దాదాపు 135 రోజులపాటు వంశీ జైల్లోనే గడపాల్సి వచ్చింది. వాస్తవానికి గతంలో కూడా వల్లభనేని వంశీ మోహన్ అనారోగ్యంతో బాధపడుతున్నట్లు వార్తలు వచ్చాయి. అయితే జైల్లోకి వెళ్లిన తరువాత అనారోగ్యం మరింత తీవ్రమైంది. ఇప్పుడు బయటకు వచ్చినా ఆ ప్రభావం ఇంకా కనిపిస్తోంది.

# ఆనం అసంతృప్తికి కారణం అదేనా

నెల్లూరు, జూలై 9, ఆనం రామనారాయణరెడ్డి ఎప్పుడూ అసంతృప్తి నేత మాత్రమేనా? జిల్లాలో తన మాట శాసనం అనుకుంటున్నారా? ఇంకా పాత కాలం నాటి రోజులుగా ఆనం రామనారాయణరెడ్డి భావిస్తున్నట్లుంది. సాక్షాత్తూ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేశ్ ఎదుటే మంత్రి నారాయణపై అసంతృప్తిని వెళ్లగక్కి ఆనం రామనారాయణరెడ్డి తన దైన శైలిని ఆయన మరోసారి చాటుకున్నారు. అందుకే సీనియర్ నేతలను పక్కన పెట్టి కొత్త తరం నేతలను రాజకీయాల్లోకి తీసుకు రావాలన్న టీడీపీ అధినాయకత్వం ఆలోచన కరెక్టే అనిపిస్తుంది. ఈ సీనియర్లు తమదే ఆధిపత్యం కావాలని కోరుకుంటారు. ఫలితంగా పార్టీలో రాజకీయ ఇబ్బందులు తలెత్తక తప్పవు. అందుకే టీడీపీలో క్రమంగా సీనియర్ నేతలను పక్కన పెడుతున్నారు.. నెల్లూరు నగరంలో నిన్న అంతర్జాతీయ ప్రమాణాలతో నిరుపేద విద్యార్థులు చదువుకోవడానికి వీఆర్ హైస్కూల్ ను మంత్రి నారా లోకేశ్ ప్రారంభించారు. మంత్రి నారాయణ మున్సిపల్ నిధులు వెచ్చించి ఈ పాఠశాలకు మరమమ్మతులుచేయించారు. దీంతో వీఆర్ మున్సిపల్ హైస్కూలు అని నామకరణం చేశారు. అందుకు ఆనం రామనారాయణరెడ్డి అభ్యంతరం తెలిపారు. తమ కుటుంబం ఆధ్వర్యంలో దశాబ్దాలుగా ఉన్న వీఆర్ విద్యాసంస్థలను మున్సిపల్ స్కూలు అని ఎలా నామకరణం చేస్తారని లోకేశ్ ఎదుటే ప్రశ్నించారు. నారాయణ తన శాఖ నిధులతో ఖర్చు చేస్తే పేరు మారుస్తారా? అని నిలదీశారు. అంతేకాదు నారాయణ మున్సిపల్ పాఠశాలలను దత్తత తీసుకుని వాటిని బాగు చేస్తే మంచిదని హితవు పలికారు. ఆనం రామనారాయణరెడ్డి చేసిన వ్యాఖ్యలతో లోకేశ్ సయితం విస్తుపోయారు ఆనం రామనారాయణరెడ్డి కాంగ్రెస్ లో ఉన్ననాళ్లు మంత్రిగా ఉండి జిల్లాపై ఆధిపత్యాన్ని చెలాయించారు. అయితే 2014లో రాష్ట్ర విభజన జరిగిన తర్వాత ఆయన టీడీపీలో చేరారు. కానీ ఆ ఎన్నికల్లో గెలవలేకపోయారు. కానీ తనకు ఎమ్మెల్సీ సీటు కూడా ఇవ్వలేదని నాడు టీడీపీని వదిలేశారు. 2019 ఎన్నికలనాటికి వైసీపీలో చేరారు. వెంకటగిరి నియోజకవర్గం నుంచి టిక్కెట్ పొంది విజయం సాధించారు. అయితే జగన్ అధికారంలో ఉన్నప్పుడు ఆయనకు మంత్రి వర్గంలో చోటు దక్కలేదు. దీంతో అసంతృప్తికి గురయిన ఆనం రామనారాయణరెడ్డి ఎన్నికలకు ముందు నుంచే అధికార వైసీపీ ప్రభుత్వంపై తరచూ విమర్శలు చేస్తూ వార్తల్లోకి ఎక్కారు. అంటే మరోసారి పార్టీ మారాలని నిర్ణయించుకున్నారు. గతంలో టీడీపీని వదిలి వెళ్లినా ఆనం రామనారాయణరెడ్డిని చంద్రబాబు నాయుడు తిరిగి పార్టీలోకి తీసుకున్నారు. ఆనం కుటుంబానికి నెల్లూరులో ఉన్న పేరు ప్రఖ్యాతుల దృష్ట్యా ఆయనను తిరిగి పార్టీలోకి తీసుకుని ఆత్మకూరు నియోజకవర్గం టిక్కెట్ ను 2024 ఎన్నికల్లో కేటాయించారు. ఈ ఎన్నికల్లో గెలిచిన ఆనం రామనారాయణరెడ్డికి మంత్రివర్గంలో చోటు కూడా కల్పించారు. అయితే తనకు ఇష్టంలేని దేవాదాయ శాఖను అప్పగించడం కొంత అసంతృప్తికి గురైన ఆనం అందులోనే ఉంటూ సర్దుకుపోతున్నారు. కానీ నెల్లూరు జిల్లాలో సీనియర్ నేత సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డిని కాదని ఆనం రామనారాయణరెడ్డి కి మంత్రిపదవి ఇచ్చినా ఆయన తృప్తిపడనట్లే కనిపిస్తుంది.. నెల్లూరు జిల్లాలో మంత్రి నారాయణ హవా నడుస్తుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు, లోకేశ్ కు నారాయణ సన్నిహితుడు కావడంతో జిల్లా అధికారులు కూడా ఆయనకే ప్రాధాన్యత ఇస్తున్నారు. ఇది ఆనం రామనారాయణరెడ్డికి ఇబ్బందికరంగా మారింది. తన సొంత జిల్లాలో నారాయణ పెత్తనమేంటన్న అభిప్రాయం ఆయనలో బలంగా ఉన్నట్లుంది. అందుకే లోకేశ్ వేదికపైనే ఉన్నా ఏ మాత్రం సంకోచం లేకుండా విమర్శలు చేయడంతో నెల్లూరు టీడీపీలో విభేదాలు బయటకు భగ్గుమన్నాయి. ఈ విషయాన్ని పార్టీ అధినాయకత్వం సీరియస్ గా తీసుకున్నట్లు తెలిసింది. ఆనం రామనారాయణరెడ్డి ఎప్పుడూ ఆధిపత్యం కోసమే ప్రయత్నిస్తుంటారని, అందులో భాగంగానే ఇలాంటి వ్యాఖ్యలు చేసి ఉంటారన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

# వేటు పడింది..

తిరుమల, జూలై 9,టీడీలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా పని చేస్తున్న ఏ.రాజశేఖర్ బాబును ఉద్యోగం నుంచి సస్పెండ్ చేశారు. తిరుపతి జిల్లా పుత్తూరులోని స్వగ్రామంలో రాజశేఖర్ బాబు ప్రతీ ఆదివారం స్థానిక చర్చి ప్రార్థనల్లో పాల్గొంటున్నారు. దీనికి సంబంధించిన వీడియోలు వెలుగులోకి వచ్చాయి. ఈ వ్యవహారంతో టీటీడీ ఉద్యోగిగా ఆయన సంస్థ ప్రవర్తనా నియమావళిని పాటించలేదని భావించడమేకాక, హిందూ ధార్మిక సంస్థకు ప్రాతినిధ్యం వహించే ఉద్యోగి అయివుండి భాద్యతారహితంగా వ్యవహరించడం జరిగిందని టీడీపీ తేల్చి?ంది. ఈ క్రమంలో టీటీడీ విజిలెన్స్ విభాగం సమర్పించిన నివేదికను, ఇతర ఆధారాలను పరిశీలించిన అనంతరం నిబంధనల ప్రకారం ఆయనపై శాఖపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు , తక్షణమే సస్పెండ్ చేయడం జరిగిందని టీటీడీ ప్రకటించింది. ఇటీవల టీటీడీలో పని చేస్తూ అన్యమతాన్ని ఆచరిస్తున్న వారిని బయటకు పంపింది. కోరుకున్న వారికి వీఆర్ఎస్ లేకపోతే ఇతర సంస్థల్లోకి డిప్యూటేషన్ మీద పంపించారు. 2025 ఫిబ్రవరి 1న 18 మంది క్రైస్తవ మతాన్ని ఆచరిస్తున్నవారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంది. ఈ ఉద్యోగులు హిందూ సంప్రదాయాలను అనుసరిస్తామని ప్రమాణం చేసినప్పటికీ, అన్యమత కార్యకలాపాల్లో పాల్గొన్నట్లు గుర్తించారు. వీకంజకితీ బదిలీ లేదా వీఆర్ఎస్ అవకాశం ఇచ్చారు. వినియోగించుకోకపోతే ఉద్యోగం నుంచి తొలగిస్తారు. టీటీడీలో పని చేసే ఉద్యోగులు ఖచ్చితంగా హిందూ మతాన్ని ఆచరించాలన్న నిబంధన ఉంది. టీటీడీలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న ఏ.రాజశేఖర్ బాబు తిరుపతి జిల్లా పుత్తూరులో ప్రతి ఆదివారం స్థానిక చర్చి ప్రార్థనల్లో పాల్గొంటున్నాడనే సమాచారం అందింది. ఓ భక్తుడు ఆయన చర్చి ప్రార్థనల్లో పాల్గొంటుండగా ఫొటోలు, వీడియోలు తీసి టీటీడీ విజిలెన్స్ విభాగానికి ఫిర్యాదు చేశాడు. విచారణ చేపట్టిన అధికారులు రాజశేఖర్ బాబును సస్పెండ్ చేస్తున్నట్లు వెల్లడించారు. 2007లో టీటీడీ నిర్వహించే లేదా ఆర్థికంగా సహాయపడే సంస్థలలో హిందువులను మాత్రమే నియమించాలని నిర్ణయించారు. టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు, టీటీడీ ఒక హిందూ మత సంస్థగా ఉండాలని, అన్యమత ఉద్యోగులు దీనిలో పనిచేయకూడదని స్పష్టం చేస్తున్నారు.టీటీడీలో పని చేస్తూ హిందువులుగా చెప్పుకుని చర్చిలకు వెళతున్న వారితోనే అసలు సమస్య వస్తోంది. తమ మతాన్ని అంగీకరించి.. టీటీడీలో కాకుండా డిప్యూటేషన్ పై ఇతర శాఖలకు వెళ్లేందుకు వారు ఆసక్తి చూపించడం లేదు. అదే సమయంలో.. తమ మత భావనను మార్చుకోవడం లేదు. హిందూ మతం కన్నా ఇతర మతాలపైనే ఆసక్తి చూపిస్తున్నారు. వీరు.. తిరుమలలో.. అన్యమత ప్రచారానికి కారణం అవుతున్నారన్న అభిప్రాయం వినిపిస్తోంది. అందుకే టీటీడీ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలనుకుంటోంది. కానీ వీరిలో పెద్దగా ఎవరూ పట్టుబడటం లేదు. రాజశేఖర్ బాబు లాంటి వారిపై ఫిర్యాదులు వస్తేనే చర్యలు తీసుకుంటున్నారు.

# నెల్లూరు లో నేలబారు రాజకీయాలు

నెల్లూరు, జూలై 9, సింహపురి రాజకీయాలు వేడెక్కాయి. ఎప్పుడూ ప్రశాంతంగా ఉండే నెల్లూరు పాలిటిక్స్ మాత్రం ఇప్పుడు దాడులతో హీటెక్కాయి. నెల్లూరు జిల్లా అంటే ప్రశాంతతకు మారు పేరు. గత కొన్ని దశాబ్దాలుగా అనేక మంది నెల్లూరు నుంచి రాజకీయాల్లో ఎదిగారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈసారి మాత్రం అందుకు విరుద్ధంగా దాడులు జరుగుతున్నాయి. నేతల మధ్య వ్యక్తిగత ఆరోపణలు చేయడంతో ఉద్రిక్తతలు పెరిగాయి. నెల్లూరు జిల్లాలో రెడ్డి సామాజికవర్గానిదే ఆధిపత్యం. గతంలో ఈ జిల్లా నుంచి ఆనం గోపాల్ రెడ్డి నుంచి నల్లపురెడ్డి శ్రీనివాసులు రెడ్డి వరకూ ఎంతో హుందాగా రాజకీయాలు నడిచేవి. వ్యక్తిగత విమర్శలకు అసలు చోటుండేవికావు. కేవలం రాజకీయ విమర్శలు మాత్రమే ఉండేవి. కానీ రాను రాను రాష్ట్ర వ్యాప్తంగా మారుతున్న రాజకీయ పరిణామాలు సింహపురి రాజకీయాలను కూడా మార్చేస్తున్నాయి. హుందాగా రాజకీయాలు చేసిన నేతలు ఇప్పుడు చౌకబారు విమర్శలకు దిగుతున్నారు. అంతేకాదు.. రాజకీయ విమర్శలను పక్కన పెట్టి వ్యక్తిగత దూషణలకు దిగుతున్నారు. ఫలితంగా దాడులు, ప్రతిదాడులు జరుగుతున్నాయి. డబ్బు పుష్కలంగా ఉంది. అధికారం కూడా నెల్లూరు రెడ్లకు ఉంది. అయితే అన్నింటికీ మించి నెల్లూరు రెడ్లు రాజకీయాల్లో సంస్కారవంతంగా వ్యవహరిస్తారన్న పేరుంది. అలాంటి నెల్లూరు రాజకీయాలు నేడు నేలబారుకు చేరుకున్నాయి. కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిల మధ్య వివాదం చోటు చేసుకుంది.. మాజీ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డిపై అవినీతి ఆరోపణలను వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి చేశారు. దానికి కౌంటర్ ఇవ్వడంలో భాగంగా నల్లపురెడ్డి ప్రసన్నకుమార రెడ్డి కొంత ప్రశాంతిరెడ్డిపై వ్యక్తిగత దుర్భాషలకు దిగారు. దీంతో ప్రసన్నకుమార్ రెడ్డి ఇంటిపై దాడులు జరిగాయి. ఇంట్లో ఫర్నీచర్ ను ధ్వంసం చేశారు. వాహనాలను ధ్వంసం చేశారు. అయితే ఈ దాడులు వేమిరెడ్డి కుటుంబం మాత్రమే చేసిందని నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి ఆరోపిస్తున్నారు. డబ్బు ఉందన్న అహంకారంతో దాడులకు పాల్పడుతున్నారని, తాను ఎక్కడా తప్పు మాట్లాడలేదని, తాను ఆమెపై చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉన్నానని నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి తెలిపారు. ... అయితే నల్లపురెడ్డి ఇంటిపై దాడితో తమకు సంబంధం లేదని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి తెలిపారు. దాడుల సంస్కృతి తమది కాదన్న ఆమె ప్రసన్నకుమార్ వల్ల చాలా మంది బాధపడ్డారన్నారు. వారిలో ఎవరో ఒకరు దాడి చేసి ఉండొచ్చని ప్రశాంతిరెడ్డి చెప్పారు. ఆరోపణలు చేసిన వైసీపీ నేతలకు నాది ఒకటే ప్రశ్న అని, నల్లపురెడ్డి తనపై వ్యక్తిగతంగా చేసిన వ్యాఖ్యలను వైసీపీ నేతలు మీ ఇంట్లో మహిళలకు చూపించాలని సవాల్ విసిరారు. నల్లపురెడ్డివ్యాఖ్యలను జగన్ సీరియస్‌గా తీసుకోవాలని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి కోరారు. మొత్తం మీద సింహపురి రాజకీయాలు దాడుల సంస్కృతికి దిగడం ఆందోళనకు గురి చేస్తున్నాయి.

## ఆగస్టు 14 నుంచి ఫ్రీ బస్సు
## కండిషన్స్ అప్లై

కర్నూలు, జూలై 9, ఏపీలో మహిళలకు ఆర్టీసీ ఉచిత ప్రయాణానికి సంబంధించి ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఆగస్టు 15 నుంచి ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభం కానుంది. అధికారంలోకి వచ్చిన వెంటనే మహిళలకు ఆర్టీసీలో ఉచిత ప్రయాణం కల్పిస్తామని సీఎం చంద్రబాబు హామీ ఇచ్చిన సంగతి తెలిసిందే. అయితే గత కొద్ది రోజులుగా అధ్యయనాలు, కసరత్తులు జరిపింది ఏపీ ప్రభుత్వం. ఎట్టకేలకు ప్రారంభించేందుకు సిద్ధపడింది. కానీ రాష్ట్రవ్యాప్తంగా ఉచితం అనేది కాకుండా.. జిల్లాలకు పరిమితం చేయడంతో మహిళలు ఇప్పుడు షాక్ కు గురవుతున్నారు. స్వయంగా సీఎం చంద్రబాబు ఈ ప్రకటన చేయడంతో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. కర్ణాటక తో పాటు తెలంగాణ మాదిరిగా కాకుండా ఏపీలో కేవలం జిల్లాలకే పరిమితం చేయడం విశేషం.కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే ఉచిత ప్రయాణానికి సంబంధించి.. అధ్యయనానికి క్యాబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. మంత్రులతో కూడిన బృందం కర్ణాటకలో ఉచిత బస్సు ప్రయాణం పథకానికి సంబంధించి అధ్యయనం చేసింది. ప్రభుత్వానికి నివేదికలు ఇచ్చింది. ఈ ఏడాది నుంచి సంక్షేమ పథకాలు అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయించడంతో.. ఉచిత ప్రయాణ పథకం పట్టాలు ఎక్కించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి. కానీ జిల్లాల వరకే ఈ పథకం పరిమితం చేయడం మాత్రం విమర్శలకు తావిస్తోంది.ఆగస్టు 15న స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా పథకాన్ని అమలు చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీంతో మహిళలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

# పవన్ ధీమా వెనుక...

కాకినాడ, జూలై 9, చిన్నచిన్న ఇబ్బందులు ఉన్నా.. సర్దుకోవాలి..కలిసి పోవాలి..! ఇలా ఒకదాని వెంట మరోటిగా తూటాల్లాంటి మాటలతో సొంత నేతలకు హితబోధ చేశారు జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. ఇదే సమయంలో ప్రత్యర్థికి గట్టి వార్నింగ్ ఇచ్చారు. ఎలా వస్తారో మేమూ చూస్తామంటూ సవాల్ చేశారాయన. ఈ కామెంట్లపైనే ఇప్పుడు ఏపీలో జోరుగా చర్చ సాగుతోంది. పవన్ వ్యాఖ్యల వెనుక మతలబేంటన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. కీలక వ్యాఖ్యలు చేసిన ఏపీ డిప్యూటీ సీఎం పవన్. నాకు కొంచెం తిక్కుంది.. కానీ దానికో లెక్కుంది. ఇది ఓ పాపులర్ సినిమాలో పవన్ కల్యాణ్ చెప్పిన డైలాగ్. అచ్చం ఇదే మాదిరిగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ మాట్లాడే ప్రతి మాటకూ ఓ లెక్క ఉంటుంది. వినే వాళ్లు, చూసే వాళ్లు అది తెలుసుకోవాలి అంతే. లేటెస్ట్‌గా జనసేనాని, ఏపీ డిప్యూటీ సీఎం పవన్.. మరోసారి అత్యంత కీలకమైన కామెంట్స్ చేశారు. ఆంధ్రప్రదేశ్‌లోని టీడీపీ-జనసేన-బీజేపీ కూటమి పార్టీలను ఉద్దేశించి ఆయన చేసిన కామెంట్లే ఇప్పుడు పొలిటికల్ సర్కిళ్లలో హాట్ టాపిక్‌గా మారాయి. కూటమి పార్టీల మధ్య విభేదాలు ఉన్నాయంటూ.. ఓవైపు కూటమి పార్టీలకు చెందిన నేతల మధ్య మనస్పర్థలు, అసంతృప్తులు కొనసాగుతున్నాయని విపక్ష వైసీపీ నేతలు ఆరోపిస్తున్నారు. పైకి కలిసి ఉన్నట్లుగా చెప్పుకుంటున్న కూటమి పార్టీలు.. కొన్నిచోట్ల లోలోన కత్తులు దూసుకుంటున్నాయని సెటైర్లు వేస్తున్నారు. జనసేన, బీజేపీ నేతలకు కూటమిలో పెద్దగా ప్రాధాన్యం లేదని ప్రచారం చేస్తున్నారు వైసీపీ నేతలు. అంతెందుకు ఏపీలో కూటమి పాలన ఏడాది పూర్తి చేసుకున్న వేళ.. గడపగడపకూ టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు వెళు తున్నారు. ఈ సంవత్సర కాలంలో ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రచారం చేస్తున్నారు. కానీ, జనసేన, బీజేపీ నేతలు మాత్రం ఎక్కడా వీటిల్లో పాల్గొనడం లేదు. దీనిపైనా ప్రత్యర్థి వైసీపీ విమర్శల బాణాలు ఎక్కుపెడుతోంది. సరిగ్గా ఇలాంటి వేళ.. ప్రకాశం జిల్లా పర్యటనలో పాల్గొన్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ప్రత్యర్థి పార్టీ నేతల కామెంట్లకు కౌంటర్లు వేశారు.

ఇదే సమయంలో కూటమి పార్టీలకు కొన్ని సూచనలు చేశారాయన. ఏపీలో కూటమి పాలన 15 ఏళ్లైనా సాగాలన్న పవన్. ఏపీలో కూటమి పాలన కనీసం 15 ఏళ్లపాటైనా సాగాలని ఆకాంక్షించారు పవన్ కల్యాణ్. అప్పుడే ప్రస్తుతం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ఫలాలు ప్రజలకు సరిగా చేరతాయన్నారు. ఈ క్రమంలోనే కూటమి పార్టీలు కలిసి కట్టుగా సాగడం ఎంతో అవసరం అంటూ హితబోధ చేశారు పవన్. రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా మూడు పార్టీలు కలిసి పోటీ చేసినప్పుడు చిన్నచిన్న అసంతృప్తులు సహజమన్నారాయన. అందుకే ఏ పార్టీనీ తక్కువగా అంచనా వేయొద్దని సూచించారు పవన కల్యాణ్. పిడికిలిలా కూటమి ముందుకు సాగాలన్న పవన్. అన్ని వేళ్లూ ఒకేలా ఉండవన్నారు జనసేన అధినేత. అయినా సరే ఏ వేలి బలం ఆ వేలుకు ఉంటుందన్నారు. అందుకే పిడికిలిలా ముందుకు సాగాలన్నారు. ఇక్కడ కూటమి అంటేనే ఓ పిడికిలి అంటూ మూడు పార్టీల కార్యకర్తలకు హితబోధ చేశారు పవన్. ఎన్ని సమస్యలు, ఇబ్బందులు వచ్చినా రాష్ట్రాభివృద్ధి కోసం కలిసి ముందుకు సాగడం తప్పనిసరి అన్నారు పవన్. ఇదే సమయంలో తనకు పాలనలో ఏ మాత్రం అనుభవం లేదన్నారు. కానీ, గట్టిగా పోరాడే ధైర్యం మాత్రం ఉందన్నారు పవన్. కూటమిలో టీడీపీ అధినేత చంద్రబాబు లేకుండా రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని ఇంత ప్రణాళికా బద్ధంగా నడిపించడం కష్టమంటూ చెప్పుకొచ్చారాయన. కొట్టుకోమని అధికారం ఇవ్వలేదంటూ హితబోధ. కష్టపడమని, సమస్యలు పరిష్కరించమని కూటమి పార్టీలకు ప్రజలు అధికారం ఇచ్చారన్నారు పవన్. అంతేకాని కొట్టుకోమని కాదంటూ సుతిమెత్తగానే ఘాటైన హెచ్చరికలు చేశారు. ఈ విషయాన్ని ప్రతి ఒక్క కార్యకర్తా, నాయకుడు గుర్తు పెట్టుకోవాలని సూచించారు జనసేన అధినేత. తనకు జనసేన సంక్షేమం, కూటమి సంక్షేమం కంటే ప్రజా సంక్షేమమే ముఖ్యమని తెగేసి చెప్పారు పవన్. తద్వారా పరిస్థితులు ఎలా ఉన్నా.. కూటమి పార్టీలు కలిసి కట్టుగా సాగాల్సిందేనన్న సందేశం ఇచ్చారన్న అభిప్రాయం గట్టిగా విన్పిస్తోంది. 2029లో ఎలా అధికారంలోకి వస్తారో చూస్తామంటూ.. సవాల్. కేవలం కూటమి పార్టీల కార్యకర్తలు, నాయకులకు హితబోధ చేయడమే కాదు.. ప్రత్యర్థి పార్టీకి గట్టి వార్నింగ్ ఇచ్చారు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్. రౌడీయిజానికి, గూండాయిజానికి భయపడితే రాజకీయం చేస్తామా అంటూ ప్రశ్నించారాయన. మేం అధికారంలోకి వస్తే అంటూ వైసీపీ నేతలు చెబుతున్నారని.. అసలు 2029లో వైసీపీ ఎలా అధికారంలోకి వస్తుందో చూస్తామంటూ సవాల్ విసిరారు పవన్ కల్యాణ్ .మొత్తంగా పవన్ కల్యాణ్ వ్యాఖ్యలు విశ్లేషిస్తే.. కూటమిగా కలిసి కట్టుగా సాగాల్సిన ఆవశ్యకతను వివరిస్తూ సాగాయన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. అంతేకాదు..

ఎన్డీఏ కూటమిలో కీలక భాగస్వామిగా ఉన్న తాను ఆ దిశగా ఎప్పుడూ కృషి చేస్తూ ఉంటానన్న సంకేతాలను మరోసారి బలంగా పంపారన్న కామెంట్లు విన్పిస్తున్నాయి.

# కర్నూలు జిల్లాల్లో టీడీపీ ఆగమాగం...

కర్నూలు, జూలై 9,ఉమ్మడి కర్నూలు జిల్లాలో వర్గపోరుతో టీడీపీ ఆగమాగం అవుతోందట. ఓవైపు.. ఏడాది పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి తెలుగుదేశం పార్టీ తీసుకెళుతున్న వేళ.. ఉమ్మడి జిల్లాలో మాత్రం పరిస్థితులు వేరుగా ఉన్నాయట. ఆత్మకూరు ఘటన మరవకముందే.. ఆలూరు తగాదా పెరిగి పెద్దదైంది. దీంతో.. జిల్లా టీడీపీలో ఏం జరుగుతోంది అన్న టెన్షన్ నెలకొందట తెలుగు తమ్ముళ్లలో. ఆలూరులో మూడు వర్గాలుగా తెలుగు తమ్ముళ్లు. ఆలూరులో తెలుగు తమ్ముళ్లు మూడు వర్గాలుగా విడిపోయారా అంటే అవునన్న వాదన బలంగా విన్పిస్తోంది. పార్టీ అధిష్టానం ఏ కార్యక్రమం చేపట్టినా తమ తమ వర్గాలుగా కొన్నింటిలో పాల్గొంటూ.. మరికొన్నింటిలో జాడ లేకుండా పోతున్నారట తెలుగుదేశం నాయకులు. అవును.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆలూరు రాజకీయం ఎప్పుడూ హాట్‌హాట్‌గా, హాట్ టాపిక్‌గా మారుతూనే ఉంటుంది. నేతల మధ్య విభేదాలు, సహకారం అందించుకోకపోవడం ఇక్కడ సర్వ సాధారణంగా మారిందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. తెలుగు తమ్ముళ్ల మధ్య తెగని పంచాయితీలు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో తెలుగు తమ్ముళ్ల మధ్య పంచాయితీలు నడుస్తున్నాయి. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తైన సందర్భంగా గడప గడపకూ అంటూ టీడీపీ ఎమ్మెల్యేలు, నేతలు వెళ్తున్నారు. ప్రభుత్వ పథకాలు ప్రజలకు ఎలా అందుతున్నాయో తెలుసుకుంటున్నారు. అయితే.. ఇలాంటి కార్యక్రమం పక్కన పెట్టి జిల్లాలోని టీడీపీ నేతలు ఎవరికి వారే వర్గాలుగా విడిపోయి గొడవలకు దిగుతుండడం అధిష్టానానికి తలనొప్పిగా మారిందట. నంద్యాల జిల్లా ఆత్మకూరులో జరిగిన ఘటనే ఇందుకు నిదర్శనం అనే మాట విన్పిస్తోంది. నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి వర్సెస్ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నట్లుగా పరిస్థితి మారడం హాట్ టాపిక్‌గా మారింది. ఓ దశలో బుడ్డా అనుచరులు ఏరాసు ఇంటిపై దాడికి దిగడంతో వర్గ పోరు తారస్థాయికి చేరింది. చివరకు చేసేదేమీ లేక జరిగిన ఘటనను మంత్రి లోకేశ్ దృష్టికి తీసుకెళ్లారట ఎంపీ బైరెడ్డి శబరి. ఆలూరులోనూ రచ్చకెక్కిన వర్గపోరు. ఈ తగాదా మర్చిపోకముందే ఆలూరులోనూ ఇదే మాదిరిగా వర్గపోరు రచ్చకెక్కింది. ఆలూరు నియోజకవర్గం ఆస్పరిలో సుపరిపాలన కార్యక్రమాన్ని చేపట్టారు పార్టీ సీనియర్ నేత బస్తిపాటి నాగరాజ్. అయితే.. ఆలూరు ఇంఛార్జ్ వీరభద్ర గౌడ్ లేకుండా కార్యక్రమం ఎలా నిర్వహిస్తారని సొంత పార్టీ నేతలే ప్రోగ్రాంను అడ్డుకోవడం వివాదాస్పదమైంది.

చివరకు ఈ విభేదాలు మరింత ముదరడంతో పార్టీ కార్యక్రమాలకు ఇబ్బంది కలిగించే నేతలపై చర్యలు ఉంటాయని చెబుతూ వీరభద్రగౌడ్‌పై వేటు వేసింది అధిష్టానం. ఆలూరు ఇంఛార్జ్‌గా ఆయన్ను తప్పిస్తూ నిర్ణయం తీసుకోవడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. ఇంఛార్జ్ ఒకరుంటే.. ఎమ్మెల్యే టికెట్ మరొకరికి. వాస్తవానికి ఆలూరులో టీడీపీ రాజకీయం ఎప్పుడూ భిన్నంగానే ఉంటుంది. ఇక్కడ ఎప్పుడూ మూడు వర్గాలుగా పార్టీ కన్పిస్తుంది. నియోజకవర్గ ఇంఛార్జ్‌గా ఒకరిని నియమించే పార్టీ అధిష్టానం.. ఎన్నికల నాటికి మరో వ్యక్తికి ఎమ్మెల్యే టికెట్ ఇస్తుండడమే ఇందుకు కారణమని స్థానికంగా ఉండే లీడర్లు, కేడరే చెబుతుంటారు. ఈ అంశమే పార్టీకి.. నియోజకవర్గంలో పెద్ద మైనస్‌గా మారుతోందట. పార్టీకి ఇబ్బందిగా మారుతోందంటున్న తమ్ముళ్లు. కూటమి హవా బలంగా వీచిన 2024 ఎన్నికలనే తీసుకుంటే.. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉన్న 14 నియోజకవర్గాల్లో 12 చోట్ల తమ్ముళ్లే విజయభేరి మోగించారు. కానీ, ఆలూరులో మాత్రం స్వల్ప మెజార్టీతో వైసీపీ అభ్యర్థి విరూపాక్షి విజయం సాధించారు. ఇందుకు కారణం టీడీపీ అభ్యర్థిగా నాటి ఎన్నికల్లో పోటీ చేసిన విరభద్రగౌడ్‌కు మాజీ ఇంఛార్జ్‌ల నుంచి సరైన మద్దతు లేకపోవడమేనట. గతంలో నెలకొన్న పరిస్థితులను ఓసారి పరిశీలిస్తే.. 2014 ఎన్నికలకు ముందు ఆలూరు ఇంఛార్జ్ బాధ్యతలు వైకుంఠం కుటుంబానికి అప్పగించింది పార్టీ అధిష్టానం. కానీ, తీరా ఎలక్షన్ల నాటికి వీరభద్రగౌడ్‌కు టికెట్ కేటాయించారు టీడీపీ అధినేత. దీంతో.. వైకుంఠం ఫ్యామిలీ ఆ ఎన్నికల్లో వీరభద్ర గౌడ్‌కు సపోర్ట్ చేయలేదు. ఆ తర్వాత వీరభద్ర గౌడ్‌కు ఇంఛార్జ్ పదవి అప్పగించాక.. 2019లో కోట్ల సుజాతమ్మకు ఎమ్మెల్యే టికెట్ ఇచ్చారు. ఇక, కోట్ల సుజాతమ్మ ఇంఛార్జ్ అయిన తర్వాత 2024లో వీరభద్ర గౌడ్‌కు ఎమ్మెల్యే అభ్యర్థిగా అవకాశం కల్పించింది టీడీపీ అధిష్టానం. దీంతో.. ఎమ్మెల్యేగా ఎవరికి అవకాశం ఇచ్చినా అప్పటి వరకు ఇంఛార్జ్‌గా ఉన్న వాళ్లు సహకరించకపోవడంతో సమస్యలు తప్పడం లేదట. ఆలూరు నియోజకవర్గ ఇంఛార్జ్ రేసులో రెండు కుటుంబాలు నిలిచాయన్న ప్రచారం. తాజా పరిణామాలతో అధిష్టానానికి విజ్ఞప్తులు చేస్తున్నారట తెలుగు తమ్ముళ్లు. నియోజకవర్గ ఇంఛార్జ్‌గా ఎవరు ఉంటారో.. వారికే ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని లేదంటే కేడర్‌లో విభేదాలు తలెత్తుతాయని చెబుతున్నారట. ఇలాంటి పరిస్థితుల్లో కొత్తగా నియోజకవర్గ ఇంఛార్జ్‌గా ఎవరిని నియమిస్తారన్న టాక్ నడుస్తోంది. అయితే.. ఆలూరు నియోజకవర్గ ఇంఛార్జ్ రేసులో ప్రస్తుతం రెండు కుటుంబాలు నిలిచాయన్న ప్రచారం జరుగుతోంది. ఒకటి కోట్ల కుటుంబం అయితే.. మరోటి వైకుంఠం కుటుంబం. ఉమ్మడి కర్నూలు జిల్లాలో కోట్ల కుటుంబానికి గట్టి చరిత్రే ఉంది.

ఈ ఫ్యామిలీ నుంచి వచ్చిన కోట్ల సుజాతమ్మ ప్రజలతో, పార్టీ నేతలతో సత్సంబంధాలు మెయింటెన్ చేస్తూ తమ మార్కు రాజకీయాలను నడుపుతుంటారన్న పేరు తెచ్చుకున్నారు. ఇక, వైకుంఠం ఫ్యామిలీ నుంచి వచ్చిన మహిళా నేత జ్యోతి సైతం నియోజకవర్గంలో మంచి గుర్తింపు సాధించారు.

మరి.. వీరిద్దరిలో ఎవరికి ఛాన్స్ దక్కుతుంది అన్నది ఆసక్తికరంగా మారింది. ఇదే సమయంలో ఈ రెండు కుటుంబాల నేతలను కాదని ఇంకెవరికైనా నియోజకవర్గ ఇంఛార్జ్ పదవి అప్పగిస్తారా అన్న చర్చ సైతం నడుస్తోంది

# దుకాణాల్లో పోలీసుల తనిఖీలు..
# పెనాల్టీలు విధింపు

ముమ్మిడివరం డాక్టర్ బి.ఆర్ అంబెద్కర్ కోనసీమ జిల్లా ఎస్ పి. బి. కృష్ణారావు ఆదేశాలు మేరకు విద్యాసంస్థలకు వంద మీటర్ల దూరంలో ఎలాంటి మత్తునిచ్చే పదార్థాలు, సిగరెట్,గుట్కా యువతకు దూరంగా ఉంచడానికి పోలీసులు ప్రత్యేక తనిఖీలు చేపట్టాకె.ముమ్మిడివరం సి. ఐ మోహనకుమార్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ ఐ.జ్వాలా సాగర్ సిబ్బంది తో బడ్డీషాపులు, టి. పాయింట్ ల్లో తనిఖీలు జరిపారు. పలు షాపుల యజమాను లకు పెనాల్టీలు విధించారు.

# ప్రాజెక్టు విష్ణుతో ఆర్థిక స్వావలంబన

ఆర్థిక వ్యవస్థలో జర్మనీ దేశాన్ని పక్కన పెట్టాం. మూడవ ఆర్థిక వ్యవస్థగా ఎదిగాం. భవిష్యత్ కాలంలో చైనాను అధిగమించబోతున్నాం. అమెరికాకు దగ్గరగా వెళ్లబోతున్నాం.. ఆర్థికంగా ఎదగడం మాత్రమే కాదు.. రక్షణ పరంగా కూడా అంతే స్థాయిలో వృద్ధిని సాధించబోతున్నాం. ఇదేదో అడ్డగోలుగా చెబుతున్న మాట కాదు. సరదాగా చేస్తున్న వ్యాఖ్య అంతకన్నా కాదు. ఇటీవల పాకిస్తాన్ పై ఆపరేషన్ సిందూర్ తర్వాత మన సైనిక సామర్థ్యం.. మన ఆయుధ సామర్థ్యం.. ప్రపంచానికి తెలిసింది. ముఖ్యంగా యుద్ధ విమానాలను వాడటంలో మనం ఉపయోగిస్తున్న సాంకేతికత ప్రపంచానికి సరికొత్తగా కనిపించింది. అయితే దీనిని ఇక్కడితోనే ఆపివేయాలని భారత ప్రభుత్వం అనుకోవడం లేదు. ఈ సాంకేతికతను మరింత అభివృద్ధి చేసుకోవాలని భావిస్తున్నది. ఈ క్రమంలోనే అత్యంత ఆధునిక రక్షణ వ్యవస్థను భారతదేశం నిర్మించుకుంటున్నది. ఇప్పటికే డిఆర్డిఓ అత్యంత ఆధునికమైన ఆయుధాలను తయారు చేస్తున్నది. వచ్చే ఐదు సంవత్సరాలలో వివిధ రకాల 12 హైపర్ సోనిక్ యుద్ధ క్షిపణులు సిద్ధమవుతున్నాయి. ఇవి దాడి చేయడం మాత్రమే కాదు.. శత్రు దేశాల రక్షణ సామర్థ్యాన్ని దెబ్బతీస్తాయి.

ప్రాజెక్టు విష్ణు లో భాగంగా డిఆర్డిఓ ఈ మిషన్ చేపడుతోంది.. డిఆర్డిఓ చేపడుతున్న మిషన్ లో హైపర్ సోనిక్ గ్లైడ్ వెహికల్, హైపర్ సోనిక్ క్రూజ్ మిస్సైల్స్, హైపర్ సోనిక్ మిస్సైల్ డిఫెన్స్ సిస్టమ్స్ ఉన్నాయి. దాడిలో అత్యంత వేగవంతమైన సామర్థ్యం.. అత్యంత ఆధునికమైన సాంకేతిక పరిజ్ఞానం వీటిలో ఉపయోగిస్తున్నారు. వీటి ద్వారా శత్రువులను అత్యంత బలంగా ఎదుర్కోవడం.. వెంటనే తుద ముట్టించడం వీటి లక్ష్యమని నిపుణులు చెబుతున్నారు. సరిగ్గా ఏడాది క్రితం డిఆర్డిఓ హైపర్ సోనిక్ మిస్సైల్ పరీక్షను అత్యంత విజయవంతంగా నిర్వహించింది. ఈ ప్రయోగం ద్వారా దేశ స్క్రామ్ జెట్ ఇంజన్ అభివృద్ధిలో ఇది కీలకమైన రాయిగా నిలిచింది.. అంతేకాదు ఈ వ్యవస్థలను అభివృద్ధి చేసి చైనా, రష్యా, అమెరికా స్థాయిలో భారత్ నిలిచింది. లాంగ్ రేంజ్ హైపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ కెపాసిటీ ఉన్న మోస్ట్ పవర్ఫుల్ కంట్రీస్ లో మన దేశం ఒకటిగా నిలిచింది. ధ్వని కంటే ఐదు రెట్ల వేగంతో ప్రయాణించే కెపాసిటీ ఉన్న ఆయుధాలను హైపర్ సోనిక్ అని పిలుస్తుంటారు. ఇలాంటి క్షిపణులను అడ్డుకునే వ్యవస్థ ప్రస్తుతం ప్రపంచంలో ఏ దేశం వద్ద లేదు.

అయితే ఇటువంటి అత్యాధునిక హైపర్ సోనిక్ వెపన్స్ ను డిఆర్డిఓ డెవలప్ చేస్తోంది. వీటిని ఆర్మీ, నేవి, వాయు సేన కోసం డెవలప్ చేస్తోంది. ఇందులో ఫస్ట్ టైం ఎక్స్టెండెడ్ ట్రాజెక్టరీ లాంగ్ రేంజ్ హైపర్ సోనిక్ క్రూయిజ్ మిస్సైల్ ను డిఆర్డిఓ డెవలప్ చేస్తోంది. స్క్రామ్ జెట్ ఇంజన్ తో మాక్- 8 స్పీడ్ ను రీచ్ అయ్యే విధంగా దీనిని డెవలప్ చేస్తున్నారు. ఇది 2,500 కిలోమీటర్ల వరకు ఉన్న టార్గెట్ లను చేజ్ చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు 2030 కల్లా వీటిని మన ఆర్మీలో ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ ఆయుధాలు మన ఆర్మీకి ఐదు సంవత్సరాల కాలంలో అందుబాటులోకి వస్తాయి. ఇవన్నీ కూడా మన దేశ రక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేస్తాయి.

అప్పుడు శత్రు దేశాలు మన మీద దాడి చేయాలంటే ఆలోచిస్తాయి. అంతేకాదు బలమైన దేశాల కంటే మనమే ముందు వరుసలో ఉంటాం. అన్నిటికంటే ముఖ్యంగా రక్షణ వ్యవస్థలో అమెరికాతో సమానంగా ఉంటాం. భారత్ ఒకప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద ఆయుధ దిగుమతిదారుగా ఉండేది. కానీ, ఇప్పుడు ఎగుమతిచేసే స్థాయికి ఎదిగింది. నరేంద్రమోదీ ప్రధాని అయ్యాక రక్షణ ఎగుమతులు గణనీయంగా పుంజుకున్నాయి. గత దశాబ్దంలో దాని రక్షణ ఎగుమతులు 34 రెట్లు పెరిగి, 2024?25 నాటికి రూ.23,622 కోట్లకు చేరాయి. పాకిస్తాన్, చైనా, టర్కీల భౌగోళిక రాజకీయ ఒత్తిడి, అమెరికా ఆయుధ సరఫరా ఖాళీలు, ప్రధాని నరేంద్ర మోదీ విదేశీ పర్యటనల్లో రక్షణ ఒప్పందాలపై దృష్టి ఈ విజయానికి దోహదపడ్డాయి. భారత రక్షణ ఎగుమతుల విలువ 2013?14 నాటికి రూ.686 కోట్లు ఉండగా, 2024?25 నాటికి రూ.23,622 కోట్లకు చేరాయి, ఇది 34 రెట్ల వృద్ధిని సూచిస్తుంది. 2014 నుంచి అమలులో ఉన్న మేడిన్ ఇండియా కార్యక్రమం దేశీ ఆయుధాలను, డ్రోన్‌లను సమర్థవంతంగా గుర్తించే సామర్థ్యం, ఎలక్ట్రానిక్ జామింగ్ వ్యూహాలను నిరోధించే లక్షణం పెంచింది. ఈ రాడార్‌ను సుఖోయ్?30ఎంకేఐ, రఫేల్, తేజస్ వంటి యుద్ధవిమానాలతో అనుసంధానం చేసే అవకాశం ఉంది. అజర్‌బైజాన్?అర్మేనియా మధ్య నాగోర్నో?కరాబాఖ్ సంఘర్షణలో అజర్‌బైజాన్‌కు టర్కీ, పాకిస్తాన్ మద్దతు ఇవ్వడంతో, భారత్ అర్మేనియాకు ఆకాశ్?1ఎస్, పినాకా రాకెట్ లాంచర్లు, స్వాతి రాడార్లు వంటి ఆయుధాలను సరఫరా చేస్తోంది. ఈ సహకారం అజర్‌బైజాన్ యొక్క సైనిక ఆధిపత్యాన్ని సవాలు చేస్తూ, టర్కీ, పాకిస్తాన్‌లపై పరోక్షంగా ఒత్తిడి కలిగిస్తోంది. ఇదే సమయంలో 2025లో మోదీ సైప్రస్ సందర్శన, టర్కీ నియంత్రిత ఉత్తర సైప్రస్‌కు వ్యతిరేకంగా బలమైన దౌత్య సందేశాన్ని ఇచ్చింది. సైప్రస్ భారత్ యొక్క భౌగోళిక రాజకీయ వ్యూహంలో మధ్యధరా, యూరోపియన్ మార్కెట్లకు గేట్‌వేగా మారుతోంది. చైనా?తైవాన్ సంఘర్షణ నేపథ్యంలో, భారత్ తైవాన్‌తో సంబంధాలను బలోపేతం చేస్తోంది.

అమెరికా మద్దతుతో, భారత్ తైవాన్‌కు అండగా నిలవడం ద్వారా చైనాకు వ్యూహాత్మక ఒత్తిడి కల్పిస్తోంది, ఇది ఇండో?పసిఫిక్‌లో చైనా ఆధిపత్యాన్ని సవాలు చేస్తుంది. పాకిస్తాన్, చైనా, టర్కీల శత్రుత్వం, అమెరికా ఎగుమతి ఖాళీలు భారత్‌ను స్వదేశీ రక్షణ తయారీ, ఎగుమతులపై దృష్టి పెట్టేలా చేశాయి. మోదీ విదేశీ పర్యటనలు గ్రీస్, అర్మేనియా, సైప్రస్, తైవాన్‌లతో రక్షణ ఒప్పందాల ద్వారా భారత్ యొక్క భౌగోళిక రాజకీయ ప్రభావాన్ని పెంచాయి.

## అధికార, ప్రతిపక్ష నేతల మధ్య సర్దుబాటు అంతు లేకుండా పోతున్న ఇసుక మాఫియా

విజయవాడ, జూలై 9, ఏపీలో వ్యవస్థీకృత దోపిడీ జరుగుతోందా? అంతా కలిసి కానిచ్చేస్తున్నారా? బహిరంగంగా విమర్శలు చేసుకొని.. పరోక్షంగా సహకారం అందించుకుంటున్నారా? నీకింత నాకింత అంటూ వాటాలు వేసుకొని దోపిడీకి తెర తీశారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. కొత్త ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయింది. అన్ని రకాల వ్యవస్థలు, పాలసీలు గాడిలో పడ్డాయి. అదే సమయంలో అధికార, ప్రతిపక్ష నేతల మధ్య సర్దుబాటు కూడా సవ్యంగా సాగిపోతున్నట్లు తెలుస్తోంది. మద్యం, ఇసుక, మట్టి.. ఇలా అన్ని రకాల మాఫియాలు కోరలు చాస్తున్నాయి. కోట్లాది రూపాయలు కొల్లగొడుతున్నాయి. రోజువారి ఆదాయం, కమిషన్లతో వందల కోట్ల రూపాయలు పక్కదారి పడుతుంది. ఎవరున్నా ఏం గర్వకారణం అంటూ తతంగం సాగుతోందిఏపీలో దోపిడి పార్ట్నర్స్ కొనసాగుతోందన్న కామెంట్స్ వినిపిస్తున్నాయి. సాధారణంగా రాజకీయ నేతలకు అనుచరులు, ఆప్తులు, బంధువులు ఉంటారు. వారికి ఆ నేత ప్రాధాన్యం ఇస్తుంటారు. కానీ ఇప్పుడు కొత్త రిలేషన్ పుట్టుకొచ్చింది. అదే ప్రాణం కంటే మించి మారిపోయింది. డబ్బులు ఊరికే రావన్న ఓ ప్రకటన చూసి స్ఫూర్తి పొందారు నేతలు. తెర ముందు కొట్టుకుందాం.. తెర వెనుక పంచుకుందాం అన్న మాదిరిగా చేతులు కలిపారు. కోట్లు కొల్లగొడుతున్నారు. బయటకు మాత్రం స్ఫూర్తిదాయకమైన మాటలతో గడుపుతున్నారు. నా పేరిట ఒక్క కంపెనీ అయినా ఉందా.. ఒక్క మద్యం దుకాణం అయినా ఉందా అంటూ తేలికపాటి మాటలు చెబుతున్నారు. తెర వెనుక బినామీలను పెట్టి.. మేమున్నాం గో హెడ్ అంటూ ప్రోత్సహిస్తున్నారు. జగన్ హయాంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలు నడిపింది. ప్రభుత్వ పెద్దలే దోపిడీ చేశారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పుడు ప్రైవేటు వ్యక్తుల చేతికి మద్యం షాపులు వెళ్లాయి. కానీ గతం మాదిరిగా మద్యం వ్యాపారులు మాత్రమే ఈ దుకాణాలు నడపడం లేదు. తెర వెనుక ఎమ్మెల్యేలు ఉన్నారు. మాజీ ఎమ్మెల్యేలు ఉన్నారు. పెట్టుబడి పెట్టేందుకు అధికార పార్టీ ప్రజాప్రతినిధులకు.. ప్రతిపక్ష నేతలు ఫండింగ్ ఇచ్చారు. ఇది అన్ని చోట్ల బాహాటంగానే కనిపిస్తోంది. కానీ మీడియా ముందు.. వివిధ వేదికల వద్ద మాత్రం రాజకీయంగా వారు విభేదించుకుంటున్నారు. కానీ వ్యవస్థీకృత దోపిడీ విషయంలో మాత్రం పరస్పరం సహకారం అందించుకుంటున్నారు. తెలుగు నాట ఏ ప్రాంతంలో చూసిన ఇది కనిపిస్తోంది. ముఖ్యంగా ఏపీలో మాత్రం ఈ దోపిడీ రోజురోజుకు విస్తృతం అవుతోంది. ఒక్క మద్యం కాదు.. మట్టి, ఇసుక మాఫియ కు అంతులేకుండా పోతుంది. నదుల్లో ఇసుకను తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. పేరుకే ఉచితం కానీ.. ఆ ఉచితం మాటున పెద్ద ఎత్తున ఇసుకను తరలించి వందల కోట్ల రూపాయలు కొల్లగొడుతున్నారు. మట్టి మాఫియా చెలరేగిపోతోంది. అయితే ఇది గ్రామాలకు కూడా విస్తరిస్తోంది. చెరువులతో పాటు కాలువల అభివృద్ధి పేరిట మట్టిని తోడేస్తున్నారు. తోడేళ్లుగా మారుతున్నారు. అయితే నాడు జగన్మోహన్ రెడ్డి అయినా.. నేడు చంద్రబాబు అయినా వీటిని ప్రోత్సహించడం అనేది నేరమే అవుతుంది. అయితే ఏపీలో ఈ వ్యవస్థీకృత దోపిడీ ఎవరు అధికారంలో ఉన్న.. అనధికారికంగా జరుపుతూనే ఉన్నారు.

## ట్రెండింగ్ లో అన్నా, చంద్రన్నా పాట

తిరుపతి, జూలై 9, సాహిత్యంతో పనిలేదు. రాగంతో అవసరం లేదు. పల్లవి ప్రస్తావన వద్దు. పదాలు సరదాగా ఉంటే చాలు. రాగం అదే పుట్టేస్తుంది. సాహిత్యం అదే వచ్చేస్తుంది. దాని తగ్గట్టుగా దరువు తోడైతే చాలు.. ఆ పాటను సోషల్ మీడియాలోకి ఎక్కిస్తే చాలు.. ట్రెండింగ్ లోకి వచ్చేసినట్టే. నేటి కాలంలో అటువంటి పాటలకు ఏ స్థాయిలో డిమాండ్ ఉందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. సరిగా నాలుగు నెలల క్రితం కోయా రే కోయా పాట ఎంతటి సంచలనం సృష్టించిందో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. చివరికి ఓ హీరో తన సినిమాలో ఈ పాటను పెట్టుకున్నారు. అంతకుముందు ఓ మతాన్ని ఆచరించే మహిళ.. తను ఆరాధించే దేవుడిని స్తుతిస్తూ పాడిన పాట.. ఇలా చెప్పుకుంటూ పోతే జాబితా బోలెడు ఉంటుంది. ఫేమస్ అవ్వడానికే వారంతా ఇది చేస్తుంటారు. ఒకప్పుడు ఇటువంటి పాటలు ఉన్నప్పటికీ అంతగా వెలుగులోకి వచ్చేవి కాదు. కానీ ఇప్పుడు సోషల్ మీడియా అందుబాటులోకి వచ్చిన తర్వాత.. రకరకాల రూపాలలో అందుబాటులోకి వస్తున్నాయి. తాజాగా సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతున్న ఓ పాట కూడా ఇలాంటిదే. కొంతమంది మహిళల బృందం "చంద్రన్నా.. మాయన్నా" అనే పేరుతో ఓ పాటను పాడారు. ఆ పాట ఒక పల్లె పదానికి పేరడీ మాదిరిగా ఉంది.. ఒంటిపై ముడతలు పడ్డాయని.. రెండు కాళ్లు పోయి మూడో కాలు వచ్చిందని.. చూపు మందగించిందని.. శరీరం సత్తువ కోల్పోయిందని.. 50 ఏళ్ల వయసు నుంచి 60 ఏళ్ల వయసు వచ్చేసిందని ఆ పాట పాడుతున్న మహిళలు పేర్కొన్నారు..సహజంగా ఈ పాటలో చంద్రన్న అనే ప్రస్తావన ఉండడంతో కొంతమంది కావాలని ఈ పాటను సోషల్ మీడియాలో ట్రోల్ చేస్తున్నారు.. ఆ పాటను కావాలని ఓ పార్టీ నాయకులు ఈ స్థాయిలో విమర్శిస్తున్నారని నెటిజన్లు అంటున్నారు.. ఆ మహిళలు చంద్రన్న అనే పేరు ఒక రాజకీయ నాయకుడిని ఉద్దేశించి పాడలేదని.. కేవలం జనాలకు అర్థమవ్వడానికే పేరును ప్రస్తావించారని పేర్కొంటున్నారు. దానివల్ల జనాలకి ఈజీగా కనెక్ట్ అవుతుందని వారు భావించారు. కానీ కొంతమంది మాత్రం ఈ పాటకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్నారు. తమ రాజకీయ ప్రాబల్యం కోసం ఈ పాటను వక్ర భాష్యం చెబుతున్నారని నెటిజన్లు అంటున్నారు. ఆ మహిళలు ఓ భజన సంఘంలో పనిచేస్తున్నట్టు తెలుస్తోంది. వారి వ్యవహార శైలి.. ధరించిన దుస్తులు.. పెట్టుకున్న బొట్లు.. భజన సంఘాన్ని ప్రతిబింబిస్తున్నాయి. తమ భజన సంఘం ద్వారా వారు ఈ పాటలు పాడే ప్రక్రియకు శ్రీకారం చుట్టినట్టు తెలుస్తోంది. వారు సమాజాన్ని మేల్కొల్పే ఉద్దేశంతో పాటలు పాడితే.. కొంతమంది మాత్రం పనిగట్టుకొని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు.. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో విస్తృతమైన చర్చకు దారితీస్తోంది. ఇదే సమయంలో వీక్షణలు సొంతం చేసుకుంటున్నది

## భలే చౌక బేరం...సగానికి కార్లు...

న్యూఢిల్లీ, జూలై 9, (న్యూస్ పల్స్) ఢిల్లీలో పాత పెట్రోల్, డీజిల్ వాహనాలపై ప్రభుత్వం పెట్టిన ఆంక్షల వల్ల సెకండ్ హ్యాండ్ కార్ల ధరలు భారీగా పడిపోయాయి. గత కొద్ది రోజుల్లో పాత కార్ల ధరలు 40 నుండి 50 శాతం వరకు తగ్గాయి. ఢిల్లీ ప్రభుత్వ నియమాలు, కోర్టు ఆదేశాల కారణంగా పాత వాహనాల అమ్మకాలపై చాలా ప్రభావం పడిందని అక్కడి వ్యాపారులు అంటున్నారు. రాజధానిలో సుమారు 60 లక్షల పాత వాహనాలు ఈ ఆంక్షల వల్ల తీవ్రంగా ప్రభావితం అయ్యాయని చాంబర్ ఆఫ్ ట్రేడ్ అండ్ ఇండస్ట్రీ అనే పరిశ్రమ సంఘం పేర్కొంది. ఢిల్లీలో జూలై 1 నుంచి పాత వాహనాలపై నిషేధం అమల్లోకి రావాలి. అయితే, ఎయిర్ క్వాలిటీ మేనేజ్?మెంట్ కమిషన్, పర్యావరణ మంత్రి ఇచ్చిన లేఖ తర్వాత ఈ నిషేధాన్ని తాత్కాలికంగా వాయిదా వేసింది. ఇది కేవలం తాత్కాలిక ఉపశమనం మాత్రమే. ఎందుకంటే ఎండ్ ఆఫ్ లైఫ్ వాహనాలపై నిషేధం పూర్తిగా రద్దు కాలేదు. ఈ నిర్ణయం తర్వాత కూడా సీజ్ చేసిన వాహనాల భవిష్యత్తుపై గందరగోళం కొనసాగుతోంది. ప్రభుత్వం కొద్దిగా ఊరటనిచ్చినా పాత వాహనాల యజమానులు, వ్యాపారులకు పరిస్థితి ఇంకా స్పష్టంగా లేదు. ఢిల్లీలో నిబంధనల ప్రకారం.. 15 ఏళ్లు నిండిన పెట్రోల్ కార్లను, 10 ఏళ్లు నిండిన డీజిల్ కార్లను నడపడానికి అనుమతి లేదు. కోర్టు ఆదేశాల తర్వాత ఢిల్లీ ప్రభుత్వం ఈ పాత వాహనాలకు ఇంధనం పోయడంపై కూడా నిషేధం విధించింది. అంటే, జూలై 1 నుంచి ఈ వాహనాలు రోడ్లపైకి రాకూడదు. అయితే, వ్యాపారులు, సామాన్య ప్రజలు దీనిపై నిరసన వ్యక్తం చేయడంతో ప్రభుత్వం ఎయిర్ క్వాలిటీ మేనేజ్?మెంట్ కమిషన్ ను ఈ ఆంక్షలను తొలగించమని కోరింది. అయినప్పటికీ వ్యాపారులు ఇప్పటికీ ఆందోళన చెందుతున్నారు. ఇప్పుడు తమ పాత కార్లను కేవలం పావు వంతు ధరకే అమ్ముకోవాల్సి వస్తోందని అక్కడ వ్యాపారులు చెబుతున్నారు. ఉదాహరణకు, గతంలో రూ.6-7 లక్షలకు అమ్ముడైన లగ్జరీ సెకండ్ హ్యాండ్ కార్లు ఇప్పుడు రూ.4-5 లక్షలకు కూడా అమ్ముడుపోవడం కష్టంగా మారిందని తెలిపారు. పాత వాహనాలను సాధారణంగా పంజాబ్, ఉత్తరప్రదేశ్, రాజస్థాన్, బీహార్, తమిళనాడు, కర్ణాటక, కేరళ వంటి ఇతర రాష్ట్రాలకు అమ్ముతుంటారు. కానీ ఇప్పుడు ఇతర రాష్ట్రాల కొనుగోలుదారులు కూడా బేరం ఆడుతున్నారు. ఎందుకంటే వారికి ఢిల్లీలో ఉన్న పరిస్థితి గురించి తెలుసు. కరమ్ బాగ్, ప్రీత్ విహార్, పీతంపుర, మోతీ నగర్ వంటి ప్రాంతాల్లో 1000 మందికి పైగా వ్యాపారులు సెకండ్ హ్యాండ్ కార్ల వ్యాపారంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఇప్పుడు ఈ వ్యాపారులకు భారీ నష్టాలు వస్తున్నాయి.

వ్యాపారులకు నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ తీసుకోవడంలోనూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఢిల్లీ నుంచి పాత వాహనాలను వేరే రాష్ట్రానికి ట్రాన్స్ఫర్ చేయాలంటే ఈ సర్టిఫికేట్ తప్పనిసరి. గతంలో ఈ ప్రక్రియ సులువుగా ఉండేది.. కానీ ఇప్పుడు ఆలస్యం, టెక్నికల్ సమస్యలు పెరిగాయి. మొత్తం మీద, పాత వాహనాలపై పెట్టిన ఆంక్షలు ఢిల్లీ సెకండ్ హ్యాండ్ కార్ల మార్కెట్‌ను తీవ్ర సంక్షోభంలోకి నెట్టాయి.

## దారి తప్పుతున్న బండి

హైదరాబాద్, జూలై 9, మీడియాకు, రాజకీయ నాయకులకు ఉన్న అవినాభావ సంబంధం ఈనాటిది కాదు.. వెనుకటి కాలంలో నచ్చిన ముఖ్యమంత్రి ఉండడానికి తెలుగు నాట ఓ మీడియా అధినేత ఏకపక్ష రాతలు రాశాడు. మొదట్లో ఆ ముఖ్యమంత్రికి ఆ మీడియా అధినేత కు మధ్య సంబంధం బాగానే ఉండేది. ఆ సంబంధం చెడిపోయిన తర్వాత ఆ మీడియా అధినేత ఆ ముఖ్యమంత్రిపై తీవ్రతి తీవ్రమైన స్థాయిలో వార్తలు రాయించాడు. కార్టూన్లు గీయించాడు. ఈ ఉదంతం తెలుగు రాష్ట్రంలోనే కాదు.. జాతీయస్థాయిలోనూ అప్పట్లో చర్చకు దారితీసిందిఆ తర్వాత ఆ మీడియా అధినేత మరో ముఖ్యమంత్రికి దగ్గర వ్యక్తిగా మారిపోయాడు. తన సంస్థ ప్రయోజనాలకు అనుగుణంగా వార్తలు రాయడం మొదలుపెట్టాడు. నచ్చని వాళ్ళ మీద విష ప్రచారం చేశాడు. అతను మాత్రమే కాదు మీడియాలో ఉండే ఏ వ్యక్తయినా సరే ఇలాంటి విధానాలనే అనుసరిస్తారు. అది కేవలం తెలుగు రాష్ట్రాలే కాదు.. జాతీయస్థాయిలోనూ ఇదే దరిద్రం కొనసాగుతోంది. గత చరిత్ర తీసుకున్నా.. ఇప్పటి వర్తమానాన్ని పరిశీలించినా మీడియా అధినేతలు ఎప్పుడు కూడా వారి ప్రయోజనాలు మాత్రమే చూసుకుంటారు. అధికారంలో ఉన్న పార్టీకి మాత్రమే డప్పు కొడతారు. ఇక ప్రస్తుతం తెలుగు రాష్ట్రాలలో కూటమి, కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి. ఈ పార్టీలకు డప్పులు కొట్టే మీడియా సంస్థలు చాలానే ఉన్నాయి. ఒకప్పుడు ప్రతిపక్షానికి అంతగా వాయిస్ ఉండేది కాదు. కానీ ఇప్పుడు ప్రతిపక్ష పార్టీలు కూడా ఒకప్పుడు అధికారంలో ఉన్నవే. అందువల్లే భారీగా డబ్బులు వెనకేసుకుని న్యూస్ ఛానల్స్ రన్ చేస్తున్నాయి. సో మీడియా అనేది ఇప్పుడు రూలింగ్, నాన్ రూలింగ్ కేటగిరిగా మారిపోయింది. సహజంగానే ప్రతిపక్షంలో ఉన్న పార్టీ అధికారంలోకి రావాలి అనుకుంటుంది. అందుకోసం ఏవైనా చేస్తుంది. ఇక రూలింగ్ లో ఉన్న పార్టీ వచ్చే సారి కూడా అధికారాన్ని దక్కించుకోవడానికి రకరకాల ప్రయత్నాలు చేస్తుంది. అంటే నిత్యం అటు రూలింగ్.. ఇటు నాన్ రూలింగ్ పార్టీల మీడియా సంస్థలకు చేతినిండా పని ఉంటుంది. ఒకరి మీద ఒకరు విమర్శలు చేసుకోవడం.. ఒకరిపై ఒకరు బురద జల్లుకోవడం ఇదే పని. ఇటీవల ఓ న్యూస్ ఛానల్ భారత రాష్ట్ర సమితి కార్యనిర్వాహక అధ్యక్షుడు మీద పనికిమాలిన తంబ్ నైల్స్ పెట్టింది. అవి కాస్త సంచలనంగా మారాయి. దీంతో భారత రాష్ట్ర సమితి నాయకులు స్పందించారు. ఆ న్యూస్ ఛానల్ కార్యాలయం మీద దాడి చేశారు. ఆ దాడి అనంతరం భారత రాష్ట్ర సమితి నాయకులు రెచ్చిపోయి.. మీడియాకు ప్రాంతీయ భేదాన్ని ఆపాదించారు. సీమాంధ్ర మీడియా అంటూ విమర్శించారు. ఎప్పుడైతే సీమాంధ్ర మీడియా అంటూ గులాబీ నాయకులు వ్యాఖ్యలు చేశారో.. ఆంధ్రజ్యోతి అధినేత వేమూరి రాధాకృష్ణ స్పందించారు. ఆయన ఒక అడుగు ముందుకేసి తెలంగాణ కెసిఆర్ జాగీర్ కాదు అంటూ మండిపడ్డారు. తన సంపాదకీయంలో చాలా ఘాటు పదాలు వాడారు. దీంతో వివాదం మొదలైంది. ఈ నేపథ్యంలోనే ఏబీఎన్, ఆంధ్రజ్యోతి సంస్థల కార్యాలయాల ఎదుట ప్రభుత్వం పోలీసులతో భద్రత కల్పించింది. ఆ దృశ్యాలను ఉదయం నుంచి గులాబీ పార్టీ నాయకులు సోషల్ మీడియాలో తెగ తిప్పుతున్నారు. దెబ్బకు పోలీసుల పహారాతో కార్యాలయాలు నిర్వహిస్తున్నారని ఎగతాళి చేశారు. ఇక ఇదే క్రమంలో భారతీయ జనతా పార్టీ తెలంగాణ అధ్యక్షుడు రామచంద్రరావు స్పందించారు. ఆంధ్రజ్యోతి సంస్థలపై గులాబీ పార్టీ కార్యకర్తలు దాడులు చేస్తే తాము టీ న్యూస్ పై దాడులకు దిగాల్సి ఉంటుందని హెచ్చరించారు. రామచంద్రరావు మాటలను ఉటంకిస్తూ కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కూడా తీవ్రంగా స్పందించారు. ఒకవేళ ఆర్కే నిర్వహిస్తున్న మీడియా సంస్థల మీద దాడులు చేస్తే.. కచ్చితంగా తెలంగాణ భవన్ మీద తాము దాడులు చేస్తామని హెచ్చరించారు. బండి సంజయ్ చేసిన వ్యాఖ్యల పట్ల గులాబీ పార్టీ నాయకులు తీవ్రస్థాయిలో స్పంది స్తున్నారు. ఆ ఛానల్, పేపర్ ను నెత్తిన పెట్టుకొని తిరుగు బండన్నా.. నువ్వు కేంద్ర మంత్రివా?ఆసంస్థలోఉద్యోగివా?లేక రాధాకృష్ణకు దగ్గరి బంధువువా? అంటూ విమర్శిస్తున్నారు.

## వేడెక్కుతున్న రాజకీయాలు

హైదరాబాద్, జూలై 9, తెలంగాణలో రాజకీయాలు రోజురోజుకూ వేడెక్కుతున్నాయి. సవాళ్లు, ప్రతి సవాళ్లతో అధికార, విపక్షాల మధ్య మాటల యుద్ధం ముదురుతుంది. బీఆర్ఎస్ నేతలు ఎన్నిలకు మూడేళ్ల ముందే రా రమ్మంటూ కాంగ్రెస్ నేతలకు సవాల్ విసురుతున్నారు. ప్రతి చిన్న విషయానికి సై అంటే సై అంటున్నారు. ఎన్నికలకు తెలంగాణలో ఇంకా మూడేళ్లు సమయం ఉంది. అయితే స్థానిక సంస్థల ఎన్నికల సమరం కోసమే ఈరకమైన ప్రయత్నాలు జరుగుతున్నాయన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అధికారంలో ఉన్న పార్టీ తాము అమలుచేస్తున్న సంక్షేమపథకాలపై చర్చకుసిద్ధమని ప్రకటించారు. అయితే ఇందుకు తాము సోమాజీ గూడ ప్రెస్ క్లబ్ కు వస్తున్నామంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అయితే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దమ్ముంటే పాలనచేయాలని, సంక్షేమాన్ని అమలు చేయాలని, లేకుంటే అధికారాన్ని కేసీఆర్ కు అప్పగిస్తే పాలనఎలా చేయాలో చూపిస్తామని కేటీఆర్ అన్నారు. తాను చర్చకు సిద్ధమని ప్రెస్ క్లబ్ కు వస్తే తోకముడుచుకు పోయారంటూ కేటీఆర్ ఎద్దేవా చేశారు. ప్రజలను మోసం చేస్తూ అబద్ధపు పాలన చేసే రేవంత్ రెడ్డికి అధికారంలో కొనసాగేందుకు అర్హత లేదని అన్నారు. ఏ వేదిక అయినా.. ఏ ప్లేస్ అయినా తాను చర్చకు రావడానికి సిద్ధమని కేటీఆర్ ప్రకటించారు. ఢిల్లీకి తిరుగుతూ ముడుపులు అందిస్తూ పదవులను కాపాడుకోవడానికే రేవంత్ రెడ్డి ప్రయత్నిస్తున్నారని, ప్రజా సంక్షేమాన్నిపక్కనపెట్టి పదవులను కాపాడుకోవడానికే కాలాన్నివెచ్చిస్తున్నారన్నారు. అయితే కేటీఆర్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతలు మండిపడ్డారు. కేటీఆర్ తన సోదరి కవిత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేక ఫ్రస్టేషన్ లో ఉన్నారని, ముందు తన ఇంట్లో జరుగుతున్న సమస్యలను పరిష్కరించుకుని అప్పుడు చర్చకు సిద్ధం కావాలని కాంగ్రెస్ నేతలు ప్రతి సవాల్ విసిరారు. అయ్య ఫామ్ హౌస్ లో పడుకున్నాడని, ప్రతిపక్షనేతగా అసెంబ్లీకి కూడా రావడం లేదని, దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలని కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. తాము ఏ పాయింట్ పైనేనా చర్చకు సిద్ధమని ప్రకటించారు. మొత్తం మీదస్థానిక సంస్థల ఎన్నికల కోసమే ఈరకమైన సవాళ్లు, ప్రతి సవాళ్లు తెలంగాణలో అధికార, ప్రతిపక్ష పార్టీల మధ్య ఎక్కువయ్యాయన్నది వాస్తవం.

## విద్యార్ధులను సొంత పిల్లలగా భావించాలి
## కలెక్టర్ హైమవతి

సిద్దిపేత నేను ఒకప్పుడు టీచర్ నే. విద్యార్థులను సొంత పిల్లగా భావించాలని జిల్లా కలెక్టర్ కే. హేమావతి ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం జిల్లా కలెక్టర్ తొగుట మండల కేంద్రంలో పర్యటించి ఇందిరమ్మ ఇళ్లకు మార్కింగ్ ను మరియు నిర్మాణ ప్రగతిని పరిశీలించారు. ఈ సందర్భంగా కంకర, ఇసుక, రాడ్ అన్ని సమపాళ్లలో కలిపి పది కాలాలపాటు మన్నికగా ఉండేలా ఇళ్ల నిర్మాణాలను దగ్గర ఉండి కట్టించుకోవాలని లబ్ధిదారులకు సూచించారు.

అనంతరం తొగుట జడ్పీ హైస్కూల్ ను సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. మెనూ ప్రకారం కాకుండా ఒక కూర మరియు గుడ్డు మాత్రమే ఉండడంతో ఆగ్రహం వ్యక్తం చేసి వివరాలను డీఈఓ కు పంపించాలని ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డిని ఆదేశించారు. మధ్యాహ్నం భోజనం చేస్తున్న విద్యార్థులతో మాట్లాడి భోజనం రుచికరంగా ఉందా అని తెలుసుకున్నారు.

# జామ మసీద్ అభివృద్ధికి కట్టుబడి ఉన్న, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్.



**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ పట్టణంలోని ఉప్పుగడ్డ వీధిలో ఉన్న జామా మసీదును బుధవారం రోజున సందర్శించిన వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కు ముస్లిం కమిటీ, మసీదు కమిటీ సభ్యులు ఘన స్వాగతం పలికారు. కమిటీ అధ్యక్షుడు మొహమ్మద్ అక్రమ్, జామా మసీదు అధ్యక్షుడు నవాబ్ ఖాన్ లతో పాటు సభ్యులు ఎమ్మెల్యే కు శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మసీద్ పునర్నిర్మానానికి నిధులు మంజూరుపై వినతి పత్రం అందజేశారు. దీనిపై వెంటనే స్పందించిన ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, పక్ఫ్ బోర్డ్ చైర్మన్ ను ఫోన్లో సంప్రదించగా మసీదు పునర్నిర్మాణానికి సంబంధించిన సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. మైనార్టీ శాఖ మంత్రులతో చర్చించి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మైనార్టీ సీనియర్ నాయకుడు అబ్దుల్ రజాక్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ ఎస్ కే సాబీర్, ముస్లిం కమిటీ సభ్యులు ఎస్ డి షబ్బీర్, మోసిన్, నాసిర్, యూసుఫ్, షరీఫ్, రావుఫ్ ఖాన్, షరీఫ్ బాబా, కైఫ్, సోహెల్, కాంగ్రెస్ ముస్లిం నేతలు పాల్గొన్నారు.

# రాజకీయాలకు అతీతంగా ఆధ్యాత్మికత వికాసానికి కు తోడ్పడుతాం : పట్నం మహేందర్ రెడ్డి



**కార్వాన్ ప్రజాబలం ప్రతినిధి:**రాజకీయాలకు అతీతంగా సంప్రదాయాలను గౌరవిస్తూ అందరిలో ఆధ్యాత్మికత వికాసానికి కు తోడ్పడుతామని తెలంగాణ ప్రభుత్వ చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. బుధవారం కార్వాన్ నియోజకవర్గంలో తెలంగాణ ప్రభుత్వం చీఫ్ విప్ డాక్టర్ పట్నం మహేందర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా రాష్ట్ర దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో గుడిమల్కాపూర్ లోని జామ్ సింగ్ బాలాజీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో 2025 సంవత్సర బోనాల నిర్వాహణ చెక్కులను ఎమ్మెల్యేలు కౌసర్ ముహి యుద్దిన్, ఉస్మాన్ బిన్ మహమూద్ అలీ హజారీ లతో కలిసి పంపిణీ చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 176 దేవాలయాలకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.78 లక్షల విలువైన చెక్కులను పంపిణీ చేసినట్లు మహేందర్ రెడ్డి చెప్పారు. రాష్ట్రంలో దేవాలయాల అభివృద్ధికి, అన్ని సంప్రదాయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని వ్యాఖ్యానించారు. లౌకిక దేశంలో అందరూ కలిసికట్టుగా అన్ని మతాల పండుగలు జరుపుకోవాలని సూచించారు.

కార్పొరేటర్ స్వామి యాదవ్, గోల్కొండ తహసిల్దార్ అహల్య రెడ్డి, దేవాదాయ శాఖ ఈవో అంజనా దేవి, ఇన్స్ పెక్టర్ సురేఖ తదితరులు పాల్గొన్నారు.

# కమలంపై సంఘ్ ప్రభావం

హైదరాబాద్, జూలై 9 భారతీయ జనతా పార్టీ రెండు తెలుగు రాష్ట్రాల్లో కీలక మైన నిర్ణయాలను తీసుకుంటుంది. బీజేపీ గతంలో ఎన్నడూ లేని విధంగా పార్టీ కోసం పనిచేసిన వాళ్లను, ఆర్ఎస్ఎస్ నేపథ్యం ఉన్నవాళ్లు, కమిట్ మెంట్ తో పనిచేసిన వాళ్లకు మాత్రమే అవకాశాలు కల్పిస్తామని చెప్పకనే చెబుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలను కొంత పక్కన పెడుతున్నట్లే కనపడుతుంది. దీంతో ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతల్లో కొంత అసంతృప్తులు పెరిగిపోతున్నాయి. అయినా కేంద్రంలో అధికారంలో ఉండటంతో ప్రస్తుతానికి ఏమీ మాట్లాడేందుకు బయటకు రాకపోయినా వారు మాత్రం త్వరలోనే ఒక నిర్ణయం తీసుకునే అవకాశాలు కనిపిస్తున్నాయి.తెలంగాణలో కేంద్ర మంత్రి పదవులు రెండు ఇచ్చారు. అందులో ఒకటి కిషన్ రెడ్డి కాగా, మరొకరు బండి సంజయ్. ఇద్దరూ పార్టీలో సీనియర్ నేతలు. పార్టీతో దశాబ్దకాలం అనుబంధం ఉన్న వారు. ఇక్కడ సామాజికవర్గాలను చూడకుండా కేవలం పార్టీకి నిబద్ధతతో పనిచేసిన వారికి మాత్రమే అవకాశం కల్పించారు. రాజ్యసభ స్థానాన్ని కూడా పార్టీలో సుదీర్ఘకాలంగా ఉన్న కె. లక్ష్మణ్ కు కేటాయించారు. అంతే తప్ప మరొకరికి ఈ అవకాశం ఇవ్వలేదు. ఇక తాజాగా బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవిపై ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలు అనేక ఆశలు పెట్టుకున్నారు. కానీ అందరి ఆశలను తలకిందులు చేస్తూ పార్టీకి విధేయుడిగా ఉంటున్న కె.రామచంద్రరావును బీజేపీ అధ్యక్షుడిగా నియమించారు. ఆంధ్రప్రదేశ్ లోనూ అంతే జరుగుతుంది. కూటమి ప్రభుత్వం ఏర్పాటు కాగానే తమకు మంత్రి పదవి ఖాయమని చాలా మంది అంచనాలు వేసుకున్నారు. కానీ వారిందరినీ పక్కన పెట్టి సత్యకుమార్ యాదవ్ ను మంత్రి పదవికి ఎంపిక చేశారు. ఇక కేంద్ర మంత్రివర్గంలో పురంద్రీశ్వరి లాంటి వాళ్లను పక్కనపెట్టి శ్రీనివాసవర్మ లాంటి పార్టీకి నిబద్ధత కలిగిన నేతను ఎంపికచేయడంతో అందరూ ఆశ్చర్యపోయారు. ఇక రాజ్యసభ సభ్యుడిగా పాకా వెంకట సత్యనారాయణ ఎంపిక కూడా అందరినీ ముక్కున వేలేసుకునేలా చేసింది. ఇక తాజాగా పార్టీ అధ్యక్షుడిగా ఎమ్మెల్సీ మాధవ్ ను ఎంపిక చేయడంతోనే ఇక ఇతర పార్టీల నుంచి వచ్చిన నేతలకు పదవులు ఉండబోవన్న సంకేతాలు ఇచ్చినట్లయిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి.భవిష్యత్ లోనూ ఎంపికలు ఇలాగే ఉంటాయని చెబుతుండటంతో పార్టీ మారి వచ్చిన నేతలు కొంత పునరాలోచనలో పడినట్లు తెలిసింది.

# ఆ రోడ్డుకు విముక్తి కలిపించిన హైడ్రా

హైదరాబాద్, జూలై 9, దారికి అడ్డుగా ఉన్న ఓ పెద్ద గోడ వేలాది ప్రజలకు ఇబ్బందికరంగా మారింది. ఆ గోడ వల్ల వేల మంది ప్రజలు నిత్యం 5 కిలోమీటర్లు ఎక్కువ ప్రయాణించిన పరిస్థితి నెలకొంది. ఔటర్ రింగ్ రోడ్డు ఎగ్జిట్ 4 నుంచి మల్లంపేట, బాచుపల్లి క్రాస్ రోడ్డు మీదుగా ప్రగతినగర్ కు చేరుకునేందుకు ప్రజలు నానా తంటాలు పడేవారు. మరి కొంత మంది తమది గేటెడ్ కమ్యూనిటీ తమ కాలనీలో నుంచి రాకపోకలు బంద్ అంని అడ్డుగోడలు కట్టేవారు ఉన్నారు. ఇదంతా మేడ్చల్ జిల్లా దుండిగల్ మండలంలోని మల్లంపేట, బాచుపల్లి గ్రామాల మధ్య నెలకొన్న వివాదం. దాదాపు 25,000 మంది ప్రజల రాకపోకలకు అడ్డంకిగా ఉన్న గోడను హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) ఇటీవల కూల్చివేసింది. ఈ సంఘటన మల్లంపేట్ నుంచి బాచుపల్లి క్రాస్ రోడ్స్ ద్వారా ప్రగతి నగర్‌కు వెళ్ళే మార్గంలో జరిగింది. ఈ మార్గం సాధారణంగా 3 కిలోమీటర్ల దూరంలో ఉండగా.. ప్రణీత్ ఏపీఆర్ ప్రణవ్ అంటీలియా' అనే రియల్ ఎస్టేట్ సంస్థ నిర్మించిన గోడ కారణంగా ఈ దూరం 8 కిలోమీటర్లకు పెరిగింది. ఈ గోడ వల్ల చాలా రోజుల నుంచి పది కాలనీల నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. మల్లంపేట్ నివాసితులు హైడ్రాకు ఫిర్యాదు చేసి, ఈ గోడను తొలగిస్తే 40 నుంచి 60 అడుగుల వెడెల్పు గల రహదారి మళ్లీ ఉపయోగంలోకి వస్తుందని విన్నవించారు. హైడ్రా అధికారులు ఈ ఫిర్యాదును పరిశీలించి, హైదరాబాద్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్‌యూడీఏ) ఆమోదించిన లేఅవుట్ ప్రకారం ఈ ప్రాంతం గేటెడ్ కమ్యూనిటీ కాదని గుర్తించారు. హెచ్ఎండీఏ నిబంధన 7 ప్రకారం, రహదారులను అడ్డుకునేలా గోడలు నిర్మించకూడదని స్పష్టంగా ఉంది. దీంతో హైడ్రా ఈ గోడను కూల్చివేసి, రహదారిని పునరుద్ధరించింది. ఈ మూడు రోజులు జాగ్రత్త. దీని ఫలితంగా, బాచుపల్లి-మల్లంపేట్ కారిడార్‌లో ట్రాఫిక్ రద్దీ గణనీయంగా తగ్గింది. ముఖ్యంగా ఔటర్ రింగ్ రోడ్ వద్ద ఇటీవల తెరిచిన ఎగ్జిట్ వద్ద హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ ఈ చర్యను పర్యవేక్షించారు. కొందరు వ్యక్తులు తమ స్వప్రయోజనాల కోసం తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని హెచ్చరించారు. ఈ గోడను కూల్చివేయడం వల్ల దాదాపు 25,000 మందికి పైగా ప్రయోజనం చేకూర్చింది బుద్ధ భవన్‌లో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో హైడ్రాకు రోడ్లు, పార్కులు, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై 49 ఫిర్యాదులు అందాయి. గాజులరామారం, చెంగిచెర్ల, కొత్తగూడ వంటి ప్రాంతాల నుంచి కూడా ఇలాంటి ఫిర్యాదులు వచ్చాయి. హైడ్రాకు ఈ ఫిర్యాదులను పరిశీలించి, చట్టవిరుద్ధ నిర్మాణాలను తొలగించేందుకు చర్యలు చేపట్టింది. ఈ చర్యలు ప్రజల రాకపోకలను సులభతరం చేయడమే కాక, పటిష్టమైన పట్టణాభివృద్ధికి దోహదం చేస్తున్నాయి ట్రెండింగ్ లో బతుకమ్మ చెరువు...

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు, వచ్చిన తర్వాత తేడా స్పష్టంగా కనపడుతోందని అంటున్నారు నెటిజన్లు. దీనికి తాజా ఉదాహరణగా బతుకమ్మ కుంటను చూపిస్తున్నారు. ఇది కళ్లముందు కనపడుతున్న మార్పు అని అంటున్నారు. హైదరాబాద్‌లోని అంబర్‌పేట ప్రాంతంలో ఉన్న బతుకమ్మ కుంటను ఆక్రమణల చెరనుంచి కాపాడింది కాంగ్రెస్ ప్రభుత్వం. హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ అండ్ ప్రొటెక్షన్(హైడ్రా) సాధించిన విజయాల్లో ఇది కూడా ఒకటి. బతుకమ్మ కుంటను కబ్జా కోరల్లోనుంచి రక్షించేందుకు కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు హైడ్రాకు సంబంధిత పత్రాలు అందజేయడంతో తొలి అడుగు పడింది. హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్వయంగా ఈ కుంటను పరిశీలించి పునరుద్ధరణకు ఆదేశాలు జారీ చేశారు. కొంతమంది ఈ కుంట స్థలం తమది అంటూ హైకోర్టుని ఆశ్రయించినా తుది తీర్పు హైడ్రాకు అనుకూలంగా వచ్చింది. దీంతో నేడు ఇది కొత్తరూపు సంతరించుకుంది. కబ్జా కోరల్లో ఎలా ఉండేది. హైడ్రాకు ముందు బతుకమ్మ కుంట చెరువు సరస్సు పునరుద్ధరణ పనులను చేపట్టింది. మొదటి రెండు ఫోటోలు హైడ్రా సరస్సు పునరుద్ధరణ పనులను చేపట్టడానికి ముందు ఈ ఏడాది ఫిబ్రవరిలో తీసిన బతుకమ్మ కుంట చిత్రాలు అప్పుడు 20 ఎకరాలు.. దాదాపు 20 ఎకరాల పైబిలుకు విస్తీర్ణంలో బతుకమ్మ కుంటగా ఉండేది. క్రమంగా కబ్జాల బారిన పడి అసలు కుంటే కనుమరుగైపోయింది. ప్రస్తుతం ఇందులో కేవలం 6 ఎకరాలు మాత్రమే మిగిలుంది. దాన్ని కూడా కబ్జా చేయాలని చూశారు కొంతమంది. హైడ్రా చొరవతో దానికి బ్రేక్ పడింది. చెరువుని పునరుద్ధరించి అక్కడ పరిసరాల్ని పరిశుభ్రం చేశారు. దీంతో ఇప్పుడు బతుకమ్మ కుంట అందర్నీ ఆకట్టుకుంటోంది. గతంలో బతుకమ్మ కుంట ఎలా ఉంది, ఇప్పుడు ఎలా ఉంది.. అని పోలుస్తూ ఫొటోలను సోషల్ మీడియాలో అప్ లోడ్ చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డిని అభినందిస్తున్నారు. బతుకమ్మ కుంటను కాంగ్రెస్ ప్రభుత్వం పట్టించుకోకపోయి ఉంటే, ఈపాటికే అది పూర్తిగా కనుమరుగై పోయి ఉండేదని అంటున్నారు. అసలు బతుకమ్మ కుంట అనే జలవనరు కాలగర్భంలో కలిసిపోయేదని, అది ఒక ప్రాంతం పేరుగా మాత్రమే మిగిలిపోయేదని చెబుతున్నారు. హైదరాబాద్‌లోని బతుకమ్మ కుంట చెరువును పునరుద్ధరించిన హైడ్రా మరియు రేవంత్ రెడ్డి గార్లకు హృదయపూర్వక ధన్యవాదాలు! మీ కృషితో మా సంప్రదాయ సంబరం మళ్లీ జీవం పోసుకుంది. సీఎం రేవంత్ చొరవ.. తెలంగాణలో 9 ఏళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ఏనాడూ ఆక్రమణల తొలగింపుకి సిద్ధపడలేదు. పైగా బీఆర్ఎస్ నేతల ప్రోద్భలంతోనే కొన్నిచోట్ల ఆక్రమణలు జరిగాయనే ఆరోపణలున్నాయి. ఈ ఆక్రమణలతో హైదరాబాద్ నగరం ముంపుబారిన పడుతోంది. ఏ చిన్న వర్షం వచ్చినా నగరంలో నీరు నిలబడుతోంది. నాళాలు, కుంటలు ఆక్రమించడంతో వర్షపునీరు పోయే దారిలేక రోడ్లు మునిగిపోయేవి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సీఎం రేవంత్ రెడ్డి ఆక్రమణల తొలగింపుపై సీరియస్ గా దృష్టిపెట్టారు. విమర్శలు వస్తున్నా ఆయన ముందుకే వెళ్లడానికి నిర్ణయించారు. ఆ ఫలితాలు ఇప్పుడు కళ్లముందు కనపడుతున్నాయి. దీనితోపాటు మూసీ ప్రాజెక్ట్ కూడా పట్టాలెక్కితే హైదరాబాద్ రూపు రేఖలు సమూలంగా మారడం ఖాయం అంటున్నారు

# ప్రమాదాలకు నిలయంగా గుడిహత్నూర్ జాతీయ రహదారి

ఆదిలాబాద్, జూలై 9, (న్యూస్ పల్స్) ఆదిలాబాద్ జిల్లాలోని గుడిహత్నూర్ వద్ద జాతీయ రహదారి ప్రమాదాలకు నిలయంగా మారింది. అతివేగం.. నిబంధనలు పాటించకపోవడం.. తదితర కారణలేమైనా తరచూ గుడిహత్నూర్ వద్ద జాతీయ రహదారి 44తో పాటు ఇతర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. దీంతో రహదారులు నెత్తురోడుతుండగా, విలువైన ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి. బాధిత కుటుంబాల్లో విషాదం నింపుతున్నాయి. ప్రమాదాలు జరిగినప్పుడే పోలీసు, రవాణా శాఖాధికారులు హడావుడి చేసి మళ్లీ మరిచిపోతున్నారనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

జాతీయ రహదారి కొన్ని ప్రాంతాల్లో ఏటవాలుగా ఉండటం, లారీలు అతివేగంగా రావడం, న్యూట్రల్ చేయడంతో ఈ ప్రమాదాలు సంభవిస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. అలాగే లారీలను రోడ్డుకు ఇరువైపులా పార్కింగ్ చేస్తుండడంతో ప్రమాదాలకు కారణమవుతున్నాయి. వీటిని జాతీయ రహదారి అధికారులు పట్టించుకోకపోవడంతో ఈ ప్రమాదాల సంఖ్య పెరుగుతూనే ఉంది. జిల్లాలో బ్లాక్ స్పాట్లను గుర్తించినప్పటికీ రోడ్డు ప్రమాదాలు తరచూ జరుగుతూనే ఉన్నాయి. జిల్లాలోని భోరజ్ చెక్ పోస్టు, గుడిహత్నూర్ మండలంలోని మేకలగండి, సీతాగోంది, డోంగర్ గావ్, నేరడిగొండ, తదితర ప్రాంతాల్లో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇందులో ముఖ్యంగా గుడిహత్నూర్ మండలకేంద్రంలో ఎక్కువగా చోటు చేసుకుంటున్నాయి. ఇదే విషయంలో జాతీయ రహదారి గుండా ఉండే ప్రాంతాలు కుప్టి, బోథ్ ఎక్స్ రోడ్, ఉట్నూర్ ఎక్స్ రోడ్ ప్రాంతాలు సైతం ప్రమాదాలకు కేంద్రంగా మారుతున్నాయి.రవాణా శాఖ అధికారులు రోడ్డు భద్రత విషయం తమ పరిధిలోకి రాదని చెబుతుండటం, ఆర్.అండ్.బి. శాఖ వారే పర్యవేక్షిస్తున్నారని పేర్కొనడం.. ఆర్.అండ్.బీ శాఖ అధికారులు రోడ్డు భద్రత విషయంలో ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. అయితే జిల్లాలోని జాతీయ రహదారి 44 నేరడిగొండ నుంచి మహారాష్ట్ర సరిహద్దు వరకు ఫోర్ లేన్ హైవేపై నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో మితిమీరిన వేగంతో నడపడంతో చిన్న వాహనాలను ఢీకొడుతున్నాయి. ఎన్.హేచ్.ఎ.ఐ అధికారులు బ్లాక్ స్పాట్లు గుర్తించినా సరిచేయడం లేదు. సర్వీసు రోడ్లు, అక్కడక్కడా అండర్ పాస్ లు వంటివి నిర్మాణం చేపట్టకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు చెబుతున్నారు. లారీ, ఐచర్, తదితర భారీ వాహనాల డ్రైవర్లు గుడిహత్నూర్ ధాబా నుండి సీతాగొంది వరకు న్యూట్రల్ చేసి తీసుకెళ్లడంతో స్పీడ్ అదుపు చేయలేక ఇటీవలే ఎన్నో వాహనాలు అదుపుతప్పి ఇతర వాహనాలను ఢీకొని ప్రమాదాలు జరిగాయి.అసలు చాలామంది వాహనదారులు ప్రయాణం చేసేటప్పుడు నిబంధనలు పాటించడం లేదు. దీంతోనే తరచూ జాతీయ రహదారిపై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. గుడిహత్నూర్ బస్టాండు సమీపంలో రోడ్డుపైనే వాహనాలు నిలపడడం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం, రాంగ్ రూట్లో వాహనాలను తీసుకెళ్లడం, తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వడం, ఆటోలు, జీపులు, కార్లలో పరిమితికి మించి ప్రయాణికులను తరలించడం, ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించకపోవడం, తదితర కారణాలతో ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయి. వాహనదారులు భద్రత చర్యలు చేపట్టకపోవడంతో చాలామంది ప్రాణాలు కోల్పోతున్నారు. రవాణా శాఖాధికారులు తనిఖీలు నామమాత్రంగా చేపట్టడంతోనే వాహనదారులు నిబంధనలను పాటించడం లేదనే ప్రచారం కొనసాగుతోంది. దీంతోనే అధిక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రోడ్డు ప్రమాదాల్లో అనేకమంది మృత్యువాత పడ్డారు. మరికొందరు క్షతగాత్రులయ్యారు. గత 2022లో 234 ప్రమాదాలు జరగగా 137 మంది ప్రాణాలు కోల్పోయారు. 2023 లో 286 ప్రమాదాలు జరగగా 126 మంది ప్రాణాలు కోల్పోయారు. 2024లో 349 ప్రమాదాలు జరగగా 136 మంది ప్రాణాలు కోల్పోయారు. ప్రస్తుతం 2025 లో గత జూన్ నెల వరకు 137 ప్రమాదాలు జరగగా 51 మంది మరణించారు. 137 మంది క్షతగాత్రులయ్యారు. దీనిపై పోలీసులు జిల్లాలో 20 బ్లాక్ స్పాట్ లను గుర్తించారు.నేరడిగొండ మండలంలోని దూద్ గండి నుంచి బంధం ఎక్స్ రోడ్ వరకు, లఖంపూర్, రోల్ మామడ, నేరడిగొండ, ఇచ్చోడ మండలంలో రన్ని జిన్నింగ్ మిల్లు ప్రాంతంలో, ఆదిలాబాద్ వైపు వెళ్లే బైపాస్ వద్ద, గుడిహత్నూర్ మండలంలో మన్నూర్, మేకలగండి, ఈద్గా వద్ద, వాగాపూర్ ఎక్స్ రోడ్, సీతాగొంది, మావల మండలంలో దేవాపూర్ చెక్ పోస్టు, మావల బైపాస్, జైనథ్ మండలంలోని పూసాయి వద్ద జాతీయ రహదారిపై బ్లాక్ స్పాట్లను గుర్తించగా, ఇంద్రవెల్లిలోని ధనోర(బి), సమ్మక్క ఎక్స్ రోడ్, ఏమైకుంట, ఉట్నూర్ లోని పులిమడుగు, పెర్కగూడ, శ్యాంపూర్ లను గుర్తించారు. తరచూ ప్రమాదాలు జరిగే ప్రాంతాల్లో జిల్లా పోలీసులు సూచిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నారు. రోడ్లపై వాహనాలు పార్కింగ్ చేసే వారిపై కేసులు నమోదు చేసి, డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు నిర్వహిస్తున్నారు. తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలు ఇవ్వకుండా కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నారు.

గుడిహత్నూర్ జాతీయ రహదారి విషయంలో ప్రయాణికులు మాత్రం డోంగర్గావ్ సమీపంలోని సర్వీస్ రోడ్డుపనులు త్వరగా పూర్తి చేయాలని రోడ్డుపై ఉన్న బారీ కేడ్ల కారణంగా ప్రమాదాలు సంభవించే అవకాశాలు ఉన్నాయని, జాతీయ రహదారి సంబంధిత శాఖ అధికారులు త్వరగా సర్వీసు రోడ్డు పూర్తి చేయాలని కోరుతున్నారు. గుడిహత్నూర్ లో సర్వీసు రోడ్డు నిర్మాణానికి రెండేళ్ల క్రితం రూ.24 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ పనులు చేపట్టిన గుత్తేదారు ఏళ్లుగా పూర్తి చేయకపోవడంతో పరిస్థితి అగమ్యగోచరంగా మారిందిగుడిహత్నూర్ నుంచి ప్రభుత్వ జూనియర్ కళాశాల వరకు దాదాపుగా 500 మీటర్ల జాతీయ రహదారి మధ్యలో బారికేడ్లు ఏర్పాటు చేసి రెండు వైపులా ఒకే వరుసలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఈ క్రమంలో వేగంగా వచ్చే వాహనాలతో పాటు చిన్నపాటి వాహనాల దారులు భయాందోళనకు గురవుతున్నారు. గుడిహత్నూర్ మండలం పరిధిలో 15 కిలో మీటర్ల మేర తరచూ ప్రమాదాలు జరుగుతాయి. ఆరు నెలల్లో 12 పమాదాలు జరగ్గా నలుగురు మృతి చెందారు.

# సిగాచి పరిశ్రమ మరిన్ని కష్టాలు

హైదరాబాద్, జూలై 9, పాశమైలారంలోని సిగాచీ రసాయన పరిశ్రమలో ప్రమాదానికి యాజమాన్యం నిర్లక్ష్యమే కారణమని ప్రాధమిక విచారణలో తేలింది. నిన్న నేషనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ బృందం కూడా పరిశీలించి ఇదే రకమైన అనుమానాలను వ్యక్తం చేసింది. ఎన్ఎండీఏ బృందం పాశమైలారంలోని సిగాచీ పరిశ్రమను పరిశీలించిన అనంతరం ప్రమాదం జరిగిన స్థలంతో పాటు ఇంత మంది మరణానికి గల కారణాలను కూడా తెలుసుకునే ప్రయత్నం చేసింది. సిగాచీ పరిశ్రమ ప్రమాదంలో మొత్తం 44 మంది మరణించారు. ఇంత పెద్ద దుర్ఘటన ఫార్మా పరిశ్రమ చరిత్రలోనే లేకపోవడంతో షనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ బృందం కూడా రంగంలోకి దిగింది. రసాయన పరిశ్రమలను ఎలా నిర్వహణ చేస్తున్నారో అక్కడ పనిచేసిన అధికారులను అడిగి తెలుసుకుంది. వారిని ప్రశ్నలతో ఉక్కిరి బిక్కిరి చేసింది. ఇప్పటికే మరణించిన కార్మికుల కుటుంబాలు పాత కాలం మిషనరీని వాడుతున్నారని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయడంతో ఆ దిశగా కూడా విచారణ చేపట్టింది. రసాయన పరిశ్రమల్లో ఎప్పటి కప్పుడు యంత్ర సామగ్రిని ఆధునికీకరించాల్సిన అవసరం ఉన్నప్పటికీ యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తూ ఇంత పెద్ద ప్రమాదానికి కారణమయిందని ప్రాధమికంగా అభిప్రాయపడినట్లు తెలిసింది. ప్రమాదానికి రియాక్టర్ పేలడమే కారణమని తొలుత భావించినా మరేదైనా కారణం ఉందా? అన్న కోణంలో కూడా షనల్ డిజాస్టర్ మేనేజ్ మెంట్ అథారిటీ బృందం దర్యాప్తు చేసింది. అధికారులను విచారించిన మీదట సిగాచీ పరిశ్రమ యాజమాన్యం నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు నిర్ధారించినట్లు .అధికారులు కూడా సక్రమంగా సమాధానాలు ఇవ్వకపోవడంతో వారికి ఉన్న అవగాహనపై కూడా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు దోహదపడుతున్నాయి : ఏసీపీ నరేష్ రెడ్డి



**కూకట్పల్లి (ప్రజబలం) జులై 09 :**బాలానగర్ పోలీస్ స్టేషన్ పరధిలోని రంగారెడ్డి నగర్ హనుమాన్ దేవాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన 8 సీసీకెమెరాలను బుధవారం బాలానగర్ ఏసీపీ నరేష్ రెడ్డి, సీఐ నర్సింహా రాజు తోకలసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఏసీపీ మాట్లాడుతూ ప్రజల రక్షణ, భద్రత కోసం పోలీసుశాఖ తీసుకుంటున్న వివిధ రకాల చర్యలపై అవగాహన కల్పిస్తుండటం వల్లనే అన్నివర్గాల ప్రజలు ముందుకువచ్చి స్వచ్ఛందంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటున్నారని అన్నారు.

సీసీకెమెరాల ఏర్పాటుకు సహకరించిన పలువురిని ఈ సందర్భంగా ఏసీపీ అభినందించారు.

అనంతరం బాలానగర్ సీఐ నర్సింహా రాజు మాట్లాడుతూ శాంతి భద్రతల పర్యవేక్షణకు, నేరాలను అదుపు చేసేందుకు సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజలు, వ్యాపారస్తులు, ప్రజాప్రతినిధులు స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. సీసీ కెమెరాల వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని, ఏ చిన్న సంఘటన జరిగినా వెంటనే తెలుసుకోవచ్చున్నారు.

బోనాల పండుగ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా బాలానగర్ పోలీసులు ముందస్తు చర్యలు చేపడుతున్నమన్నారు. ఆలయ కమిటీ సభ్యులకు, స్థానికులకు, భక్తులకు, నిర్వాహకులకు పలు కీలక సూచనలు చేశారు, ఇందులో భాగంగా స్థానికులు పోలీసులకు మద్దతుగా ఉంటూ రాబోయే బోనాల పండుగను శాంతియుత వాతావరణంలో జరిగే విధంగా చూడాలని, శాంతి భద్రతలను పరిరక్షించడానికి బాలానగర్ ఖ్యాతిని కాపాడేందుకు ఉత్సవ కమిటీ సభ్యుల, నిర్వాహకులు అవిశ్రాంత కృషిని కొనసాగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు సరితా రెడ్డి, సరళ, వినోద్ కుమార్, ఆలయ కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు.

## అమ్మ అమృతమ్మ త్యాగాలను వెల కట్టలేము –అమృతమ్మ సంతాప సభలో విప్లవ కవి అల్లం రాజయ్య



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూలై 9** అమ్మ భావన విశ్వజనీణమైనదని విరసం సభ్యుడు, ప్రముఖ విప్లవ రచయిత అల్లం రాజయ్య అన్నారు. బుధవారం మందమర్రి మండలం మామిడి గట్టులో దేహదానం చేసిన మండల అమృతమ్మ సంతాప సభలో ఆయన ప్రసంగించారు. ఈ సభను సదాశయ ఫౌండషన్ ఆధ్వర్యంలో లో నిర్వహించారు. విప్లవోద్యమం విస్తరించిన తెలంగాణాలో అమృతమ్మ వంటి తల్లులు ఆ కాలంలో నిర్భంధాన్ని, భయాన్ని అనుభవిస్తూ త్యాగాలు చేశారనీ అన్నారు. ఇటువంటి విప్లవ మూర్థుల త్యాగాన్ని అర్ధం చేసుకోవడం తెలంగాణ సమాజం ముందున్న కర్తవ్యమని అన్నారు.అమృతమ్మ తన కళ్ళను దానం చేసి ఇతరులకు చూపునిచ్చిందన్నారు.

తన దేహాన్ని దానం చేసి మార్గదర్శకంగా నిలిచిందన్నారు. బిజెపి క్రమశిక్షణ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గోనె శ్యాంసుందర్ రావు మాట్లాడుతూ శ్యామ్ సుందర్ తన తల్లి నేత్రాలు దేహం దానం చేయడం అభినందనీయమని వారి కుటుంబ సభ్యులను అభినందించారు. ఈ సభలో సదాశయ ఫౌండషన్ జాతీయ కార్యదర్శి లింగమూర్తి, రచయిత గురిజాల రవీందర్ రావు, మావోయిస్టు పార్టీ మాజీ కేంద్ర కమిటీ సభ్యులు బశాత్వాజీ, పౌర హక్కుల సంఘం నేత మాదన కుమారస్వామి బి.ఆర్.ఎస్, కాంగ్రెస్ నేతలు పలువురు పాల్గొన్నారు.

# 15 కిలోల గజాయి పట్టివేత

### సుమారు 3 లక్షల 50 వేల రూపాయల ఉంటుంది అని అంచనా

### నలుగురు వ్యక్తులను అరెస్టు రిమాండ్ కు తరలింపు

### హుజురాబాద్ ఏసిపి మాధవి




**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జూలై 9**జమ్మికుంట పట్టణంలోని ఎఫ్ సి ఐ గోదాం వద్దా జమ్మికుంట పట్టణ సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో మంగళవారం తనిఖీలు నిర్వహించడం జరిగింది, 15 కిలోల గంజాయి,టాస్క్ ఫోర్స్ సహకారం తో కరీంనగర్ కి చెందిన ఆఫ్రిద్, శశి ప్రీతం, తరుణ్, ప్రేమ్ చంద్ కుమార్ అను, వ్యక్తులు గంజాయి రవాణా చేస్తుండగా మంగళవారం నాడు పట్టుకోవడం జరిగింది.ఈ సందర్భంగా హుజురాబాద్ ఏసిపి మాధవి మాట్లాడుతూ ముందస్తు సమాచారం మేరకు టాస్క్ ఫోర్స్ పోలీస్ సహకారంతో జమ్మికుంట పట్టణంలోని ఎఫ్ సి ఐ గోదాం పరిధిలో రెండు ద్విచక్ర వాహనాలపై వెళు న్న అనుమానస్పద వ్యక్తులను పట్టుకొగా వారి దగ్గర 15 కిలోల గంజాయి దొరకడం జరిగింది అని అన్నారు. వీరు కరీంనగర్ చెందిన వారీగా గుర్తించమన్నారు. వీరు ఒక్క ముఠా గా ఏర్పాడి ఆంధ్రప్రదేశ్– ఒరిస్సా సరిహద్దుల్లో తక్కువ ధరకు కొనుగోలు చేసి జమ్మికుంట పరిసర ప్రాంతాలలో ఎక్కువ రేటుకు అమ్ముకోవచ్చు అని ఈజీ మనీ సంపాదించాలి అనే ఉద్దేశంతో వారు గంజాయి సరఫరా చేస్తున్నామని తెలిపారు. 5 ప్యాకెట్ల గంజాయి దొరకగా, 15 కిలోల వరకు ఉందని తెలిపారు. సుమారు, 3 లక్షల 50 వేల రూపాయల ఉంటుంది అని అన్నారు. గత 6 నెలల క్రితం నుండి వీరు ఇదే పనిగా చేస్తున్నారన్నారు. .గతంలో కూడా వీరిలో ఒక్కరి పై క్రిమినల్ కేసులు ఉన్నాయని కరీంనగర్ 2 టౌన్ మరియు 3 టౌన్ లో ఒక మర్డర్ కేసు కూడా ఉంది అని తెలిపారు. ఈ మత్తు పదార్థాలు గ్రామాల్లోకి రావడం జరిగింది అని, స్కూల్ విద్యార్థులు, యువత నే వీరి టార్గెట్ అని తెలిపారు. టెస్టింగ్ కిట్స్ కూడా అందుబాటులోకి వచ్చాయి అని, బ్లడ్ శాంపిల్ తీసుకుని టెస్ట్ కూడా చేయడం జరుగుతుంది అని అన్నారు. రెండు ద్విచక్ర వాహనాలు పల్సర్ మరియు సెల్ ఫోన్లు సీజ్ చేయడం జరిగింది అని వివరించారు. ఇలాంటి అసంఘిక కార్యకలాపాలకు ఎవరైనా పాల్పడితే సమాచారం ఇచ్చే బాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉంది అని ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎ సి పి మాధవి తోపాటు జమ్మికుంట పట్టణ సిఐ రామకృష్ణ, ఎస్సై సతీష్, కానిస్టేబుల్స్ అబ్దుల్ ఖదీర్, జలంధర్ సిబ్బంది పాల్గొన్నారు.

# విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి. మంత్రి ధనసరి అనసూయ సీతక్క.



**ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం) జూన్ 9 :** విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.

బుధవారం ములుగు జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇన్ఫోసిస్ సంస్థ చే ఏర్పాటు చేసిన కంప్యూటర్ల ల్యాబ్ ను రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవి చందర్ లతో కలసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటినుండే ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని వాటి సాధన దిశగా ముందుకు సాగాలని అన్నారు.



తాను కూడా ప్రాథమిక, ఉన్నత విద్య జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల ములుగు యందు చదువుకున్నానని ఆ రోజుల్లో ఎస్టీ హాస్టల్ యందు ఉండి, పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చేవారని చదువుపై ఉన్న ఆసక్తితో తాను పి హెచ్ డి పూర్తి చేశానని, ఉన్నత లక్ష్యాలను సాధించడానికి పేదరికం అడ్డు కాదని విద్యార్థులు గుర్తించాలని అన్నారు.

అత్యంత పేద కుటుంబం నుండి వచ్చిన తాను ఎన్నో ఆటంకాలను ఎదుర్కొని ఉన్నత విద్యను అభ్యసించానని రాజకీయ రంగంలో రాణిస్తున్నా నంటే తను అభ్యసించిన చదువు ఉన్నత విద్యా తనకు ఎంతగానో ఉపయోగపడిందని అన్నారు.

చదువుకున్న పాఠశాలకు ఎంతో కొంత సహాయం చేయాలని ఉద్దేశంతో ఇన్ఫోసిస్ సంస్థ ద్వారా 10 కంప్యూటర్లను అందజేయడం జరిగిందని విద్యార్థులు పాఠశాల స్థాయి నుండే సాంకేతిక విద్యను పెంపొందించుకొని ఉత్తమ లక్ష్యం దిశగా ముందుకు సాగాలని మంత్రి తెలిపారు.అనంతరం పాఠశాలలో ఆరు లక్షల నిధులతో మూడు టాయిలెట్ బ్లాకుల నిర్మాణ పనులను మంత్రి సీతక్క, కలెక్టర్ తో కలసి శంకుస్థాపన చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి చంద్రకళ, సెక్టోరల్ అధికారులు అర్షం రాజు, గ్యాదరి రమాదేవి, గుల్లపల్లి సాంబయ్య, డి ఎస్ ఓ జయదేవ్, మండల విద్యాశాఖ అధికారి వజ్జ తిరుపతి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఝాన్సీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గురుకుల విద్యా ప్రమాణాలు విద్యార్థుల వసతులపై మేడ్చల్ అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



**ప్రజాబలం ప్రతినిధి మేడ్చల్–మల్కాజ్‌గిరి జిల్లా జూలై 9:**గురుకులాల లక్ష్యం సామాన్యుల పిల్లలకు ఉత్తమ విద్యను అందించడమే కాకుండా ప్రభుత్వం అందిస్తున్న వసతులను విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా చూడడం అధికారుల బాధ్యత అని మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టరు రాధికగుప్తా అన్నారు.

బుధవారం శామీర్ పేట మండలంలోని మహాత్మా జ్యోతిబా పూలే రెసిడెన్షియల్ పాఠశాల మరియు కళాశాలలో జిల్లా అదనపు కలెక్టరు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ విద్యార్థుల వసతులు, ఆహార నాణ్యత, పరిశు భ్రత , విద్య బోధన వంటి ముఖ్య అంశాలపై సమగ్రంగా పరిశీలించారు. కష్టపడి చదివి మంచి మార్కులు సాధించాలని, విద్యతోనే భవిష్యత్తు బాగుంటుందని తెలిపారు. స్కూల్లో వసతులు ఎలా ఉన్నాయని, భోజనం ఎలా ఉంటుందని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెను ప్రకారం విద్యార్థులకు భోజనం అందిస్తున్నారా అని అడిగి తెలుసుకొని, మెను చార్టును పరిశీలించారు. ఈరోజు మెనులో ఏమి వండారని అడిగి, వంటలను పరిశీలించారు. స్కూలు కాలేజీ కలిపి మొత్తం ఎంత మంది విద్యార్థులున్నారని ఇంటర్ లో ఏఏ గ్రూపులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. స్టోర్ రూం లోని వంట సామాగ్రిని పరిశీలించి, నాణ్యమైన , ఎక్స్పైరీ డేట్ చెక్ చేస్తూ సామాగ్రిని వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థులకు సులువుగా అర్థమయ్యేందుకు అవసరమైన బోధన ఉపకరణాలను ఉపయోగించి విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఆరోగ్యపరంగా విద్యార్థులపై తగిన శ్రద్ధ తీసుకోవాలని అదనపు కలెక్టర్ సూచించారు. అందరికీ పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలు అందాయా అని, గురుకుల పాఠశాలల్లో ఎదుర్కొంటున్న సమస్యలు అవసరాలపై విద్యార్థుల అభిప్రాయాలను అదనపు కలెక్టరు రాధికగుప్తా అడిగి తెలుసుకున్నారు.

గురుకుల ప్రాంగణం శుభ్రంగా ఉండేలా చూడాలని, వైద్య సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను విద్యార్థులకు పూర్తిస్థాయిలో అందేలా చూడడం అధికారుల బాధ్యత అని అన్నారు. గురుకులాల లక్ష్యం సామాన్యుల పిల్లలకు ఉత్తమ విద్యను అందించడమేనని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం శామీర్ పేట్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను కూడా సందర్శించారు.

ఈ కార్యక్రమంలో అదనపపు కలెక్టర్ వెంట జిల్లా విద్యాశాఖాధికారి విజయ కుమారి, జిల్లా బిసి సంక్షేమ శాఖాధికారి ఝాన్సీరాణి, జిల్లా ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి వినోద్ కుమార్, గురుకుల ప్రిన్సిపాల్ , ఉపాధ్యాయులు, అధికారులు ఉన్నారు.

## సమ్మెతో సింగరేణి 76 కోట్ల నష్టం

కరీంనగర్, జూలై 9, కరీంనగర్ లో సింగరేణి కార్మికులు సమ్మెకు పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా ఒకరోజు టోకెన్ సమ్మె చేపట్టనున్నారు. కేంద్ర ప్రభుత్వం విధానాలకు వ్యతిరేకంగా కార్మిక సంఘాలు ఈ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఈ సమ్మె కారణంగా సింగరేణిలో బొగ్గు ఉత్పత్తికి బ్రేక్ పడనుంది. ఒక్కరోజు సమ్మెతో దాదాపు 76 కోట్ల రూపాయల విలువ చేసే బొగ్గు ఉత్పత్తికి నష్టం కలగనుంది.కేంద్ర ప్రభుత్వం విధానాలను వ్యతిరేకిస్తూ దేశవ్యాప్తంగా కార్మిక సంఘాలన్నీ ఒక్కరోజు టోకెన్ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఇందులో భాగంగా సింగరేణిలోనూ సమ్మెకు పిలుపునిచ్చాయి. ఇప్పటికే కార్మిక సంఘాలన్నీ సింగరేణిలో సమావేశం నిర్వహించారు. ఒక్కరోజు సమ్మె విజయవంతం కోసం కార్మిక సంఘాలన్నీ గేట్ మీటింగ్ నిర్వహించాయి. విస్తృతంగా ప్రచారం చేశాయిమార్చి 20న సమ్మె చేయాలని అనుకున్నా.. యుద్ధం కారణంగా ఈ సమ్మె వాయిదా పడింది. గేట్ మీటింగ్ ల ద్వారా కార్మిక సంఘాలన్నీ విస్తృతంగా ప్రచారం చేశాయి. ఒక్కరోజు సమ్మెతో సింగరేణిపై పెనుభారం పడనుంది. దీంతో సమ్మెకు వెళ్లొద్దని సింగరేణి యాజమాన్యం కోరుతోంది. కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సమ్మెకు వెళ్తామని కార్మిక సంఘాలు చెబుతున్నాయి.సింగరేణి వ్యాప్తంగా ఉన్న ఐదు జాతీయ సంఘాల్లో నాలుగు ఒమిజఅ, ఎఔజఅ, అమిజఅ, ఊఓూ.. సమ్మెకు మద్దతు తెలిపాయి. బీజేపీ అనుబంధ సంఘం ః఼ఓూ మాత్రం సమ్మెకు దూరంగా ఉంది. బీఆర్ఎస్ కు అనుబంధంగా ఉన్న తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కూడా సమ్మెకు మద్దతు తెలిపింది. విప్లవ కార్మిక సంఘాలు సైతం సింగరేణి సమ్మెకు మద్దతు ప్రకటించాయి. కార్మికుల హక్కులు రక్షించుకోవాలంటే సమ్మెలో కచ్చితంగా పాల్గొనాలని కార్మిక సంఘాలు విస్తృతంగా ప్రచారం చేస్తున్నాయి. రేపటి సమ్మెను విజయవంతం చేసే దిశగా కార్మిక సంఘాలన్నీ ఐక్యంగా, ముమ్మరంగా ప్రచారం చేశాయి.సమ్మె చేస్తే సింగరేణిపై పెను భారం పడే అవకాశం ఉంది. ఒక్కరోజు సమ్మెతో దాదాపు 76 కోట్ల రూపాయల విలువైన బొగ్గు ఉత్పత్తికి నష్టం జరుగుతోంది. సమ్మెలో పాల్గొనే కార్మికవర్గానికి కూడా వేతన రూపంలో కొంత నష్టం జరుగుతుంది. దాదాపు 13 కోట్లు నష్టపోవాల్సి వస్తుంది. ఒక్కరోజు సమ్మెతో 1.92 లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం ఏర్పడుతుంది. ఈ రకంగా సింగరేణిపై పెను భారం పడుతుంది కాబట్టి.. ఎట్టి పరిస్థితుల్లో కార్మిక వర్గం సమ్మెలో పాల్గొనకుండా యాజమాన్యానికి సహకరించాలని, ఉత్పత్తిపై ఫోకస్ చేయాలని సింగరేణి యాజమాన్యం చెబుతున్నా.. కార్మిక సంఘాలు మాత్రం ససేమిరా అంటున్నాయి.

## ప్రభుత్వ పాఠశాలల్లో సమగ్ర విద్య కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం.

## కేజీబీవీ బాలికల పాఠశాలను( మైనారిటీ)ఆకస్మిక తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 09(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా:జహీరాబాద్ మండలం లోని హెూతి కే.గ్రామంలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలను మైనారిటీ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు,ఉపాధ్యాయుల హాజరు పట్టికను పరిశీలించారు,అనంతరం క్లాస్ రూములను పరిశీలించిన కల్లెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు ,పాఠ్య పుస్తకాలు ,ఏకరూప దుస్తులు అందరికి అందాయా అని అడిగి తెలుసుకున్నారు,విద్యార్థుల్లో ఆసక్తి పెంచేందుకు నూతన శైలి బోధనా పద్ధతులు పాటించాలంటూ ఉపాధ్యాయులకు సూచనలు ఇచ్చారు ముఖ్యంగా గణిత శాస్త్రం, సైన్స్, ఇంగ్లీష్ వంటి ముఖ్యమైన సబ్జెక్టుల్లో పిల్లలకు ఆత్మవిశ్వాసం పెంపొందించేలా బోధన జరగాలనిఅన్నారు,పాఠశాలలో విద్యార్థులకు అందుతున్న వసతులు,భోజన సదుపాయాలపై కలెక్టర్ పరిశీలించారు.వంటగదిని తనిఖీ చేసి,అక్కడ శుభ్రత పరిస్థితులు, భోజన పదార్థాల నాణ్యతను పరిశీలించారు,ప్రత్యేకంగా మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలసి భోజనం చేశారు,భోజన రుచి, నాణ్యత,వంటి అంశాలను ప్రత్యక్షంగా పరిశీలించారు కలెక్టర్, విద్యార్థులతో ఆత్మీయంగా మాట్లాడారు.రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలకు అనుగుణంగా మెను ప్రకారం భోజనం అందించాలిని ఆదేశించారు, స్టోర్ రూమ్‌ను పరిశీలించిన కలెక్టర్ నిత్యవసర సామాగ్రి నిల్వలు,నిల్వ విధానాలపై అధికారుల పలు సూచనలు చేశారు,అన్నివస్తువులు సక్రమంగా నిల్వ చేయాలనీ,ఉపయోగించిన పదార్థాలపై స్పష్టమైన రికార్డులు ఉండాలన్నారు,ఉపాధ్యాయులు మరింత బాధ్యతగా వ్యవహరించాలని ఆదేశించారు,ఈకార్యక్రమంలో ఆర్ డి ఓ రాంరెడ్డి ,తహసీల్దార్ దశరథ్ ,పాఠశాల ఉపాధ్యాయులు ,సిబ్బంది పాల్గొన్నారు.



## సింగరేణి బొగ్గు గనుల్లో దేశవ్యాప్త సమ్మె విజయవంతం



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూలై 9** కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా దేశవ్యాప్తంగా చేపట్టిన సార్వత్రిక సమ్మె మందమర్రి ఏరియా బొగ్గు గనుల్లో కార్మికులందరూ సమ్మెలో పాల్గొని జయప్రదం చేసారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ, ఐఎన్టియుసి, సిఐటియు, ఐఎఫ్టియు టీబీజీ కేఎస్ సంఘాల నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మికుల కర్షకుల హక్కులను కాలరాస్తు చేసిన నాలుగు చట్టాలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికుల విధుల సమయాన్ని 8 గంటల నుండి 10 గంటలకు పెంచడానికి నిరసిస్తూ బుధవారం దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెకు పిలుపునిచ్చిన సందర్భంగా మద్దతు తెలిపి సమ్మెలో పాల్గొన్న కార్మికులందరికీ ధన్యవాదాలు తెలిపారు. సింగరేణి కార్మికుల హక్కులను కాలరాసే విధంగా కేంద్రా రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు తేవడం జరిగిందని హక్కులను కాపాడుకునేందుకు కార్మికులందరూ సమ్మెలో పాల్గొన్నందుకు వారికి సంఘాల తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నామని అన్నారు. ఈ సమ్మెను విఫలం చేసేందుకు యాజమాన్యం ప్రయత్నించినప్పటికీ కార్మికుల స్వచ్ఛందంగా పాల్గొని దేశవ్యాప్త సమ్మెకు మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. కార్యక్రమంలో ఐఎన్టీయూసీ ఏఐటియుసి సిఐటియు ఐఎఫ్టియు టీబీజేకేఎస్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.




## ఉద్యాన,వాణిజ్య పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలి

## కమిషనర్ ఆఫ్ హార్టికల్చర్,జిల్లా ప్రత్యేక అధికారి అజ్మీర ప్రేమ్ సింగ్




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 09** :జిల్లాలో ఉద్యాన,వాణిజ్య పంటల సాగు దిశగా రైతులను ప్రోత్సహించాలని కమిషనర్ ఆఫ్ హార్టికల్చర్, జిల్లా ప్రత్యేక అధికారి అజ్మీర ప్రేమ్ సింగ్ అన్నారు. బుధవారం జిల్లా ఉద్యానవన,పట్టు పరిశ్రమ శాఖ అధికారి కె అనిత, ఇతర అధికారులతో కలిసి జిల్లాలోని చెన్నూర్ మండలం ఎల్లక్కపేట గ్రామంలోని టస్సార్ ఫామ్,, బేసిక్ సీడ్ మల్టిప్లికేషన్ అండ్ ట్రైనింగ్ సెంటర్, చెన్నూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆయిల్ ఫామ్ గెలల సేకరణ కేంద్రం, భీమారం మండల కేంద్రంలోని మ్యాట్రిక్స్ ఆయిల్ ఫాం నర్సరీ లను సందర్శించారు.ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ హార్టికల్చర్ మాట్లాడుతూ... ఉద్యాన,వాణిజ్య పంటలను సాగు చేసేలా, సాగు విధివిధానాలపై రైతులకు అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రభుత్వం రైతుల కొరకు అందించే పథకాలను రైతులు పూర్తి స్థాయిలో వినియోగించుకునే విధంగా వివరాలు తెలియచేయాలని,నాణ్యత గల ఆయిల్ ఫామ్ మొక్కలను రైతులకు అందించాలని తెలిపారు. ఆయిల్ ఫామ్ పంట సాగు రైతులకు ఎంతో లాభదాయకమని,జిల్లాలో సాగు విస్తీర్ణాన్ని పెంపొందించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. నస్పూర్ మండలం సీతారాంపల్లి గ్రామంలో సోమిశెట్టి రామయ్య అనే రైతు తనకు ఉన్న భూమిలో మల్చింగ్ పద్ధతిలో సాగు చేస్తున్న డ్రాగన్ ఫ్రూట్, సొరకాయ, టమాటో ఇతర కూరగాయల రకాల సాగు, ఆయిల్ ఫామ్ సాగును పరిశీలించారు.ఈ సందర్భంగా రైతు తాను సాగు చేస్తున్న పంటల వివరాలు అధికారులకు తెలియజేశారు. కూరగాయల సాగుకు 50 శాతం రాయితీ,శాశ్వత పందిరి,మల్చింగ్ సాగుకు 50 శాతం రాయితీ,బిందు సేద్యం పరికరాలపై 90 రాయితీ లభించిందని, తన పంట సాగుకు ఎంతో ఉపయోగపడిందని తెలిపారు.అనంతరం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని జిల్లా ఉద్యాన,పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ ఆఫ్ హార్టికల్చర్ మాట్లాడుతూ...అధికారులు సమన్వయంతో పనిచేసి జిల్లాలో ఉద్యాన,వాణిజ్య పంటల సాగు విస్తీర్ణాన్ని పెంపొందించాలని తెలిపారు.ఉద్యాన శాఖ పథకాల లక్ష్యాలను పూర్తిగా సాధించాలని, పంట సాగులో రైతులకు అవసరమైన మెలకువలను అందించాలని తెలిపారు.

ఈ కార్యక్రమాలలో పట్టు పరిశ్రమ అధికారి పార్వతి, అధికారులు రావుల తిరుపతి,అరుణ్, సహజ, కళ్యాణి,అర్చన,శాస్త్రవేత్త కిరణ్ కుమార్,మ్యాట్రిక్స్ సంస్థ ప్రతినిధి, బిందు సేద్యం కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## నిమ్జ్ భూసేకరణ వేగవంతం చేయాలి...

## జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య.



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 09(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా:జహీరాబాద్‌లో ఏర్పాటవుతున్న నిమ్జ్ కి సంబంధించి భూ సేకరణ ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులను ఆదేశించారు,బుధవారం జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో నిమ్జ్ ప్రత్యేక అధికారి రాజు,ఆర్డీవో రామిరెడ్డి,రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారుఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ నిమ్జ్ ప్రాజెక్టు ఫేస్-1కు అవసరమైన భూమి సేకరించాల్సి ఉందని దాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని స్పష్టం చేశారు,ఫేస్ వన్ లో మొత్తం 3,240 ఎకరాల భూమి అవసరం కాగా,ఇప్పటివరకు 2,888 ఎకరాల భూమి మాత్రమే స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. మిగిలిన భూసేకరణ ఇంకా పూర్తికాలేదని, సంబంధిత గ్రామాల రైతులు,భూమి యజమానులతో సన్నిహితంగా చర్చించి సమస్యలను పరిష్కరించి భూసేకరణను తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు,నిమ్జ్ ద్వారా పరిశ్రమలు, ఉద్యోగాలు, స్వయం ఉపాధి అవకాశాలు కలుగుతాయని పేర్కొన్నారు,భూముల విషయంలో పారదర్శకంగా వ్యవహరించాలన్నారు.

## నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని జూలై 9న దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం

### -సుందరయ్య పార్క్ నుంచి ఇంద్ర పార్క్ వరకు ర్యాలీలో పాల్గొన్న.. రవి సింగ్



**కూకట్పల్లి (ప్రజబలం) జులై 09** :కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న కొత్త నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని ఈరోజు దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను కార్మికులంతా కలిసి విజయవంతం చేశారు.ఈ కార్యక్రమంలో బిఆర్ టియు కార్మిక నాయకుడు శ్రమశక్తి అవార్డు గ్రహీత రవి మాట్లాడుతూ, సుందరయ్య పార్క్ నుంచి భారీ ఎత్తున అన్ని యూనియన్ నాయకులు కార్మికులు, మహిళలు, అధిక సంఖ్యలో పాల్గొని ఇంద్ర పార్క్ వరకు ర్యాలీలో పాల్గొన్నారు.కార్మికులకు ఎలాంటి నష్టం జరిగిన సహించేది లేదని నిత్యం కార్మికులకు కావలసిన అన్ని వసతులు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం కార్మికులను మోసం చేయడానికి కొత్త కోడ్లను తీసుకొస్తుందని వెంటనే కేంద్రం స్పందించి నాలుగు లేబర్ కోడ్లను రద్దు చేయాలని లేనిపక్షంలో కార్మికుల మంత్ర కలిసి ఢిల్లీలో జంతర్మంతర్ దగ్గర ధర్నా చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో కార్మిక సంఘాలు, జీడిమెట్ల కస్టర్ కమిటీ, అనిల్, సుదర్శన్, జగన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ శాఖ ఉద్యోగులుసమ్మెకు మద్దతుగా ధర్నా




**ఖమ్మం ప్రతినిధి జులై 9 ప్రజాబలం** ఖమ్మం జాతీయ విద్యుత్తు సంఘాలు నేషనల్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ మరియు ఇంజనీర్స్ కో ఆర్డినేషన్ కమిటీ పిలుపుమేరకు ఖమ్మం టిఎస్ పి ఈ జాక్ ఆధ్వర్యంలో స్థానిక ఎస్ ఈ ఎస్సీ కార్యాలయం నందు ధర్నా నిర్వహించినారు జిల్లా వ్యాప్తంగా ఓఎం సిబ్బంది టూల్ డౌన్ పెన్ డౌన్ చేయడం జరిగింది కేంద్ర ప్రభుత్వ విద్యుత్తు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఎస్సీ కార్యాలయం ఎదుట ధర్నా చేయడం జరిగింది . ఈ సందర్భంగా ఎస్ ఈ శ్రీనివాస్ చారి కి ప్రైవేటీకరణ వ్యతిరేకంగా వినతి పత్రం ఇవ్వడం జరిగినది ఈ కార్యక్రమంలో జేఏసీ చైర్మన్ శ్రీ టి . శేషగిరి మాట్లాడుతూ విద్యుత్ ప్రైవేట్ కీ కరణ వ్యతిరేకించాలని కేంద్ర కార్యవర్గం ఇచ్చిన పిలుపులు తప్పకుండా పాటించాలని, ఎప్పుడైనా సమ్మె కు వెళ్లడానికి సిద్ధంగా ఉండవలసినదిగా తెలియజేసినారు







.మరియు విద్యుత్ ప్రైవేట్ ఆపాలని ప్రజలకు కార్మికులకు రైతులకు ఇబ్బందిగా మారిన ప్రైవేటీకరణను, ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉన్న లేబర్ కో డ్ లను వ్యతిరేకించే క్రమంలో ఈరోజు పెద్ద ఎత్తున ఈ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో కో చైర్మన్ ఏ .రవికుమార్ కన్వీనర్ జి నాగమల్లేశ్వరరావు జాయింట్ సెక్రటరీ, కె. నాగేశ్వరరావు, ఎం ప్రసాద్ బి రామకృష్ణ , ఏ మధుసూదన్ రావు ,ఆర్ సత్యనారాయణ సురేష్, నాగేంద్ర కుమార్ చంద్రకళ మానస ఉష ,రజిని, సుధాకర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు

## స్టేజి వద్ద బస్సులు ఆపకపోవడంతో రోడ్డెక్కిన కాంగ్రెస్ శ్రేణులు.

### పోలీసుల హామీతో ధర్నా విరమణ.



రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, బోయినపల్లి, ( ప్రజాబలం ), రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినపల్లి మండలం కుదురుపాక గ్రామం, సిరిసిల్ల, వేములవాడ–కరీంనగర్ ప్రధాన రహదారిపై ఉంది. బోయినపల్లి బస్సు స్టేజి వద్ద ఆర్టీసీ బస్సులు ఆపకపోవడం వల్ల నిత్యం వేలాది మంది ప్రయాణికులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. దీనితో గ్రామస్తులు ఆవేదన తారస్థాయికి చేరింది. బోయినపల్లి మండలానికి చెందిన ముంపు గ్రామాలైన కొదురుపాక మరియు నీలోజి పల్లి గ్రామాలు కరీంనగర్ మరియు రాజన్న సిరిసిల్ల, వేములవాడ వెళ్లే ఆర్టీసీ బస్సులు ఎప్పటికప్పుడు పోతున్నప్పటికీ, ఈ గ్రామాలలో బస్సులు ఆగకపోవడం ప్రజలకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తుంది. ప్రతిరోజు వేలాది మంది ప్రజలు వ్యాపార నిమిత్తం, స్కూలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ఉద్యోగులు ఆర్టిసి బస్సు రవాణా సౌకర్యం సరిగ్గా లేక తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. స్థానిక ప్రజలు, గ్రామ కాంగ్రెస్ నాయకులు గత కొంతకాలంగా అధికారులను, ప్రజా ప్రతినిధులను పరులు మార్లు వినతులు చేసిన, ఎలాంటి పరిష్కారము రాకపోవడంతో ఆక్రోషం వ్యక్తం చేస్తూ బుధవారం రోజున సిరిసిల్ల, వేములవాడ,– కరీంనగర్ ప్రధాన రహదారిపై ధర్నాకు దిగారు.



ప్రధాన రోడ్డుపై బస చేసి బస్సులు ఆగాలంటూ నిదానందాలు చేసిన గ్రామస్తులు, తాత్కాలికంగా రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించారు. సమాచారం అందుకున్న బోయినపల్లి పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని, ప్రజలను, కాంగ్రెస్ నాయకులను సముదాయించే ప్రయత్నం చేశారు. ఈ సందర్భంగా బోయినపల్లి ఏఎస్ఐ రాజయ్య, కానిస్టేబుల్ రమేష్ తదితరులు గ్రామస్తులతో చర్చించి, అతి త్వరలోనే బస్సులు ఆపేలా సంబంధిత అధికారులకు నివేదించనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ హామీకి సంతృప్తి చెందిన గ్రామస్తులు ధర్నాను విరమించారు. అయితే అధికారులు హామీ అమలవుతుందా లేదా వాయిదా పడుతుందా అనేది కాలమే చెప్పాల్సి ఉంది.

## టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ వేములవాడ అసోసియేషన్ బోనాల మహొత్సవానికి హాజరైన చల్మెడ.







వేములవాడ టౌన్, ( ప్రజాబలం ), బుధవారం రోజున వేములవాడ పట్టణానికి చెందిన టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పోచమ్మ-మైసమ్మ తల్లి అమ్మవార్లకు ఘనంగా బోనాల పండుగ నిర్వహించారు. ఈ బోనాల పండుగ మహొత్సవానికి వేములవాడ నియోజకవర్గ బిఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం టాక్సీ ఓనర్స్ అండ్ డ్రైవర్స్ అసోసియేషన్ వారు బోనాల పండుగ మహొత్సవం నిర్వహించడం చాలా శుభప్రదం అని పేర్కొన్నారు. వారి వ్యాపారాలు, కుటుంబాలు మంచిగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నామని తెలిపారు. ఈ వేడుకలలో మాజీ సెస్ డైరెక్టర్లు రామతీర్థపు రాజు, మాదాటి గజానంద రావు, పట్టణ బి ఆర్ ఎస్ ప్రధాన కార్యదర్శి క్రాంతి కుమార్, మాజీ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, నరాల శేఖర్, గోలి మహేష్, జోగిని శంకర్, ముద్ర కోల వెంకటేశం, నాయకులు నరాల దేవేందర్, నీలం శేఖర్, కొండ కనకయ్య, కొండ నరసయ్య, వాసాల శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, మల్లేశం, సుంకపాక రాజు, రాజేందర్, గోస్కుల రవి, మాడిశెట్టి కృపాల్, మంతె సందీప్, రాకేష్, బియ్యాల ప్రమోద్, డ్రైవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వాసాల మధుసూదన్, ఉపాధ్యక్షులు వెంకటేష్, సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నాం అని చెప్పిన పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి



పరకాల నియోజకవర్గ ప్రతినిధి (ప్రజాబలం) జూన్ 9 : బుధవారం పరకాల పట్టణ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల టౌన్%ు%మండలం, నడి కూడా మండలాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను పరకాల శాసనసభ్యులు శ్రీ రేవూరి ప్రకాశ్ రెడ్డి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...పరకాల నియోజకవర్గ వ్యాప్తంగా ఇప్పటివరకు 4,030 మందికి 27 కోట్ల 63 లక్షల 72 వేల 700 రూపాయలు అందజేశామన్నారు. ఇందులో కళ్యాణలక్ష్మి ద్వారా 1950 మందికి 19 కోట్ల 52 లక్షల 26 వేల 200 రూపాయల ఆర్థిక సహాయం, సీఎంఆర్ఎఫ్ ద్వారా 1994 మందికి 6 కోట్ల 39 లక్షల 33 వేల రూపాయలు అందజేశామన్నారు. రానున్న స్థానిక సంస్థ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని ఆశీర్వదించాలి అని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రాధాన్యత క్రమంలో దశలవారీగా ఇందిరమ్మ ఇండ్లను మంజూరు చేస్తామన్నారు.గత ప్రభుత్వంలో లబ్ధిదారులకు కనీసం సీఎంఆర్ఎఫ్ నిధులు కూడా ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పెండింగ్ వాటిని కూడా మంజూరు చేశామని అన్నారు. పేద ప్రజలకు అండగా ముఖ్యమంత్రి సహాయనిధి పథకం నిలుస్తుంది అని,అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యం అన్నారు. పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నామన్నారు.నిరుపేదలకు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఎప్పుడూ అండగా ఉంటుందని, ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పని చేస్తుందని అన్నారు.ఇచ్చిన మాట ప్రకారం మహిళలకు ఉచిత బస్ సౌకర్యం,200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500 కే గ్యాస్ సిలిండర్, ఏకకాలంలో రైతు రుణమాఫీ, పేద ప్రజలకు ఇంద్రమ్మ ఆత్మీయ భరోసా, సన్న వడ్లకు రూ 500 బోనస్, ఇందిరమ్మ ఇల్లు, ఎన్నికలలో ఇచ్చిన ప్రతి హామీని అంచలంచలుగా అమలు చేస్తున్నామని తెలిపారు.



## అభివృద్ధికి నోచుకోని, వేములవాడ అభివృద్ధికి కృషి.

### పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన ప్రభుత్వ విప్.

### నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇల్లు పరిశీలించిన ప్రభుత్వ విప్.



వేములవాడ టౌన్, ( ప్రజాబలం), అభివృద్ధికి నోచుకోని వేములవాడ అభివృద్ధి కి కృషి చేస్తున్నట్లు వేములవాడ ఎమ్మెల్యే ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. బుధవారం రోజున వేములవాడ పట్టణంలోని 19,20,21, మరియు 22 వార్డులలో54 లక్షలతో సైడ్ డ్రెయిన్, సిసి రోడ్లు మరియు సిసి కల్వర్టుల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజలకు కనీస మౌలిక వసతులు కల్పించడం లక్ష్యంగా ప్రజా ప్రభుత్వం కృషి చేస్తుందని తెలిపారు. గుడి చెరువులో, మూల వాగులో మురుగు నీరు కలవకుండా చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. రెండు పర్యాయాలు రాజన్న దేవస్థాన చైర్మన్ గా పనిచేసి, రాజన్న ఆలయ అభివృద్ధి విస్తరణ చేయడం నా పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు తెలిపారు. గత ప్రభుత్వం ఏటా వందకోట్ల రూపాయలు ఇస్తానని రాజన్న భక్తులను మోసం చేసిందని, ప్రతి శివరాత్రి ఉత్సవాల సందర్భంగా రంగురంగుల బ్రోచర్లతో రాజన్న భక్తులను మోసం చేసిందని తెలిపారు.



గతంలో తండ్రి, కొడుకులు ఎమ్మెల్యే పదవిని తమ హొదాకు చిహ్నంగా , పరపతి పెంచుకోవడం కోసం వాడుకున్నారే తప్ప ప్రజాసేవ చేయాలని కాదన్నారు.

ప్రజా ప్రభుత్వంలో రాష్ట్రం తో పాటు వేములవాడ నియోజకవర్గం అనిరంగంలో అభివృద్ధి పదంలో తీసుకెళ్తానని పేర్కొన్నారు. ఆలయ అభివృద్ధి విషయంలో ఎవరు ఎలాంటి సలహాలు, సూచనలు ఇచ్చినా తీసుకొని ముందుకు పోతున్నామన్నారు. ఎన్నికల అప్పుడు రాజకీయాలు చేస్తాం కానీ అభివృద్ధి విషయంలో కాదన్నారు.

గత ప్రభుత్వం పెట్టిన ఒక్క పథకాన్ని కూడా రద్దు చేయకుండా వాటిని కొనసాగిస్తూ నూతన పథకాలను అమలు చేస్తున్నామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట మేరకు మహిళా తల్లులకు ఉచిత బస్సు ప్రయాణం,500 రూపాయలకు గ్యాస్ సిలిండర్, 10 లక్షల ఆరోగ్య శ్రీ, 10 సంవత్సరాలుగా పేద ప్రజలు ఎదురుచూస్తున్న ఇందిరమ్మ ఇల్లు, నూతన రేషన్ కార్డులను మంజూరు చేసినట్లు తెలిపారు.

ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన.

వేములవాడ పట్టణంలోని సుభాష్ నగర్ లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్లను ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడారు. ఇందిరమ్మ రాజ్యంలో పేద ప్రజల సొంత ఇంటి కల నెరవేరుతుందని లబ్ధిదారులు సంతోషం వ్యక్తం చేశారు.

రాబోవు రోజుల్లో ఏ ఎన్నిక వచ్చిన మీ మద్దతు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికి అందజేయాలని ఆయన పిలుపునిచ్చారు. అందరి ఆలోచనలు కనుగుణంగా వేములవాడ పట్టణాన్ని అభివృద్ధి పథంలో తీసుకెళ్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో వేములవాడ పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, వేములవాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, వైస్ చైర్మన్ కనికరపు రాజు, సాగరం వెంకటస్వామి, కూరగాయల కొమురయ్య, చిలుకా రమేష్, బింగి మహేష్, మొహమ్మద్ అక్రమ్, ముప్పిడి శ్రీనివాస్, తదితర నాయకులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## విద్యార్థులు ఇంగ్లీష్ పై పట్టు సాధించాలి.

### మంత్రి ధనసరి అనసూయ సీతక్క.



ములుగు జిల్లా ప్రతినిధి (ప్రజాబలం) జూన్ 9 : ప్రైమరీ స్కూల్ నుంచే విద్యార్థులు ఇంగ్లీష్ పై పట్టు సాధించాలని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు.

బుదవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ములుగు జిల్లా విద్యాశాఖ, దిశా ఫౌండేషన్, ఈఎల్ఎఫ్ ఇంగ్లీష్ సౌజన్యంతో రెండవ దశలో జిల్లాలోని 50 ప్రాథమిక పాఠశాలల్లో లర్న్ టు రీడ్ 90 రోజుల విద్యా కార్యక్రమాన్ని రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, గ్రంధాలయ చైర్మన్ బానోత్ రవి చందర్ లతో కలసి లాంచనంగా ప్రారంభించారు.

ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో ఆంగ్ల మాధ్యమం, విద్యార్థులు ఇంగ్లీషులో మాట్లాడడం, ఆంగ్ల నైపుణ్యాల సాధన కోసం ములుగు జిల్లాలో విద్యాశాఖ, దిశా ఫౌండేషన్ వారి సౌజన్యంతో ఇంగ్లీష్ బోధన కోసం చేపట్టిన కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు క్షేత్రస్థాయిలో విజయవంతం చేయాలని అన్నారు.


దిశా స్వచ్ఛంద సంస్థ వారి సేవలను, టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్ ను సద్వినియోగం చేసుకొని విద్యార్థులలో అభ్యసన సామర్థ్యాలను పెంపొందించాలని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మంత్రి అన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి దశలో ఉపాధ్యాయులు విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఆశించిన ఫలితాలు సాధించినందున ఈ సంవత్సరం కూడా ఈ కార్యక్రమాన్ని కొనసాగిస్తూ మరో 50 పాఠశాలల్లో ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఉపాధ్యాయులు సహకరించి దిశా ఫౌండేషన్ సహకారంతో భోధించి పిల్లలకు ఆంగ్ల బాష పై పట్టు సాధించేలా కృషి చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ, ప్రోగ్రాం కోఆర్డినేటర్ అర్షం రాజు, సెక్టోరల్ అధికారులు రమాదేవి, గుళ్ళపెల్లి సాంబయ్య, స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు ఐశ్వర్య, మంజు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



# గురుదేవోభవ గురు పూర్ణిమ



**ప్రజాబలం ప్రతినిధి హైదరాబాద్:** గురుదేవోభవ గురు పూర్ణిమ, ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొనే పవిత్రమైన పండుగ. ఈ రోజున వ్యాసముని, అంటే కృష్ణ ద్వైపాయనుడు, ఉత్తరాషాఢ నక్షత్రంలో అవతరించారు. అందుకే ఈ దినాన్ని 'వ్యాస పూర్ణిమ' అని కూడా పిలుస్తారు.

-గురుదేవోభవ-

వ్యాస పౌర్ణమి గురు పూర్ణిమ, ప్రతి సంవత్సరం ఆషాఢ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొనే పవిత్రమైన పండుగ. ఈ రోజున వ్యాసముని, అంటే కృష్ణ ద్వైపాయనుడు, ఉత్తరాషాఢ నక్షత్రంలో అవతరించారు. అందుకే ఈ దినాన్ని 'వ్యాస పూర్ణిమ' అని కూడా పిలుస్తారు. ఇది కేవలం పండుగ మాత్రమే కాదు, గురువు పట్ల మన ఆదరణ, అంకితభావం, గౌరవాన్ని తెలియజేసే గొప్ప వేడుక. చాతుర్మాస్య వ్రతం కూడా ఈ రోజే ఆరంభమవుతుంది.

'గురువు' అనే పదంలో, 'గు' అంటే అజ్ఞానం, 'రు' అంటే ఆ అజ్ఞానాన్ని నాశనం చేసే వ్యక్తి అని అర్థం. అంటే, గురువు అజ్ఞానాంధకారం నుంచి మనల్ని జ్ఞాన దివ్యత్వం వైపు నడిపించే అత్యంత జ్ఞాన సంపన్నుడు. పూర్వం విద్యార్థులంతా గురువుగారి ఆశ్రమంలోనే ఉంటూ ఉచితంగా విద్యను అభ్యసించేవారు. గురువుగారి ప్రతి మాటను శిష్యులు ఆజ్ఞగా స్వీకరించేవారని చరిత్రలో అనేక నిదర్శనాలు ఉన్నాయి.

-గురువు అర్హతలు-

నిజమైన గురువును గుర్తించడం చాలా ముఖ్యం, ఎందుకంటే ఆయన మన జీవిత పరమార్థాన్ని గూర్చి జ్ఞానాన్ని అందించగలరు. గురువు సచ్చిదానంద స్వరూపుడైన భగవంతునితో సమానం. ఒక ప్రామాణిక గురువు బ్రహ్మనిష్ఠ గల శిష్య పరంపరకు చెందినవారై ఉండాలి. 'శ్రోత్రియం' అంటే ఒక ప్రామాణిక గురు-శిష్య పరంపరకు చెందినవారై, శాస్త్రజ్ఞానంలో నిష్ణాతులై ఉండాలి. వేదాలు, వైదిక సాహిత్యంపై ఆయనకు సంపూర్ణ జ్ఞానం ఉండాలి. ముఖ్యంగా, గురువుకు ఒక గురువు ఉండాలి, ఆ గురువుకు ఒక గురువు ఉండాలి, ఈ పరంపర శ్రీకృష్ణుడి నుంచి మొదలై ఉండాలి. శ్రీకృష్ణుడే ఆదిగురువు. గురువు తన సొంత కల్పనలను కలపకుండా, తన పూర్వాచార్యుల నుంచి విన్నది యథాతథంగా పునరుద్ఘాటించాలి.

గురువు ఇంద్రియాలపై పూర్తి నియంత్రణ కలిగిన 'గోస్వామి' అయి ఉండాలి, కేవలం ఇంద్రియాల బానిస (గోదాస) కారాదు. గురువు తాను భగవంతుడని ఎప్పుడూ చెప్పుకోకూడదు. అలా చెప్పుకొంటే బోధకుడిగా అనర్హుడవుతారు. ఆయన శిష్యులను భగవంతునికి శరణాగతి చేయమని ప్రోత్సహిస్తారు, కానీ వారిలో అహంకారాన్ని పెంచరు. కేవలం డబ్బు కోసం మంత్రాలను అమ్మే నకిలీ గురువులను నమ్మవద్దు. నిజమైన గురువు, శ్రీల ప్రభుపాదుల వలె, హరినామ మహామంత్రాన్ని ఉచితంగా పంచిపెడతారు. గురువు ఎల్లప్పుడూ శ్రీకృష్ణుడిని ముందుంచి, తాను వెనకుండి, శ్రీకృష్ణుని శరణాగతికై మార్గనిర్దేశం గావిస్తారు.

-గురువుల బాధ్యతలు.. శిష్యుల విధులు-

గురువుల బాధ్యత తమ శిష్యులను అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు నడిపించడం. బద్ధ జీవులను వారి పరిమిత ఆలోచన దృక్పథాల నుంచి బయటకు లాగి, వారి జ్ఞాన పరిధిని విస్తరింపజేస్తారు. దీక్షా గురువు మాయను భగ్నం చేసి, కృష్ణ చైతన్యం పట్ల బలమైన కోరికను నాటుతాడు. తన సేవతో గురువును సంతృప్తిపరచడమే శిష్యుడి ప్రధాన విధి. జీవితంలోని సవాళ్లు, ఆటుపోట్లు, ఆరోగ్య సమస్యలు, బలహీనతలలో మునిగిపోకుండా, ఆధ్యాత్మిక గురువు అభీష్ట సాకారానికి తగిన సేవ చేయడంలో నిమగ్నమై ఉండాలి. 'గురువు ఆదేశాలను చిత్తశుద్ధితో, నిబద్ధతతో పాటించేవాడు నాకు అత్యంత ప్రియమైనవాడని' శ్రీకృష్ణుడే వివరించాడు.

మన జీవితంలోని సవాళ్లు ఏవైనా ఉన్నప్పటికీ, గురువు ఆదేశాలను నిబద్ధతతో పాటించడానికి ప్రయత్నించాలి. అలసత్వాన్ని విడిచిపెట్టాలి. సేవ చేయకుండా, ప్రచారం చేయకుండా ఆపేది ఏదైనా మాయే. మనం అర్హత లేనివారిగా భావించినప్పటికీ, గురువు ఆదేశాన్ని పాటించడం శుద్ధిని ఇస్తుంది. గురువు ఆదేశం లభించినప్పుడు, ఎక్కువగా లెక్కించకుండా, వెంటనే దాన్ని ఆచరించాలి. భగవంతుడు, గురువు పట్ల గల శరణాగతి భావమే మానవ జన్మ సాఫల్యానికి మార్గం.

వెంకటయోగి రఘురామ్.

# వ్యాధి నిర్ధారణే క్షయ వ్యాధి నివారణకు మార్గం

## -మండల ప్రాథమిక వైద్యాధికారి రాపాక రమేష్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూలై 9:** సత్వర వ్యాధి నివారణ క్షయవ్యాధి నివారణకు మార్గమని మందమర్రి మండల ప్రాథమిక వైద్యాధికారి డాక్టర్ రాపాక రమేష్ అన్నారు. బుధవారం పట్టణంలోని పాల చెట్టు ఏరియాలో గల జడ్.పి.హెచ్.ఎస్ గర్ల్స్ హై స్కూల్ లో వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ఆయన పాల్గొని రోగులు, ప్రజలతో మాట్లాడారు. క్షయ వ్యాధి నివారణ కై అవగాహన కల్పిస్తూ రెండు వారాలకు పైగా దగ్గు లక్షణాలు ఉంటే క్షయ వ్యాధిగా అనుమానించాలన్నారు. ప్రతి ఆరోగ్య కేంద్రంలో వ్యాధి నిర్ధారణ తెమడ పరీక్షలు ఉచితంగా చేస్తున్నామన్నారు. క్షయ వ్యాధి నిర్ధారణ జరిగితే ఉచితంగా చికిత్స అందిస్తూ, చికిత్స పూర్తయ్యే వరకు ప్రతినెల 1000 చొప్పున పోషణ భత్యాన్ని ప్రభుత్వం అందిస్తుందని ఆయన తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి తక్కువ ఉన్నవారికి ఈ వ్యాధి తొందరగా వ్యాపిస్తుందని, అందుకు అన్ని రకాల పోషకాహారాలు దొరికే ఆహారాన్ని తీసుకోవడం ఉత్తమ మార్గమని అన్నారు. సత్వరమే వ్యాధి నిర్ధారణ జరిగి చికిత్స ప్రారంభించి వ్యాధి వ్యాప్తిని అరికట్టవచ్చు అని తెలిపారు. తుంపర్ల ద్వారా ఒకరి నుంచి ఇంకొకరికి వ్యాప్తి చెందే ఈ వ్యాధి మద్యం సేవించే వారికి పొగాకు నమిలే వారికి సోకే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఈ శిబిరంలో అవసరం ఉన్నవారికి అన్ని రకాల పరీక్షలు చేశారు. అలాగే ఎక్స్ రే అవసరం ఉన్నవారిని బెల్లంపల్లి ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి 102 వాహనం ద్వారా తీసుకెళ్లి పరీక్షల నిమిత్తం తిరిగి మరల తీసుకొని రావడం జరుగుతుందన్నారు. ఈ శిబిరంలో బిపి, షుగర్, హెచ్.ఐ.వి, హెపటైటిస్ బి .ఎస్. మరియు టి.బి.పరీక్షలు నిర్వహించారు. ఈ శిబిరంలో డాక్టర్ విష్ణుతేజ, ఏం.ఎల్.పి. హెచ్ సరిత, ఎన్.వి.హెచ్.పి డిస్ట్రిక్ట్ ఇంచార్జీ మధుబాబు, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీలత, ఆర్బిఎస్కే సిబ్బంది, సూపర్వైజరు కళావతి, టిబి సూపర్వైజర్ ఎల్ . కుమార్, ఏ.ఎన్.ఎం సుశీల, సంధ్యారాణి, హెచ్ .ఏ మధు, శ్రీధర్, ఎన్.జి.ఓ జి. ఎన్.ఎం కీరవాణి, ఓ.ఆర్. డబ్ల్యు లక్ష్మి, ఆఫీస్ సబార్డినేట్ నితిన్, ఆశాలు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త సార్వత్రిక సమ్మె విజయవంతం

### సిఐటియు ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, మానవహారం

### సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూలై 9** కార్మిక వర్గాన్ని బడా పెట్టుబడిదారులకు, కార్పొరేటర్లకు కట్టు బానిసలు చేయడానికి బిజెపి మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా జరిగిన దేశవ్యాప్త సమ్మెలో భాగంగా మంచిర్యాల జిల్లా మందమర్రిలో అన్ని విభాగాలకు చెందిన కార్మికులు సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ ఆఫీసు ముందు నుండి బస్టాండ్ సెంటర్ వరకు భారీ ర్యాలీని నిర్వహించి, బస్టాండ్ సెంటర్లో మానవహారంగా లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా, పని గంటలు పెంచుతు రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 282 ను రద్దు చేయాలని పెద్ద ఎత్తున నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా నాయకులు దూలం శ్రీనివాస్ సిఐటియు రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు, కాసర్ల రాజలింగు తెలంగాణ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ



దేశంలో మూడోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి మోడీ ప్రభుత్వం మొదటి నుండే కార్మిక వర్గంపై అనేక విధాల కర్కషత్వాన్ని పరిదర్శిస్తూ చివరకు విదేశీ, స్వదేశీ బడ పెట్టుబడిదారులకు కట్టు బానిసలుగా, పనిచేసే యంత్రాలుగా అప్పజెప్పడానికే ఈ నాలుగు లేబర్ కోడ్ లను తీసుకురావడం జరిగింది. లెబర్ కోడ్ ల అమలు కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తూ బడా పెట్టుబడిదారుల ఖజాన నింపాలని మోడీ ప్రభుత్వం ఊవ్విర్లు ఊరుతుంది. బిజెపి మోడీ ప్రభుత్వానికి మేమేం తీసిపోమన్నే విధంగా రాష్ట్రంలోని కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఈనెల 5వ తేదీన 10 నుంచి 12 గంటల పని గంటలు పెంచుతూ 282 జీవోను విడుదల చేసింది. కాంగ్రెస్,బిజెపి ప్రభుత్వాల జెండాలు వేరు కావచ్చు, కానీ వారి ఎజెండా మాత్రం ఒక్కటే అనేది ఆచరణలో నిరూపించారన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు కార్మిక వ్యతిరేక విధానాలను మార్చుకోకుంటే, 4 లెబర్ కోడ్ లను రద్దు చేయకుంటే రైతాంగ పోరాట స్ఫూర్తితో పోరాటాలను తీవ్ర స్థాయిలోకి తీసుకుపోతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సిఐటియు జిల్లా ఉపాధ్యక్షురాలు వి. నిర్మల, సింగరేణి కాంటాక్ట్ కార్మిక సంఘం సిఐటియు డివిజన్ అధ్యక్ష కార్యదర్శులు గందం రవి, రమేష్, మందమర్రి మున్సిపల్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు యం. నర్సయ్య, జి. ఐలయ్య, మున్సిపల్ నాయకులు సంగి పోషం, ప్రసాద్, లింగంపల్లి రవి, పోసు, లత, రజిత, ఎస్సీ కేవిస్ సిఐటియు నాయకులు తిరుపతి, రాయమల్లు, కళ, లక్ష్మి, పద్మ, రాజేశ్వరి, రవీందర్, వెంకటేష్, తిరుపతి, ఇమామ్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు పేదలకు అందేనా

### ఈ నిరుపేదకు ఇల్లు లేదని పిల్లనివ్వడం లేదు

### ఉన్నవాళ్లకే ఇందిరమ్మ ఇండ్లు

### 70 ఏళ్లుగా పూరి గుడిసెలోనే జీవనం కొనసాగింపు



అందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జులై 9 ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో, ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి పేదవాడికి ఇల్లు మంజూరు చేస్తామని చెప్పారు, గడచిన 18 నెలల అనంతరం, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితాను విడుదల చేశారు, ఇందులో నియోజకవర్గ%శీ% వ్యాప్తంగా రాజకీయాలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపిక చేసినా, ఇల్లు ఉన్నవారికి ఇల్లు రావడంతో, నిరుపేదలకు తీవ్ర అన్యాయం జరిగింది, వీరి పక్షాన ఈ నిరుపేదకు ఇల్లు ఇవ్వవలసిన అవసరం ఎంతైనా ఉందని చెప్పే నాయకులు లేకపోయారు, దీనికి నిదర్శనం మండల కేంద్రమైన పుల్కల్ లోని , ఈ అనాధ యువకుడిని, ఉదాహరణగా తీసుకుంటే, ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక జాబితా ఎలా జరిగిందో, అర్థం అవుతుంది, ఫలితంగా పేదలు పేదలుగానే గుడిసెల్లోనే జీవనం కొనసాగిస్తున్నారు, 30 ఏళ్ల యువకుడు పుట్టకముందు నుంచి వారి తల్లిదండ్రులు సైతం అదే గుడిసెలో కాపురం చేశారు, ఈసారైనా ఇందిరమ్మ ఇల్లు వస్తుందని ఆశపడ్డారు, కానీ స్థానిక నాయకుల పక్షపాతమో అధికారుల నిర్లక్ష్యమో తెలియదు కానీ మండల కేంద్రమైన పుల్కల్ కు, 29 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కాగా, ఇండ్లలో అత్యధికంగ ఉన్నవారికే ఇండ్ల జాబితాలో పేర్లు వచ్చాయి, (ఇందులో కొందరు ప్రభుత్వ ఉద్యోగులు), సైతం ఉన్నారు, అంటే నాయకుల ప్రమేయం ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు, వివరాల్లోకి వెళితే పుల్కల్ గ్రామానికి చెందిన, తంగేడిపల్లి చంద్రయ్య, లలిత, వీళ్ళిద్దరూ భార్యాభర్తలు, కొంతకాలం క్రితం అనారోగ్యంతో వీళ్ళిద్దరు మరణించారు, వీరికి అశోక్, అనే ఒక కుమారుడు ఉన్నాడు, తల్లిదండ్రులు ఉండే పూరి గుడిసెలోనే ఇతని జీవనం కొనసాగిస్తున్నాడు, కానీ అధికారులకు నాయకులకు మాత్రం అనాధ యువకుడు ఉండే పూరి గుడిసె కనిపించడం లేదు, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారితోపాటు, ఎకరాల కొద్దీ భూమి ఉన్న వారికి సైతం ఇందిరమ్మ ఇల్లు ఇచ్చారు, అలాంటిది నిరుపేదకు మాత్రం మొండి చేయి చూపించారు, ఇది కేవలం ఒక పుల్కల్ మండలం లోనే కాదు, ప్రతి గ్రామంలోనూ ఇలాంటి పరిస్థితులు ఉన్నాయి, ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు, అధికార పార్టీకి చెందిన నాయకులు, ఒకసారి ఆత్మ పరిశీలన చేసుకొని, ఇలాంటి నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు, మంజూరు చేయించే బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది, తనకు ఇల్లు లేకపోవడంతో ఎవరు నాకు పిల్లనివ్వడం లేదని, తన తల్లిదండ్రులు సైతం నీరు పేదలని కూలి పని చేస్తూ తనను చదివించారని, తనకు ప్రైవేట్ ప్రభుత్వ ఉద్యోగం లేక కూలిగా పని చేస్తూ జీవనం కొనసాగిస్తున్నానని, ఇప్పటికైనా అధికారులు తన ఆర్థిక పరిస్థితి చూసి ఇందిరమ్మ ఇల్లు, మంజూరు చేస్తే, ప్రభుత్వానికి అధికారులకు రుణపడి ఉంటానని బాధితుడు అశోక్ తన ఆవేదన వ్యక్తం చేశాడు....

# దుకాణం షటర్ ధ్వంసం చేసి దొంగతనం





**ఆందోల్ నియోజకవర్గం ప్రతినిధి (జులై 9 ప్రజాబలం) సంగారెడ్డి జిల్లా :** అందోల్ మండలం జోగిపేట శివారులో, ఓహార్డ్వేర్ షాప్ లో,దొంగలు చెల రేగిపోయారు, టేక్మాల్ కు చెందిన సాయి, అనే వ్యాపారస్తుడు, జోగిపేట శివారులో మల్లికార్జున ఎంటర్ప్రైజెస్, పేరుతో హార్డ్వేర్ వ్యాపారాన్ని కొనసాగిస్తున్నాడు, మంగళవారం ఉదయం షాప్ తెరవడానికి వచ్చి, అక్కడ పరిస్థితిని చూసి కంగుతిన్నాడు, దుకాణం యొక్కషట్టర్ని ధ్వంసం చేసి దుకాణంలోకి దొంగలు దూరి దొంగతనం చేసినట్టు గ్రహించాడు, వెంటనే జోగిపేట పోలీసులకు సమాచారం ఇవ్వడంతో, జోగిపేట సీఐ అనిల్ కుమార్, మరియు ఎస్ఐ పాండు, సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం,కౌంటర్లో నగదు మరియు దేవుడి దగ్గర ఉంచిన ఉండి దొంగిలించినట్టు తెలిపాడు, దీంతో కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు....

# ఆర్ అండ్ బీ శాఖపై

# మంత్రి కోమటిరెడ్డి సమీక్ష

సెక్రటేరియట్ లో రోడ్లు భవనాలు శాఖ పై మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. జాతీయ రహదారి 65 రోడ్డు పనుల పురోగతి పై అధికారులను ఆరా తీసారు. మదీనాగూడ నుండి సంగారెడ్డి వరకు 6లేన్ల రహదారి విస్తరణ పనుల పురోగతి, హ్యామ్ రోడ్ల ప్యాకేజీ ల పై చర్చ జరిగింది. ఈ సమీక్షలో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు, ప్రభుత్వ స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్,రీజినల్ ఆఫీసర్ కృష్ణ ప్రసాద్,ఔఊ అధికారులు, ఆర్ అండ్ బి ఈఎన్సి జయ భారతి,సి.ఈ లు, ఎస్.ఈ ధర్మారెడ్డి,పలువురు ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.

# ఆర్.ఎం.పి ల సమస్యలు తీర్చాలని మంత్రి వివేక్ వెంకటస్వామికి వినతి



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూలై 9** :మందమర్రి అనుభవ వైద్య సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ఆర్ఎంపి పిఎంపీలు బుధవారం రోజున సోమాజిగూడలో కార్మిక శాఖ, మైనింగ్ గనుల శాఖ మంత్రివర్యులు వివేక్ వెంకటస్వామి ని కలిసి రాష్ట్రంలో జరుగుతున్న ఆర్ఎంపి పిఎంపి వైద్యుల మీద జరుగుతున్న దాడులను ఆపాలని అలాగే ముఖ్యమంత్రి దృష్టికి ఈ సమస్యను తీసుకెళ్లి మాకు సరైన పరిష్కార మార్గం చూపించాలని వినతిపత్రం అందించారు. అలాగే మందమర్రిలో జరుగుతున్న దాడుల గురించి ఆయనకు వివరించారు. రానున్న రోజుల్లో ఇలాంటి పరిణామాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో చొప్పరి శంకర్ ముదిరాజు, తెలంగాణ రాష్ట్ర అనుభవ వైద్య సంఘాల అధ్యక్షులు గాదాసు శంకరయ్య, రాష్ట్ర కార్యదర్శి, రంగు రవీందర్, సంయుక్త కార్యదర్శి, లెక్కల నగేష్, రాష్ట్ర కోశాధికారి, కట్ల శ్రీనివాస్, మందమర్రి పట్టణ అధ్యక్షులు గోనె గోవర్ధన్, గౌరవ అధ్యక్షులు మంద తిరుమల్, వర్కింగ్ ప్రెసిడెంట్ గాజుల శంకర్, ప్రధాన కార్యదర్శి చింతల పోశం, ఉపాధ్యక్షులు అడ్డూరి సాంబమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

# దేశవ్యాప్త కార్మికుల సమ్మెకు మద్దతుగా సమ్మెలో పాల్గొన్న టీడబ్ల్యూజేఎఫ్ నాయకులు



**హుజురాబాద్ అసెంబ్లీ నియోజకవర్గం ప్రజాబలం ప్రతినిధి జూలై 9**దేశవ్యాప్తంగా బుధవారం రోజున జాతీయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన సమ్మెకు మద్దతుగా జమ్మికుంట పట్టణంలో జరిగిన జాతీయ కార్మిక సంఘాల సమ్మెకు తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్) హుజురాబాద్ నియోజకవర్గ కమిటీ ఆధ్వర్యంలో సంపూర్ణ మద్దతుగా సమ్మెలో పాల్గొని నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అధ్యక్ష కార్యదర్శులు.సౌడమల్ల యోహాన్, ఏబూసి.సంపత్ లు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన కార్మిక చట్టాలతో కార్మికులకు ఏ విధంగా అయితే నష్టం వాటిల్లుతుందో అదేవిధంగా వర్కింగ్ జర్నలిస్టుగా పనిచేస్తున్న జర్నలిస్టులకు కూడా 44 కార్మిక చట్టం ప్రకారం అన్యాయం జరుగుతుందని అన్నారు. వెంటనే కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నూతన చట్టాలను వెనక్కి తీసుకోవాలని అన్నారు.కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే జర్నలిస్టులకు ఉన్నటువంటి రైల్వే పాసులను రద్దుచేసి ఇప్పటివరకు పునరుద్ధరించలేదని , రైల్వే పాస్ లను వెంటనే ప్రారంభించాలని వారు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు భూపతి. సంతోష్, జిల్లా నాయకులు ఎండి ఖాజా ఖాన్, వలిపిరెడ్డి శ్రీనివాస్,కందుకూరి రాజు, అంబాల శ్రీరామ్, పెద్ది సంతోష్, ఖండెం వంశీకృష్ణ, బడుగు రవికుమార్, జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

## జిజ్ఞాస ఆధ్వర్యంలో సైన్స్ పై విద్యార్థులకు అవగాహన



**ప్రజాబలం చెన్నూరు నియోజకవర్గ రిపోర్టర్ జూలై 9**:మంచిర్యాల జిల్లా సైన్స్ కేంద్రం ఆధ్వర్యంలో జిజ్ఞాస సంచార ప్రయోగశాల ద్వారా విద్యార్థులకు సైన్స్ పై అవగాహన కల్పిస్తున్నారు. ఈసందర్భంగా బుధవారం మందమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో విద్యార్థిని విద్యార్థులకు సైన్స్ పై అవగాహనను నిర్వహించారు. జిల్లా విద్యాధికారి, జిల్లా సైన్స్ కారి ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. విద్యార్థులకు మానవ శరీర భాగాలు ఎముకలు, గుండె, మెదడు, కిడ్నీ, డీఎన్ఏ ఇతర భాగాలు తోపాటు సూర్యగ్రహణం, చంద్రగ్రహణం గూర్చి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జిజ్ఞాస ఇన్స్ట్రక్టర్ లక్ష్మణ్, సుంకరి సంపత్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మజలు పాల్గొన్నారు

# శ్రీ సరస్వతీ శిశుమందిర్ ప్రాంగణంలో వన మహోత్సవం వేడుకలు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై 09(ప్రజాబలం)**సంగారెడ్డి జిల్లా:జహీరాబాద్ పట్టణం లోని శ్రీ సరస్వతీ శిశు మందిర్,దత్తగిరి కాలనీలో వనమహోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు."మానవ సేవయే మాధవ సేవ" నినాదంతో ఈ కార్యక్రమాన్ని ఆర్థిక సహకారంతో చేపట్టారు.ఈ కార్యక్రమంలో పాఠశాల అధ్యక్షుడు తెజుగం రాజయ్య,ఉపాధ్యక్షుడు నీల వేంకటేశ్,కార్యదర్శి కె.బాల్‌కిషన్, కోశాధికారి జి.నర్సింహరెడ్డి, అన్నదాన సేవా సమితి సమన్వయకర్త పాండయ్య, ప్రధానాచార్యులు శ్రీనివాసరావు, మహిళా మండలి అధ్యక్షురాలు కల్పన,కార్యదర్శి పద్మ,కోశాధికారి నవనీత,మంకాల లత తదితరులు పాల్గొన్నారు.

# ఆధార్ బయోమెట్రిక్ తప్పనిసరిగా అప్ డేట్ చేసుకోవాలి::జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ

### అదనంగా సి.ఎస్.సి సెంటర్ల ఏర్పాటు నోటిఫికేషన్ జారీ చేయాలి

### జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



**రాజన్న సిరిసిల్ల జిల్లా, జూలై 09:(ప్రజాబలం ప్రతినిధి)**ప్రతి ఒక్కరూ తమ ఆధార్ కార్డ్ లో వివరాలు, బయోమెట్రిక్ అప్ డేట్ చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ అన్నారు.బుధవారం జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ఎస్పీ మహేష్ బి గీతే తో కలిసి జిల్లా స్థాయి ఆధార్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝ మాట్లాడుతూ, సంతృప్త పద్ధతిలో పౌరులందరికీ తప్పనిసరిగా ఆధార్ కార్డు జారీ చేయాలని కలెక్టర్ తెలిపారు. ప్రైవేట్, ప్రభుత్వ ఆసుపత్రిలో జరిగే ప్రసవాల వివరాలు ఈ బర్త్ పోర్టల్ లో నమోదు చేయాలని అన్నారు.ప్రతి 10 వేల జనాభాకు ఒక సి.ఎస్.సి సెంటర్ ఏర్పాటు చేయాలని, 7 రోజుల సమయంలో అదనంగా మరో 36 సి.ఎస్.సి సెంటర్ల ఏర్పాటు నోటిఫికేషన్ జారీ చేయాలని, ప్రస్తుతం ఉన్న కొన్ని సెంటర్లు మార్చాలని అన్నారు. జిల్లాలో 5 నుంచి 15 సంవత్సరాల లోపు గల 27 వేల పైగా ఉన్న జనాభా కు తప్పనిసరిగా బయోమెట్రిక్ అప్డేట్ చేయించాలని కలెక్టర్ సూచించారు. పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఆధార్ బయోమెట్రిక్ అప్ డేషన్ కోసం ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్స్ , కాలేజీలలో ప్రత్యేక అవగాహన క్యాంపులను ప్రతి 6 నెలలకు ఒకసారి ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లా సంక్షేమ అధికారి 0 నుంచి 5 సంవత్సరాల వయస్సు పిల్లలకు ఆధార్ కార్డు అందేలా చూడాలని అన్నారు.



18 సంవత్సరాలు దాటిన వారి ఆదార్ నమోదుకు సంబంధించి తహసిల్దార్ లాగిన్ లో పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలని తెలిపారు. మండల కేంద్రాలలో ఆధార్ కార్డు వివరాల అప్ డేట్ చేసేందుకు ప్రత్యేక క్యాంపుల ఏర్పాటు ప్రణాళిక తయారు చేయాలని అన్నారు. జిల్లాలో మీ సేవా కేంద్రాల్లో ఆధార్ సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పోస్టల్ కార్యాలయం నుంచి ఎన్ని ఆధార్ కార్డు తప్పుడు అడ్రెస్ ల కారణంగా వెనక్కి వచ్చాయో వివరాలు అందించాలని అన్నారు.జిల్లాలోని వివిధ అనాధ శరణాలయాల్లో పెరుగుతున్న వారికి ఆధార్ ఎన్ రొల్మెంట్లో వచ్చే సమస్యలను పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోరారు.ఈ సమావేశంలో యూ.ఐ.డి.ఏ.ఐ ప్రాజెక్టు మేనేజర్ నరేష్ చంద్ర,జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీ రాజం,జిల్లా విద్యాశాఖ అధికారి వినోద్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా.రజిత, ఈ.డి.ఎం. శ్రీనివాస్, లీడ్ బ్యాంకు మేనేజర్ మల్లికార్జున్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమం విజయవంతం చెయాలి ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్ సాగర్ రావు




**ప్రజాబలం మంచిర్యాల జిల్లా ప్రతినిధి జూలై 09 :** ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ విలేకరుల సమావేశం నిర్వహించిన ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు.మంచిర్యాల జిల్లా లక్షెట్టిపేట మున్సిపాలిటీ లో నూతనంగా నిర్మించిన ప్రభుత్వ ఆసుపత్రి ప్రాంగణంలో విలేకరుల సమావేశం నిర్వహించిన మంచిర్యాల ఎమ్మెల్యే ప్రేమ్ సాగర్ రావు,ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ...ఈ నెల 13 తేదీన అన్ని హంగులతో నిర్మితమై అన్ని సౌకర్యాలు కల్పించి ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క,వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా తో పాటు పలువురు మంత్రులతో ఆసుపత్రిని ప్రారంభించనున్నామని ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు,ఈ ఆసుపత్రి కి 2013 లో ప్రతిపాదనలు పంపాను కానీ అప్పటినుండి అనేక కారణాల మూలంగా జాప్యం అయింది ఇప్పుడు నా హయాంలో పూర్తి చేసి ప్రారంభిస్తున్నాను,రావాల్సిన బిల్లులు కూడా నేనే క్లియర్ చేషాను,మంచిర్యాల నియోజకవర్గం లో ప్రభుత్వ ఆసుపత్రులు,స్కూల్స్ కాలేజీలకు మహర్థశ వచ్చింది,వచ్చే సంవత్సరం అడ్మిషన్ లకు లక్షెట్టిపేట ప్రభుత్వ కళాశాల,పాఠశాల లలో పోటీ మొదలౌతుంది,ప్రభుత్వ ఆస్తులు ఎవరు కబ్జా చేసిన వదలను ముఖ్యంగా విద్యాలయాలు, వైద్యాలయాల రక్షణకు ప్రత్యేక చొరవ తీసుకుంటాను,ఐదు సంవత్సరాలలో మంచిర్యాల నియోజకవర్గం రాష్ట్రంలో అభివృద్ధి లో ప్రథమ స్థానంలో ఉంటుంది,దానికి అన్ని వర్గాల మద్దతు కావాలి,అభివృద్ధి ప్రయాణం నాది,ఆసుపత్రి ప్రారంభ అనంతరం ప్రభుత్వ కళాశాల పాఠశాల ను మంత్రులు పరిశీలించి విద్యార్థులతో సహపంక్తి భోజన అనంతరం రెబ్బెన పల్లిలో పబ్లిక్ మీటింగ్ లొ పాల్గొంటారు,దాదాపు లక్ష మందితో సభ ఉంటుంది రాష్ట్రం మొత్తం స్థానిక సంస్థల కు శంఖారావం ఈ సభ ఉంటుంది,రెబ్బెన పల్లిలో సోలార్ ప్లాంట్ ప్రారంభం ఉంటుంది అని వచ్చే మంత్రులు రెండు రోజుల పాటు నియోజకవర్గం లొ పలు అభివృద్ధి పనుల కార్యక్రమాలలో పాల్గొంటారు అని అన్నారు.ఈ కార్యక్రమం లో పట్టణ అధ్యక్షులు ఎండి ఆరిఫ్,మండల అధ్యక్షుడు పింగళి రమేష్,జిల్లా ఉపాధ్యక్షులు చింత అశోక్ కుమార్,మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ చెల్ల నాగభూషణం,పూర్ణ చందర్,ఆర్ టి ఏ మెంబెర్ అంకతి శ్రీనివాస్,మండల ఉపాధ్యక్షులు కంది మోహన్,రాందేని చిన్న వెంకటేష్,మాజీ కౌన్సిలర్ సురేష్ నాయక్,రాందేని వెంకటేష్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ తోట రవి,బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నలిమేలా రాజు, నవాబ్,అమీర్,షహీద్అలీ, హాజీ,పెట్టాం శ్రీనివాస్,గోపతి రమేష్,తదితరులు పాల్గొన్నారు

# మండలానికి ఐదు ఎంపీటీసీలు ఉండాల్సిందే.

!హైదరాబాద్ పంచాయతీల పునర్వ్యవస్థీకరణ ఎంపీటీసీ డీలిమిటేషన్ షెడ్యూల్ జారీరాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీల పునర్వ్యవస్థీకరణ, మండల ప్రజా పరిషత్ ఎంపీటీసీ డీలిమిటేషన్ కు సంబంధించిన షెడ్యూల్‌ను జారీ చేసింది.ఈ మేరకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల డైరెక్టర్ సృజన. కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులకు సూచనలతో కూడిన సర్క్యులర్ ను? జారీ చేశారు. కొన్ని గ్రామ పంచాయతీలు సమీప మున్సిపాలిటీలో విలీనం కావడం, ఇతర పంచాయతీలలో కలపడంతో ఈ పునర్వ్యవస్థీకరణ అవసరమైంది.తెలంగాణ పంచాయతీరాజ్ సవరణ, చట్టం ప్రతీ మండల ప్రజా పరిషత్‌లో కనీసం ఐదు ఎంపీటీసీలు ఉండాలని చెబుతోంది. ఇందులో భాగంగా ప్రభావిత ఎంపీటీసీలను కొత్త ఎంపీటీసీలుగా క్రమబద్ధీకరించడం లేదా సమీపంలోని ఎంపీటీసీలలో విలీనం చేయడానికి తక్షణ చర్యలు తీసుకోవాలని డైరెక్టర్ కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు.ఎంపీటీసీ డీలిమిటేషన్ షెడ్యూల్‌ముసాయిదా ప్రచురణ: 8.07.2025అభ్యంతరాల స్వీకరణ:8.07.2025 నుంచి 9.07.2025అభ్యంతరాల పరిష్కారం:10.07.2025 నుంచి 11.07.2025తుది ప్రచురణ: 12.07.2025

# వేములవాడ రూరల్ బిజెపి మండల కార్యవర్గ ఎన్నికలు.



దేశం కోసం ! ధర్మం కోసం !!

భారతీయ జనతా పార్టీ

వేములవాడ రూరల్ మండల శాఖ, రాజన్నసిరిసిల్ల జిల్లా, తెలంగాణ రాష్ట్రం.

BHARATHIYA JANATHA PARTY VEMULAWADA RURAL MANDALA SHAKA

RAJANNA SIRCILLA DISTRICT, TELANGA STATE.

BURUGUPALLY PARAMESH
PRESIDENT

Residence # H.No.6-60, Near: Water Tank, Vill. JAYAVARAM, Mdl. Vemulawada Rural, Dist. Rajanna Sircilla, Telangana State - 505 302. Cell: 9000063225, 8520000117 E-mail: parameshv092@gmail.com

Date 09/07/2025

తేది 09/07/2025 రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు శ్రీ రెడ్డివేని గోపి గారి ఆదేశానుసారం వేములవాడ రూరల్ మండల అధ్యక్షులు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సభ్యులను ఏర్పాటు చేయడమైనది. రాబోయే రోజుల్లో మండల ప్రజల సమస్యలపై , ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, క్రమ శిక్షణ కలిగిన కార్యకర్తగా, పార్టీ అభివృద్ధికి కృషిచేయాలని తెలియజేస్తూ ఇట్టి నియామకం తక్షణమే అమలులోకి వస్తుంది.

మండల ఉపాధ్యక్షులు :- 1. పల్లికొండ నారాయణ హనుమాజీపేట, 2. లింగంపల్లి కుంటయ్య మల్లారం, 3.పంచెరువుల విజయ జయవరం, 4. గుంటి వంశీకృష్ణ నమిలిగుండుపల్లి.

మండల ప్రధాన కార్యదర్శులు: - 1. తోట శేఖర్ పోశెట్టిపల్లి, 2. వనపర్తి పరశురాములు నూకలమర్రి.

మండల కార్యదర్శి:- 1. గుమ్మడి శ్రీనివాస్ మర్రిపల్లి, 2. చిందం కుమార్ ఫాజుల్నగర్, 3.పొన్నం మేఘన ఎదురుగట్ల, 4. మందా రాజేందర్ వట్టెంల.

కోశాధికారి:- ఆవునూరి రమ్య వెంకటం పల్లి

సోషల్ మీడియా కన్వీనర్:- చింతకుంట గౌతమి బొల్లారం

భవదీయ

బూరుగుపల్లి పరమేష్

బిజెపి వేములవాడ రూరల్ మండల అధ్యక్షులు

**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ), తేదీ 09-07-2025** బుధవారం రోజున రాజన్న సిరిసిల్ల జిల్లా భారతీయ జనతా పార్టీ అధ్యక్షులు రెడ్డివేని గోపి ఆదేశానుసారం వేములవాడ రూరల్ బిజెపి మండల అధ్యక్షుడు బూరుగుపల్లి పరమేష్ ఆధ్వర్యంలో భారతీయ జనతా పార్టీ మండల కార్యవర్గ సభ్యులను ఎన్నుకోవడం జరిగింది. రాబోయే రోజుల్లో మండల ప్రజల, సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, క్రమశిక్షణ కలిగిన కార్యకర్తగా, పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని తెలియజేస్తూ ఇట్టి నియామకం తక్షణమే అమల్లోకి వస్తుందని, మండల ఉపాధ్యక్షులుగా పల్లికొండ నారాయణ, హనుమాజీపేట, లింగంపల్లి కుంటయ్య, మల్లారం. పంచెరువుల విజయ జయవరం. గుంటి వంశీకృష్ణ, నమిలిగుండు పల్లి. రూరల్ మండల ప్రధాన కార్యదర్శులుగా తోట శేఖర్ పోశెట్టిపల్లి. వనపర్తి పరశు రాములు నూకలమర్రి. మండల కార్యదర్శి గుమ్మడి శ్రీనివాస్ మర్రిపల్లి, చిందం కుమార్ ఫాజుల్ నగర్. పొన్నం మేఘన ఎదురుగట్ల. మంద రాజేందర్ వట్టెంల. ఆవునూరి రమ్య వెంకటం పల్లి. సోషల్ మీడియా కన్వీనర్ చింతకుంట గౌతమి బొల్లారం. తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వేములవాడ రూరల్ బిజెపి మండల అధ్యక్షుడు ఉరుకుపల్లి పరమేష్ ఒక ప్రకటనలో తెలిపారు.

# బ్రిడ్జి పనులు త్వరగా పూర్తి చేయాలి.

## చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ.

## విద్యాలయాలు, లో లెవెల్ బ్రిడ్జిల పరిశీలన.

**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ-బోయినపల్లి ప్రధాన రహదారిలో స్తంభంపల్లి గ్రామ శివారులో బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆదేశించారు. బోయినపల్లి మండలంలోని స్తంభంపల్లి గ్రామ శివారులో అసంపూర్తిగా నిలిచిన బ్రిడ్జి పనులను వారు బుధవారం కలిసి పరిశీలించారు.



బ్రిడ్జి నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రయాణికులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చూడాలని కాంట్రాక్టర్కు సూచించారు. పనులను వేగవంతం చేసి, నిరంతరం పర్యవేక్షించాలని పంచాయతీరాజ్ ఈ ఈ సుదర్శన్ రెడ్డిని ఆదేశించారు.

తరగతి గదులు నిర్మించాలి.

బోయినపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరిశీలించారు. పదవ తరగతి గదిని సందర్శించి, విద్యార్థులకు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. కిచెన్, స్టోర్ రూమ్, మధ్యాహ్న భోజనం తయారీ తీరును పరిశీలించారు. విద్యార్థులకు అన్ని మౌలిక వసతులు, సదుపాయాలు కల్పించాలని సూచించారు. భవనం మొదటి అంతస్తులు 8 లక్షల రూపాయలతో రెండు తరగతి గదుల నిర్మాణానికి ప్రతిపాదన సిద్ధం చేయాలని పంచాయతీరాజ్ ఈ ఈ ని ఆదేశించారు.





ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు.

బోయినపల్లి- కొదురుపాక దారిలో ఉన్న రెండు లో లెవెల్ కల్వర్టులను కలెక్టర్, ఎమ్మెల్యే పరిశీలించారు. ప్రయాణికులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహిస్తూ, పిచ్చి మొక్కలను తొలగించాలని ఎంపీడీవోను ఆదేశించారు.



అంతకుముందు బోయినపల్లి మండలం స్తంభంపల్లి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, అంగన్వాడి కేంద్రాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝ ఆకస్మికంగా తనిఖీ చేశారు. చదువుతున్న విద్యార్థుల సంఖ్య, వివరాలపై ఆరా తీశారు. విద్యార్థుల నమోదు పెంచాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. అంగన్వాడీలో చిన్నారుల వివరాలను అడిగి తెలుసుకున్నారు.

ఈ కార్యక్రమంలో ఈ ఈ పీ ఆర్ సుదర్శన్ రెడ్డి, ఎంపీడీవో జయశీల, తాసిల్దార్ నారాయణరెడ్డి, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# ప్రసన్న కుమార్ రెడ్డి హత్యకు కుట్ర

నెల్లూరు నల్లపురెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డినీ చంపాలని కుట్ర చేశారని వైకాపా నేత, మాజీ ఎమ్మెల్యే అనిల్ కుమార్ యాదవ్ ఆరోపించారు. బుధవారం అయన మీడియాతో మాట్లాడారు. నల్లపరెడ్డి ఇంటిమీద దాడి తో నెల్లూరు జిల్లా ఉలిక్కిపడింది. ఫ్యాక్షన్ ప్రాంతంగా నెల్లూరును వేమిరెడ్డి దంపతులు ఈ ఘటనతో మార్చేశారు. కూటమి ప్రభుత్వంలో ప్రణాళికాబద్ధంగా ఒకరి తరువాత ఒకరిపై కేసులు,దాడులు జరుగుతున్నాయి. దాడి ఘటన నేపథ్యంలో నిందితులపై పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేయాలని కోరామని అన్నారు. ప్రశాంతమ్మ నిన్న చేసిన వ్యాఖ్యల్లో అనేక తేడాలు ఉన్నాయి... ఆమె వ్యాఖ్యలు అనేక అనుమానాలకు తావిస్తున్నాయి. - ప్రసన్న ను చంపాలనే లక్ష్యంతోనే దాడి చేసినట్లు ప్రశాంతమ్మ మాటలను బట్టి అర్థం అవుతోంది. దీనిపై ఎల్లో మీడియా కూడా ఏమాత్రం పొసగని వార్తలు ప్రసారం చేసింది. ఇంట్లోవాళ్లను భయభ్రాంతులకు గురి చేసేలా ఈ దాడులు జరిగాయి. ప్రసన్న తనకు తానే దాడులు చేయించుకున్నారని ప్రశాంతమ్మ ఆరోపణలు చేయడం సిగ్గుచేటని అన్నారు. సీసీ ఫుటేజీని పరిశీలిస్తే ప్రసన్నను అంతం చేయాలనే లక్ష్యం కనిపిస్తోంది. పోలీసులు వెళ్లే సమయానికి దుండగులు విధ్వంసం చేస్తుంటే కనీసం ఒకరిని కూడా పట్టుకోలేదు... ఇది నల్లపరెడ్డికి అంతం చేయాలనే కుట్రగా భావిస్తున్నాం. దీనిపై పవన్ ట్వీట్ చేయడం సిగ్గుచేటు. ఆయన ఇంట్లో మహిళలు లేరా... వాళ్ళని కూడా బెదిరిస్తే చూస్తూ ఊరుకుంటారా. దాడి సమయంలో శ్రీనివాసులురెడ్డి సతీమణి ఉంటే ఆమెని కూడా బెదిరించారు. రాజకీయాల్లో ఆదర్శంగా నిలిచిన నల్లపరెడ్డి కుటుంబానికి ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. టీడీపీ కన్వీనర్లు,నాయకులే దాడులు చేస్తే వారిని అరెస్టు చేయకుండా.. ప్రసన్నపై కేసులు పెట్టడం దారుణం. వేమిరెడ్డి దంపతులతో పాటు, దాడికి పాల్పడిన వారిపై కేసులు ఎందుకు పెట్టరు... కుట్రదారులపై హత్యాయత్నం కేసు పెట్టాలి. గతంలో రోజాను ఇంకా చాలామంది వైసీపీ మహిళలపై తప్పుగా మాట్లాడలేదా... మరి అప్పుడు మేము దాడులు చేయలేదు. నెల్లూరులో ఇలా దాడులు చేయడం చాలా దారుణం... కూటమి ప్రభుత్వం వచ్చింది ఇందుకేనా. ప్రసన్నపై రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసింది ప్రశాంతమ్మ.... ప్రశ్నిస్తే ఆయనపై దాడులు చేసి చంపాలని కుట్రలు చేస్తారా. - ప్రశాంతమ్మకు గౌరవించడం రాదా... ఎలా మాట్లాడాలి అనే సంస్కారం లేదా.- ప్రసన్నపై ఎలాగైతే కేసులు పెట్టారో వేమిరెడ్డి ఖీ దంపతులపై కూడా కేసులు కట్టాలని అయన అన్నారు.


# ఏబీవీపీ 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు.




**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఇల్లంతకుంట, ( ప్రజాబలం ),** ఇల్లంతకుంట మండల శాఖ ఆధ్వర్యంలో ఏబీవీపీ 77వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఇల్లంతకుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొక్కలు నాటడం జరిగింది. ఏబీవీపీ జిల్లా నాయకులు మంద వంశీకృష్ణ ఈ సందర్భంగా మాట్లాడుతూ సాధారణ విద్యార్థులను, అసాధారణ విద్యార్థులుగా మలచి, సమాజంలోని అన్ని రంగాలలో ప్రతిభావంతులుగా తీర్చిదిద్దే విద్యార్థి సంస్థ, విద్యార్థి తనకోసం, తాను కాక సమాజ హితం కోసం పనిచేయాలని సంకల్పాన్ని కల్పించే బృహత్తర యజ్ఞవాటిక, పుస్తకాలను చదువుతూ సమాజాన్ని చదివిపించే జ్ఞాన భాండాగారం, విద్యార్థులలో సామాజిక స్పృహను కలిగిస్తూ, దేశ హితం కోసం పనిచేసే విధంగా దేశభక్తిని రగిలించి, విద్యార్థులలో న్యాయకత్వ లక్షణాలను పెంపొందించే సామాజిక జాతీయవాద విద్యార్థి సంస్థ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ అని, విద్యారంగ సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహిస్తూ సమాజ హితం కోసం నాటి నుంచి నేటి వరకు అలుపెరుగకుండా పోరాటం చేస్తున్న ఏకైక సంస్థ ఏబీవీపీ అని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో వేణు, ప్రవీణ్, పవన్, చరణ్, నందు, రాజు, గణేష్, ఉదయ్, అనిల్, మధు, జస్వంత్ మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# యువకులు గంజాయికి బానిసై పెడదారిలో వెళ్ళవద్దు, మంచి దారిలో వెళ్తేనే మంచి భవిష్యత్తు ఉంటుంది.

## ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల. అశోక్.




**రాజన్న సిరిసిల్ల ప్రతినిధి, ఇల్లంతకుంట, ( ప్రజాబలం ),** చాలామంది యువకులు గంజాయి కి అలవాటు పడి వారి చదువులు వదిలి వారి బంగారు భవిష్యత్తును పాడు చేసుకోవడం జరుగుతుందని ముఖ్యంగా ఇల్లంతకుంట మండలంలోని పలు గ్రామాల్లో మరియు మండల కేంద్రంలో గంజాయి సరఫరా చేస్తే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, అలాగే వర్షాలు గత కొన్ని రోజుల కురవడం వల్ల వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించడం మంచిదని వర్షపు నీరు గుంతల్లో ఉండడం వలన గుంతలు ఏర్పడక పడిపోవడం వల్ల ప్రమాదాలు జరుగుతాయి కాబట్టి తప్పకుండా హెల్మెట్ ధరించడం మంచిదని, అలాగే తల్లిదండ్రులు తమ పిల్లలకు సెల్ ఫోన్లు ఇవ్వకుండా చూసుకోవాలని కొంతమంది పదవ తరగతి నుంచి ఇంటర్, డిగ్రీ చదువుతున్న విద్యార్థులు ఫోన్లో ఆన్లైన్ యాప్ లు డౌన్లోడ్ చేసి బెట్టింగ్లకు పాల్పడుతున్నారని అందుకే తల్లిదండ్రులు తమ పిల్లలపై దృష్టి సారించి వారిని చదువుకునే విధంగా చూసుకోవాలని, ద్విచక్ర వాహనాలు ముఖ్యంగా చిన్న పిల్లలకు, మైనర్లకు ఇవ్వరాదని తప్పకుండా ఎవరైనా కూడా లైసెన్స్, ఇన్సూరెన్స్ తో పాటు హెల్మెట్ ధరించి ఉండాలని, ఒకవేళ ప్రమాదం జరుగుతే ఇవి అన్ని ఉన్నా కూడా లైసెన్స్ లేకుంటే ఇన్సూరెన్స్ వర్తించదని కాబట్టి వాహనదారులు ఇవన్నీ కలిగి ఉండాలని ప్రతి రోజు కూడా పెట్రోలింగ్ నిర్వహించడం జరుగుతుంది కాబట్టి ట్రిపుల్ రైడింగ్, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై కేసులు నమోదు చేస్తామని, అలాగే ఇందిరమ్మ ఇళ్లకు ప్రభుత్వ రెవిన్యూ శాఖ ద్వారా ఇసుక సరఫరా చేస్తుంది కానీ కొంతమంది ట్రాక్టర్ యజమానులు వాటిని పక్కదారి పట్టించడం జరుగుతుంది అని మా దృష్టికి రావడం జరిగింది అలా ఎవరైనా పట్టుపడితే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని ఇల్లంతకుంట ఎస్సై సిరిసిల్ల అశోక్ తెలిపారు.

# సుభాష్ నగర్ గల్లి మైసమ్మ బోనాల పండుగకు హాజరైన చల్మెడ.





**వేములవాడ టౌన్, ( ప్రజాబలం ),** వేములవాడ పట్టణంలోని సుభాష్ నగర్ గల్లి మైసమ్మ బోనాల పండుగకు బుధవారం రోజున టిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జ్ చల్మెడ లక్ష్మీ నరసింహారావు, సీనియర్ బి ఆర్ ఎస్ నాయకులు ఎన్ మనోహర్ రెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా చల్మెడ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం సుభాష్ నగర్ లో గల్లీ మైసమ్మ అమ్మవారికి వార్డు ప్రజలందరూ కలిసి బోనాల పండుగ నిర్వహించడం ఆనవాయితీగా వస్తుందని, వారి కుటుంబాలు ఆయురారోగ్యాలతో, సుఖ సంతోషాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నామన్నారు. ఈ వేడుకలలో మాజీ సెస్ డైరెక్టర్ రామతీర్థపు రాజు, మాజీ వేములవాడ మున్సిపల్ కౌన్సిలర్లు నిమ్మశెట్టి విజయ్, సిరిగిరి చందు, నరాల శేఖర్, గోలి మహేష్, ముద్రకోల వెంకటేశం, నాయకులు నరాల దేవేందర్, నీలం శేఖర్, కొండా నరసయ్య, చింతలటానం నవీన్, వాసాల శ్రీనివాస్, వెంకట్ రెడ్డి, గోస్కుల రవి, మల్లేశం, మంతె సందీప్, గోపు మధు, బియ్యాల ప్రమోద్ తదితరులు పాల్గొన్నారు.

# సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా పదవీ బాధ్యతలు చేపట్టిన కె. రాజేష్

సిద్దిపేట రూరల్ పోలీస్ స్టేషన్ నూతన ఎస్ఐ గా కె. రాజేష్ పదవీ బాధ్యతలు చేపట్టిన తదానంతరం మర్యాదపూర్వకంగా పోలీస్ కమిషనర్ డాక్టర్ బి. అనురాధ. కలసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సి పి అభినందించి శాంతి భద్రతలకు పెద్దపీట వేయాలని, సైబర్ నేరాల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి విధులు నిర్వహించాలని, గంజాయి డ్రగ్స్ ఇతర మత్తుపదార్థాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని సూచించారు. నూతన చట్టాల గురించి ప్రజలకు అవగాహన కల్పించాలని, పోలీస్ స్టేషన్ కు వచ్చే ప్రతి దరఖాస్తుపై విచారణ జరిపి వెంటనే చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రజల రక్షణకు పెద్దపీట వేయాలని తెలిపారు. నేను సైతం కార్యక్రమం ద్వారా గ్రామాలలో పనిచేయని సీసీ కెమెరాలు గ్రామస్తులు మరియు వ్యాపారస్తులతో కలసి వెంటనే రిపేర్ చేయించాలని సూచించారు. మరియు గంజాయి డ్రగ్స్ మత్తు పదార్థాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ గురించి తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకోవాలని సూచించారు. తరచుగా గ్రామాలను సందర్శించాలని తెలిపారు. విపిఓ వ్యవస్థను మరింత మెరుగుపరిచి వారంలో మూడు నాలుగు సార్లు గ్రామాలకు వెళ్ళేటట్లు షెడ్యూల్ తయారు చేసుకోవాలని సూచించారు.

Edited ,Printed Published & Owned by A.SRAVANTHI ,Printed at: SRAVANTHI ENTER PRISES 1-9-18/A,Ramnagar,Hyderabad - 500020, T.S
and Published at 5-2-518,Osmangunj ,Risala Abdulla,Hyderabad -95 Editor; A.SRAVANTHI, RNI NO ; TELTEL/2005/16755 Cell ; 92921 04449
Email;prajaabalamnews@gmail.com